మనం దీపావళి శుభాకాంక్షలు



పాఠకులు, ప్రకటన కర్తలు,
ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు మనం దీపావళి
పర్వదిన శుభాకాంక్షలు

సెలవు

పండుగ సందర్భంగా మా కార్యాలయానికి
ఆదివారం సెలవు. సోమవారం పత్రిక
వెలువడదు. మంగళవారం పున:దర్శనం


– ఎడిటర్

మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - ఆదివారం 8 నవంబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 303 || పేజీలు:12 || వెల రూ.5

13,629 అడుగుల ఎత్తులో ఐఎల్-76ఎండీ ల్యాండింగ్..



2

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA





పారిశ్రామిక హబ్‌గా కొడంగల్

సకల హంగులతో నిర్మించడమే నా కల.. బాధ్యత

రాష్ట్రాన్ని గొప్ప పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయం

2027 డిసెంబర్‌లోగా శంషాబాద్-కొడంగల్ రేడియల్ రోడ్లు

ఇండస్ట్రియల్ హబ్‌లో పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 7, (మనం బ్యూరో): కొడంగల్ రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధితో కొడంగల్ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 2027 డిసెంబర్ లోగా శంషాబాద్ నుండి కొడంగల్ వరకు రేడియల్ రోడ్ నిర్మాణం పూర్తవుతుందని, విమానాశ్రయాలకు దగ్గరగా ఉన్న ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి మంచి అవకాశాలు ఉంటాయని తెలిపారు. శనివారం ఇండస్ట్రియల్ హబ్ ఆవిష్కరణ కార్యక్రమం సందర్భంగా దాదాపు వంద మంది పారిశ్రామికవేత్తలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ ప్రాంతాన్ని గొప్ప పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దడం తన బాధ్యత మాత్రమే కాకుండా, తన కల అని తెలిపారు. కొడంగల్ తోనే నా గుర్తింపు, ఆత్మ గౌరవం...కొడంగల్ పరిసర ప్రాంతాలు అభివృద్ధికి ఎంతో అనువైన ప్రాంతమని, రోడ్లు, ఇతర

...మిగతా 2లో



ఇంతింతై.. రేవంతుడై..

ప్రజారంజక పాలనే ధ్యేయం

మడమ తిప్పని యోధ

ప్రతిపక్షాలకు తనో సింహస్వప్నం

పార్టీలోనూ పట్టుబిగించిన మాంత్రికుడు

జాతీయ స్థాయిలోనూ చురుకైన పాత్ర

మనసున్న మాస్ లీడర్ రేవంత్

హైదరాబాద్, నవంబర్ 07, (మనం బ్యూరో): ఎన్ని ఆటంకాలెదురైనా అనుకున్నది సాధించే వరకు పట్టు వదలని విక్రమార్కుడతడు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు మడమ తిప్పని యోధుడతడు. ఎంతటి విపత్కర పరిస్థితినైనా ఎదురొడ్డి లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించని ధీరుడతడు. అతడే...అన్నా అంటే నేనున్నానంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి. పదేళ్లపాటు రాష్ట్ర పాలనను ఎదురే లేకుండా సాగించిన కల్వకుంట్ల కుటుంబాన్ని బద్దలు కొట్టి మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన రేవంత్ రెడ్డి... ప్రజారంజక పాలనతో అందరి మన్ననలు చూరగొంటున్నారు. అభివృద్ధి పథంతో పాటు సంక్షేమ రంగానికి సమ ప్రాధాన్యతనిస్తూ విశ్రాంతి అనేదే లేకుండా అలుపెరుగని పాలనా దక్షుడిగా పేరు తెచ్చుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా దాదాపు మూడేళ్లలో ఆయన ప్రవేశపెట్టిన సాహసోపేత పథకాలెన్నో. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను క్షేత్ర

ప్రతి ఇంటా దీపావళి
వెలుగులు నిండాలి
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

పరిచయం కాదు.. రొమాంటిక్ రిలేషన్‌షిప్

చైనా స్పైతో సీఈఓ సంబంధం..!



బీజింగ్, నవంబర్ 7: అమెరికాకు చెందిన చిప్ దిగ్గజం ఎన్విడియా సీఈఓ జెన్సన్ హువాంగ్‌పై గూఢచర్యానికి చైనా ఒక మహిళను నియమించుకుందని, ఆమె సహకారంతో ఇంటెలిజెన్స్ సమాచారాన్ని రాబడుతోందని

...మిగతా 2లో

నాకు ఏ పార్టీ మద్దతు లేదు..

బీజేపీలో చేరికపై ధనుష్ క్లారిటీ!



2

ఈ 20 కాదు.. అది 420


పెట్రోల్‌లో అధిక ఇథనాల్‌పై రాహుల్ ఆగ్రహం

ఢిల్లీ, నవంబర్ 7: కర్ణాటకలోని పలు పెట్రోల్ బంకుల్లో విక్రయిస్తున్న పెట్రోల్లో 20శాతం కంటే ఎక్కువగా ఇథనాల్ ఉన్నట్లు వచ్చిన వార్తలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ


...మిగతా 2లో















ఇంతింతై.. రేవంతుడై..

(మొదటి పేజీ తరువాయి)

మొదలుకొని సంపన్న వర్గాల వరకు రేవంతన్నగా ఆప్యాయంగా పిలిపించుకుంటూ అందరి ముఖ్యమంత్రిగా మన్ననలు అందుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అంతగా పట్టించుకోని మహిళలకు రూ.వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వడంతో పాటు దాదాపు 1000 బస్సులను మహిళా సంఘాల ద్వారా అప్పజెప్పి వారికి సమాజంలో పురుషులతో సమానంగా ప్రాధాన్యత ఇచ్చిన తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయారు. అంతేకాకుండా ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టిన గంటల వ్యవధిలోనే గృహలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి మహిళల ఆత్మగౌరవాన్ని సగర్వంగా చాటి రాష్ట్రంలోని అడపడచుల పాలిట సొంత అన్నయ్య అనిపించుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖరీదైన వైద్యాన్ని అందించే ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచి పేదల పాలిటి నిజమైన దేవుడని నిరూపించుకున్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను పటిష్టం చేయాలన్న ఉద్దేశంతో పేదింటి పిల్లలను సైతం పాఠశాలకు రప్పించాలనీ, విద్య ద్వారానే కుటుంబంతద్వారా సమాజం స్థితిగతులు మారతాయన్న దృఢ సంకల్పంతో బ్రేక్ ఫాస్ట్, లంచ్ కూడా ప్రభుత్వ పాఠశాలల్లో అందించడంతో గత మూడేళ్లలో డ్రాపౌట్స్ సంఖ్య విపరీతంగా తగ్గింది. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్న విద్యార్థుల సంఖ్య భారీగా పెరగడమే ఇందుకు నిదర్శనం. ఇక కాంగ్రెస్ పార్టీలో కాకలు తీరిన యోధులను సైతం మెప్పించి అందరి సమ్మతితో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన నేత రేవంత్ రెడ్డి. తన కంటే సీనియర్లైన నేతల సూచనలు, సలహాలు స్వీకరిస్తూ ఎప్పటికప్పుడు పరిపాలనలో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి 'మనం' దినపత్రిక తరపున హార్థిక జన్మదిన శుభాకాంక్షలు.

పారిశ్రామిక హబ్‌గా కొడంగల్

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే పలు కంపెనీలు ఈ ఇండస్ట్రియల్ హబ్ లో నిర్మాణాలు చేపడుతుండడం, మరిన్ని పరిశ్రమలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. భావితరాలకు పరిశ్రమల ద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాల తోపాటు విద్యాసంస్థల ఏర్పాటు కోసం 250 ఎకరాల్లో కొడంగల్ ఎడ్యుకేషన్ హబ్ రూపుదిద్దుకుంటున్నాయన్నారు. రేడియల్ రోడ్ నిర్మాణంతో కేవలం 70 నిమిషాల్లో కొడంగల్ చేరుకునే అవకాశం ఉంటుందని, విదేశీ సంస్థలు పెట్టుబడులు పెట్టే ముందు మొదటిగా అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇండస్ట్రియల్ పార్క్ ఎంత దూరంలో ఉందో చూస్తారని వివరించారు. రానున్న కాలంలో చందన్





వెల్లి, సీతారాంపూర్, పరిగి, కొడంగల్ ప్రాంతాలు గొప్ప పారిశ్రామిక అభివృద్ధికి నోచుకుంటాయని చెప్పారు. కొడంగల్ అన్ని రకాలుగా అభివృద్ధికి అనువైన వ్యూహాత్మక ప్రాంతమని, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలకు తక్కువ దూరంలో ఉండడం విశేషమని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అన్ని రకాల వనరులను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకోసం అధికారులు నిత్యం సహకరించడానికి అందుబాటులో ఉంటారన్నారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు జరుగుతుందని, టాటా టెక్నాలజీస్ సంస్థ సహకారంతో విద్యార్థులకు శిక్షణ అందుతుందన్నారు. అదే విధంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ కోర్సులు అందించవచ్చని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి పారిశ్రామికవేత్తలకు వివరించారు.

13,629 అడుగుల ఎత్తులో ఐఎల్-76ఎండీ ల్యాండింగ్..

వాయుసేన రికార్డు

లడఖ్, నవంబర్ 7: విమానయాన చరిత్రలో భారత వైమానిక దళం అరుదైన రికార్డు సృష్టించింది. వాయుసేనకు చెందిన, రష్యన్ తయారీ భారీ రవాణా విమానం ఐఎల్-76ఎండీ లద్దాఖ్‌లోని 13,629 అడుగుల ఎత్తయిన న్యోమా వైమానిక స్థావరంలో విజయవంతంగా ల్యాండ్ అయింది. ప్రపంచంలో ఈ విమానం సాధించిన అత్యంత ఎత్తయిన ల్యాండింగ్ ఇదేనని వాయుసేన 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. విమాన అసాధారణ సామర్థ్యానికి ఇదొక నిదర్శనమని.. సిబ్బంది అత్యుత్తమ నైపుణ్యాలు, కచ్చితత్వం దీనికి తోడయ్యాయని తెలిపింది. ఈ ల్యాండింగ్‌ను దేశ వ్యూహాత్మక వాయు రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే చారిత్రక ఘట్టంగా పేర్కొంది.చైనాతో వాస్తవ నియంత్రణ రేఖకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న న్యోమా వ్యూహాత్మక వైమానిక స్థావరం.. గత ఏడాది నవంబర్‌లో అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లనూ ల్యాండ్ చేయొచ్చు. లద్దాఖ్‌లో ఈ తరహా నాలుగో వైమానిక స్థావరం ఇది. మిగతా మూడు లేహ్, కార్గిల్, థోయిస్‌లలో ఉన్నాయి. సైనిక అవసరాలకు అనుగుణంగా ఎల్ఏసీ వెంబడి అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్స్ సహా దాదాపు అన్ని ఎయిర్ ఫీల్డ్‌లలో రక్షణశాఖ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోంది. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎయిర్‌ఫీల్డ్‌గా పేరుపొందిన దౌలత్ బేగ్ ఓల్డీ ఏఎల్జీ (16,700 అడుగుల ఎత్తు)లో కూడా సౌకర్యాలను మెరుగుపరుస్తున్నారు.

ఈ 20 కాదు.. అది 420

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా స్పందించారు. ఈ20 కార్యక్రమం కాస్తా 420గా మారిందంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఇది ప్రజల కార్ల నుంచి పెట్రోల్ దొంగలించడమేనని మండిపడ్డారు. ప్రభుత్వ, ప్రైవేట్ చమురు కంపెనీలు.. నిర్దేశించిన బ్లెండింగ్ పరిమితిని మించి ఇంధనాన్ని విక్రయిస్తున్నాయని ఆరోపించారు. ఈ మేరకు కర్ణాటకలోని పలు జిల్లాల నుంచి సేకరించిన ఇంధన నమూనాల ప్రయోగశాల పరీక్షలను ఆయన ఉటంకించారు.

బెంగళూరు, కోలారు, చిక్కబళ్లాపుర, బెంగళూరు గ్రామీణం, రామనగర, మంగళూరు, తుమకూరుతో సహా పలు ప్రాంతాల నుంచి ఈ నమూనాలను సేకరించినట్లు రాహుల్ వెల్లడించారు. వీటిల్లో ఇథనాల్ గాఢతలు 31.2శాతం- 30.5శాతంగా నమోదయ్యాయని తెలిపారు. గుర్తింపు పొందిన ప్రయోగశాలలో పరీక్షించిన మొత్తం 14 నమూనాలలోని 11నమూనాల్లో 20శాతానికి పైగా ఇథనాల్ ఉన్నట్లు తేలిందని చెప్పారు. ఇంధన ట్యాంకులలో ఏమి నింపుతున్నారనే విషయాన్ని ఇప్పటికైనా తెలియజేయాలని ప్రధాని మోడీని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. 20శాతం కంటే ఎక్కువ ఇథనాల్ కలుపుతున్న కంపెనీలపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. ఇటువంటి విధానాల వల్ల ఎవరు ప్రయోజనం పొందుతున్నారని కాంగ్రెస్ అగ్రనేత నిలదీశారు.

కర్ణాటకలో ఈ-20 పేరిట 30శాతం ఇథనాల్ కలిసిన ఇంధనాన్ని విక్రయిస్తున్నారని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి రిజ్వాన్ అర్షద్ శుక్రవారం ఆరోపించారు. దీంతో ఈ విషయంపై రాజకీయ దుమారం రేగింది. అయితే పెట్రోల్లో ఇథనాల్ పరిమాణం ఎక్కువగా ఉందని కర్ణాటక ప్రభుత్వం వాదించడాన్ని కేంద్ర పెట్రోలియం సంస్థలు- ఐఓసీ, బీపీసీఎల్, హెచ్పీసీఎల్ సంయుక్తంగా తోసిపుచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ పరీక్ష ప్రామాణికత సరికాదని తేల్చిచెప్పాయి. కేంద్ర ప్రభుత్వ ప్రమాణాల సంస్థ నిబంధనల మేరకు ఇథనాల్ 19- 21శాతం మధ్య ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించాయి.

పరిచయం కాదు.. రొమాంటిక్ రిలేషన్‌షిప్

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవల వెలువడిన ఓ కథనం సంచలనం సృష్టించింది. ఇంతలోనే మరో విషయం వెలుగులోకి వచ్చింది. ఆ గూఢచారితో హువాంగ్‌కు సన్నిహిత సంబంధం ఉందని అమెరికా భావిస్తోంది. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా ఈ ఏడాది ప్రారంభంలోనే అగ్రరాజ్య అధికారులు ఈ విషయంపై మెమో సిద్ధం చేశారని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.చైనా జాతీయురాలైన అలైస్ హువాంగ్ అలియాస్ హువాంగ్ లీ అనే మహిళను ఆ దేశ గూఢచారిగా అమెరికా నిఘా సంస్థలు ఇటీవల గుర్తించాయి. చైనీస్ ఇన్వెస్టర్ అయిన ఈమె.. ప్రస్తుతం సింగపూర్‌కు చెందిన డేటా సెంటర్ కంపెనీ 'మెగాస్పీడ్'లో కీలక ఎగ్జిక్యూటివ్ హోదాలో పనిచేస్తున్నారు. అమెరికా ఆంక్షలు దాటుకుని ఎన్విడియా ఏఐ చిప్లను ఈ సంస్థ చైనాకు చేరవేస్తోందనే ఆరోపణలు రావడంతో గత బైడెన్ ప్రభుత్వం దర్యాప్తు చేపట్టింది. ఆ క్రమంలోనే అలైస్ హువాంగ్ గూఢచర్యానికి పాల్పడుతున్నట్లు అగ్రరాజ్య నిఘా సంస్థలు గుర్తించినట్లు ఇటీవల కథనాలు వెలువడ్డాయి. ఎన్విడియా సీఈఓ జెన్సన్‌తో పరిచయం పెంచుకున్న ఆమె.. సంస్థకు చెందిన ఏఐ చిప్లు, ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరించి, దాన్ని చైనాకు చేరవేసినట్లు పేర్కొన్నాయి. అయితే, అది కేవలం పరిచయం మాత్రమే కాదని, వారిద్దరి మధ్య సన్నిహిత సంబంధం అని మెమోలో అధికారులు ఆరోపించారు. చైనా మినిస్ట్రీ ఆఫ్ స్టేట్ సెక్యూరిటీ, ప్రిన్సిపల్ సివిలియన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ అలైస్‌ను గూఢచారిగా నియమించుకున్నాయని అగ్రరాజ్య అధికారిక వర్గాలు వెల్లడించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాలో పర్యటించడానికి ముందు ప్రభుత్వంలోని కొద్దిమంది అధికారులకు ఈ మెమో చక్కర్లు కొట్టినట్లు సమాచారం. జెన్సన్ చైనా టార్గెట్‌లో ఉన్నారని ఇటీవల మీడియా కథనాలు రావడంతో.. కాంగ్రెస్ హౌస్ కమిటీల ముందు ఆయనను ప్రైవేట్‌గా ప్రశ్నించాలని రిపబ్లికన్ చట్ట సభ్యులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సమయంలో తాజాగా మెమో విషయం వెలుగులోకి రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఇదిలా ఉంటే.. ఈ గూఢచర్యం గురించి ట్రంప్‌నకు ముందే తెలిసినా ఎన్విడియా వ్యాపార కార్యకలాపాలు, చైనాతో వాణిజ్య సంబంధాలను దృష్టిలో పెట్టుకుని ఈ వ్యవహారంపై ఇప్పుడే చర్యలు చేపట్టవద్దని అధ్యక్షుడు భావించినట్లు ఇదివరకు వార్తలు వచ్చాయి. మరోవైపు మెగాస్పీడ్‌తో తమ వ్యాపార సంబంధాల గురించి ఎన్విడియా ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయకపోవడం గమనార్హం.

క్రమశిక్షణే సైనికుడిని యోధుడిగా మారుస్తుంది

కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



కోల్‌కతా, నవంబర్ 7: కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వాయుసేన సిబ్బందితో కలిసి దీపావళి వేడుకలు చేసుకున్నారు. పశ్చిమ బెంగాల్లోని బాగ్డోగ్రా ఎయిర్‌ఫీల్డ్‌లో నిర్వహించిన వేడుకల్లో సైనికులకు ఆయన మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. భారత వైమానిక దళ సిబ్బంది ధైర్యం, క్రమశిక్షణ, అంకితభావాన్ని ప్రశంసించారు. మన సాయుధ దళాలు సరిహద్దుల్లో రేయింబవళ్లు కాపలాగా ఉండటం వల్లే, దేశ ప్రజలు ప్రతి పండగను ఆనందంగా, స్వేచ్ఛగా జరుపుకొంటున్నారని తెలిపారు. వారు చూపే ధైర్యం, నిస్వార్థ సేవకు యావత్ దేశం ఎంతో గర్వపడుతోందన్నారు. 'ఆపరేషన్ సిందూర్'తో మన వాయుసేన శక్తి ప్రపంచానికి తెలిసిందన్నారు.

'సైనికులలో ధైర్యం, క్రమశిక్షణ లేకపోతే అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఉన్నా అది నిష్ప్రయోజనమే. మన సాయుధ దళాలు క్రమశిక్షణకు మారుపేరు. అదే ఒక సాధారణ సైనికుడిని అసాధారణ యోధుడిగా మారుస్తుంది. అదే సమయంలో డ్రోన్లు, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాలతో సహా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలతో సాయుధ దళాలను సన్నద్ధం చేయాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడానికి మన సైనికులు డ్రోన్లను ప్రయోగించడం, సైబర్ సెక్యూరిటీ వంటి కొత్త యుద్ధ పద్ధతులను నేర్చుకుంటున్నారు. రాబోయే రోజుల్లో సాంకేతికనే ఆయుధంగా చేసుకునేలా మన దళాలు మరింత మెరుగవ్వాలి. మీ అందరి సహకారంతో భారత్ మరింత ముందుకు వెళ్తుందని నాకు పూర్తి నమ్మకం ఉంది' అని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు.

దేశంలో పెరుగుతోన్న రక్షణ ఉత్పాదక సామర్థ్యాలను రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. 'ఆత్మనిర్భర్ భారత్' దిశగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషి వల్లే దేశీయ స్టార్టప్లు, పరిశ్రమలు.. డ్రోన్లు, డ్రోన్ నిరోధక వ్యవస్థలు, సైనికుల కోసం అధునాతన పరికరాలను అభివృద్ధి చేస్తున్నాయన్నారు. భవిష్యత్తులో అన్ని రకాల ఆయుధాలు, క్షిపణులను సొంతంగా తయారు చేసుకునే స్థాయికి భారత్ ఎదగాలనేదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. అదే సమయంలో దేశ సరిహద్దుల్లో సైనికులు అక్కడి ప్రజలతో బలమైన సంబంధాలు కొనసాగించాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. అలా అయితేనే దేశంలో కల్లోలం సృష్టించేందుకు శత్రువులు చేసే ప్రయత్నాలను తిప్పికొట్టగలమన్నారు.

ప్రతి ఇంటా దీపావళి వెలుగులు నిండాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 7: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ప్రజల జీవితాల్లోని చీకట్లను తొలగించి, వారి బతుకుల్లో కొత్త వెలుగులు నింపే లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర సమగ్రాభివద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం కషి చేస్తోందని తెలిపారు. దీపాల వెలుగులతో ఇళ్లను, పరిసరాలను అలంకరించుకుని రాష్ట్ర ప్రజలంతా ఈ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. పండుగ సంబరాల వేళ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ, కాలుష్యానికి తావులేకుండా, ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చిన్నారులు, పెద్దలు అందరూ సురక్షిత వాతావరణంలో దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

బీజేపీలో చేరికపై ధనుష్ క్లారిటీ!

చెన్నై, నవంబర్ 7: తన వెనక ఏ రాజకీయ పార్టీ లేదని స్పష్టం చేశారు హీరో ధనుష్. ఆయన రాజకీయాల్లోకి రానున్నారంటూ కొన్నిరోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ధనుష్‌కు బీజేపీ మద్దతు ఉందంటూ వినిపిస్తున్న ఊహాగానాలపై నటుడు స్పందించారు. అందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. తనకు దిశానిర్దేశం చేసేది ఆ దేవుడేనని పేర్కొన్నారు. తన వెనుక అభిమానులు, ప్రజలే ఉన్నారని స్పష్టం చేశారు. ''ఆ భగవంతుడు, నా అభిమానులు, ప్రజలే నాకు అండ'' అని చెప్పారు. తన తాజా చిత్రం 'ఓం' ఆడియో విడుదల కార్యక్రమంలో ధనుష్ ఈ వ్యాఖ్యలు చేశారు.

కాగా.. 'తమిళగ ఎళుచ్చి కళగం' పేరుతో ధనుష్ కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. ఆ పేరును ఎన్నికల సంఘం వద్ద కూడా నమోదు చేయించుకున్నారంటూ వార్తలు వచ్చాయి. మరోవైపు, తమిళనాడు వ్యాప్తంగా 3 వేల మంది న్యాయ సలహా దారులను నియమించాలని, ఇందుకు సంబంధించిన వ్యవస్థను జిల్లాల వారీగా ఏర్పాటు చేయాలని ధనుష్ నిర్ణయించినట్లు తెలిసింది. ప్రజలకు ఎదురయ్యే చట్టపరమైన సమస్యలు, సామాజిక సమస్యలకు న్యాయ సలహాలను అందించడమే ఈ వ్యవస్థ ఉద్దేశమనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

నాపై ఏడుసార్లు హత్యాయత్నాలు

- అభిషేక్ బెనర్జీ ఆరోపణలు



కోల్‌కతా, నవంబర్ 7: పుట్టినరోజు వేడుకల వేళ.. బీజేపీ కార్యకర్తలు తనపై దాడి చేశారని మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. శనివారం తెల్లవారుజామున 2 గంటలకు కోల్‌కతాలోని కాళీఘాట్లో ఉన్న తన నివాసంపై రాళ్లు, ఇటుకలతో దాడి చేయడంతో తమ పార్టీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. గత ఆరు నెలల్లో తనను హత్య చేయడానికి బీజేపీ నేతలు ఏడు సార్లు ప్రయత్నించారని సంచలన ఆరోపణలు చేశారు.

రెండు రోజులుగా కొందరు తన నివాసం వద్ద రెక్కీ నిర్వహించారని అభిషేక్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఓ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో తృణమూల్ ఎంపీ పేరు ఉన్న బ్యానర్లు, పోస్టర్లను దుండగులు చించేస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వారివద్ద తుపాకులు కూడా ఉన్నాయని అభిషేక్ ఆరోపించారు. తన ఇంటి ముందు ఇంతటి హింస జరుగుతున్నా పోలీసులు జోక్యం చేసుకోలేదని ఆయన మండిపడ్డారు. ఈ దారుణాన్ని ప్రశ్నించడానికి వెళ్తే.. బీజేపీ కార్యకర్తలు తనపైనా దాడి చేయడానికి యత్నించారని తెలిపారు.

''నాపై ఏడుసార్లు హత్యాయత్నాలు జరిగినా పోలీసులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు. ఇలా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో రాష్ట్రవ్యాప్తంగా దుండగులు రెచ్చిపోతున్నారు. మా పార్టీ కార్యాలయాలను ధ్వంసం చేస్తున్నారు. ఒక ఎంపీకే ఇలాంటి పరిస్థితి ఎదురైతే, ఇక రాష్ట్రంలోని సామాన్యుల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి'' అని అభిషేక్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా టీఎంసీ ఎంపీ చేసిన వ్యాఖ్యలను బీజేపీ తోసిపుచ్చింది. రాష్ట్ర ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడానికి ఆయనే ఈ దాడి నాటకం ఆడుతున్నారని విమర్శించింది.

యూఎస్‌లో బిష్ణోయ్ గ్యాంగ్ అనుచరుడు అరెస్ట్

కాలిఫోర్నియా, నవంబర్ 7: బిష్ణోయ్ గ్యాంగ్‌తో సన్నిహిత సంబంధాలున్న హరిచంద్ జాట్ అలియాస్ హ్యారీ బాక్సర్‌ను కాలిఫోర్నియాలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీ పోలీసులు, హరియాణా స్పెషల్ టాస్క్ ఫోర్స్ సమాచారం మేరకు అతడిని నిర్బంధించారు.'' రాజస్థాన్ బన్సూర్ ప్రాంతానికి చెందిన హ్యారీ బాక్సర్ గతంలో జైపూర్‌లో బాక్సింగ్ కోచ్‌గా పనిచేశాడు. తర్వాత బిష్ణోయ్ గ్యాంగ్‌లో చేరి విదేశాల నుంచి వసూళ్ల నెట్‌వర్క్‌ను నడిపిస్తున్నాడు. ఇతడిపై హత్య, హత్యాయత్నం, దాడి, కాల్పులు, వసూళ్లకు సంబంధించిన కేసులు ఉన్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో దర్శకుడు రోహిత్ శెట్టి ఇంటి ముందు కాల్పులకు తానే బాధ్యుడినని హ్యారీ బాక్సర్ సోషల్ మీడియాలో ప్రకటించుకున్నారు. రూ.20 కోట్లు డిమాండ్ చేస్తూ... రణ్వీర్ సింగ్‌కు బెదిరింపు ఆడియో, మెసేజ్‌లు పంపినట్లు ఆరోపణలున్నాయి. గత నెలలో టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటనకు ఆయుధాలు సరఫరా చేసిన రణదీప్ నెట్వర్క్‌తో అతడికి సంబంధాలున్నాయి'' అని అధికారులు తెలిపారు.

ప్రతి విషయాన్ని విచారించడం కుదరదు

- ఈడీకి కర్ణాటక హైకోర్టు మందలింపు



బెంగళూరు, నవంబర్ 7: కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారాలపై కర్ణాటక హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తన దృష్టికి వచ్చిన ప్రతీ విషయాన్ని విచారించే అధికారం ఆ సంస్థకు లేదని పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో దర్యాప్తు చేపట్టడానికి చట్టబద్ధమైన నిబంధనలను దాటవేసే అధికారం దానికి లేదని స్పష్టం చేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద.. ఈడీకి ఉన్న అధికారాల పరిధిలో లేని నేరాలపై ఆ చట్టం కింద విచారణ చేపట్టవద్దని ఆదేశించింది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజగౌడ, ఆయనతో సంబంధం ఉన్న ఇతరులతో సహా పలువురు పిటిషనర్లపై దర్యాప్తు సంస్థ చేపట్టిన విచారణలను జస్టిస్ ఎంఐ అరుణ్ కొట్టేశారు.

ఆస్తుల జప్తును ధ్రువీకరిస్తూ పీఎంఎల్ఏ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వును హైకోర్టు కొట్టివేసింది. అలాగే, పిటిషనర్లలో ఒకరి నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను తిరిగి ఇవ్వాలని ఆదేశించింది. కోలారు, చిక్కబళ్లాపుర జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల యూనియన్ లిమిటెడ్ (కోముల్)లోని ఉద్యోగుల నియామకాల్లో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై ఇటీవల ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే దర్యాప్తును సవాల్ చేస్తూ..నమోదైన పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ అవకతవకలపై ఎఫ్ఐఆర్ లేదా, అధికారిక క్రిమినల్ కేసు నమోదయితేనే ఈడీకి దర్యాప్తు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది. అంతే కానీ మనీలాండరింగ్ ఆరోపణలను సుమోటోగా తీసుకొని దర్యాప్తు చేపట్టడం సరైన చర్య కాదని పేర్కొంది.

అంతరిక్షంలో అరుదైన ఘనత.. అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రత సృష్టి

బీజింగ్, నవంబర్ 7: మానవ చరిత్రలోనే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతను నమోదు చేసి చైనా శాస్త్రవేత్తలు చారిత్రక ఘనత సాధించారు. భౌతిక శాస్త్రంతో సాధ్యమయ్యే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతను అబ్ సొల్యూట్ జీరో అంటారు. ఆ స్థాయికి అత్యంత చేరువగా వెళ్లి చైనా శాస్త్రవేత్తలు రికార్డు సృష్టించారు. తమ సొంత అంతరిక్ష కేంద్రంలో నిర్వహించిన ప్రయోగంలో భాగంగా రూబీడియం అణువుల సమూహాన్ని 9.7 పికోకెల్ విన్ ఉష్ణోగ్రతకు చల్లబరిచారు.

అమెరికా దాడుల భయం

అయోడిన్ టాబ్లెట్లు పంచుతున్న ఇరాన్!

టెహ్రాన్, నవంబర్ 7: ఇరాన్ తన ప్రజలకు అయోడిన్ టాబ్లెట్లను పంచుతోంది..! యుద్ధరంగంలో ఉన్న తమకు ఎప్పుడు ఎలాంటి పరిస్థితి ఎదురవుతుందో తెలియని అనిశ్చితిలో ముందుజాగ్రత్తగా వాటిని పంపిణీ చేస్తోంది. యుద్ధానికి, అయోడిన్ టాబ్లెట్లకు సంబంధం ఏంటనే అనుమానం రావొచ్చు.

''అణు కేంద్రాలకు సమీపంలో ఉన్న ప్రజలకు ముందు జాగ్రత్తగా మేం అయోడిన్ టాబ్లెట్లను పంపిణీ చేస్తున్నాం. ట్రంప్‌ను నమ్మలేం. ఆయన ఈ నేరానికి పాల్పడే అవకాశం ఉంది'' అని ఇరాన్ అధికారి ఒకరు మీడియాకు వెల్లడించారు. ఇటీవల అమెరికాతో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉన్న సమయంలో కూడా అణు స్థావరాల చుట్టూ 2 నుంచి 3 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ప్రజలకు టెహ్రాన్ ఈ ఔషధాలను పంచింది. ప్రజలపై రేడియోధార్మికత ప్రభావాన్ని తగ్గించేందుకే ఈ చర్యలు తీసుకుంటోంది. రేడియేషన్ వల్ల థైరాయిడ్ కణాలు దెబ్బతింటాయి. దాంతో ఆ గ్రంథి పనితీరు మందగించి హార్మోన్లను సరిగా ఉత్పత్తి చేయలేదు. అణు ప్రమాదాల వల్ల రేడియేషన్‌కు గురైనవారు భవిష్యత్‌లో థైరాయిడ్ క్యాన్సర్ బారిన పడే



ప్రమాదం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

రెండురోజుల క్రితం జాతీయ భద్రతా బృందంతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీ అయ్యారు. ఇరాన్‌పై సైనికచర్య కొనసాగించాలా వద్దా..? అనే దానిపై చర్చించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఇరాన్ లోని పికాక్స్ పర్వత ప్రాంతంలో ఉన్న అణుకేంద్రంపై దాడి జరగొచ్చన్న భయాలు నెలకొన్నాయి. అమావాస్య కావడంతో రాబోయే రెండు రోజుల్లో చంద్రుడికాంతి తక్కువగా ఉంటుందని, అది దాడులు చేయడానికి అనుకూలమైన సమయమనే ఆందోళన వ్యక్తమవుతోంది. యుద్ధం పునఃప్రారంభించే విషయంలో తమ ప్రభుత్వం త్వరలో ఒక నిర్ణయం తీసుకుంటుందని ఇటీవల ట్రంప్ చెప్పారు. ఇవన్నీ కలిసి దాడుల భయాలను పెంచుతున్నాయి.

లాస్ ఏంజెలెస్‌లో నయా చరిత్ర

మేయరు ఎన్నికల్లో భారత సంతతి నేత నిత్యా రామన్ గెలుపు

అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాల పాలనా పీఠాలపై మనోళ్లే

న్యూయార్క్, నవంబర్ 7: అమెరికాలో భారత సంతతి నాయకురాలు నిత్యా రామన్ (45) సరికొత్త చరిత్ర సృష్టించారు లాస్ ఏంజెలెస్ నగర మేయరుగా ఆమె ఎన్నికయ్యారు. ఈ పదవిని దక్కించుకున్న తొలి దక్షిణాసియా సంతతి వ్యక్తి నిత్యా రామనే. డెమోక్రటిక్ పార్టీకి చెందిన ఈమె 'డెమోక్రటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికా' మద్దతుతో సిటింగ్ మేయరు కరెన్ బాస్‌ను తాజా ఎన్నికల్లో ఓడించారు. నిత్యా రామన్కు 52.1% ఓట్లు రాగా, బాస్ 47.9% ఓట్లతో సరిపెట్టుకున్నారు. ఈమె విజయంతో.. అమెరికాలోని రెండు అతిపెద్ద నగరాల మేయరు పీఠాలను భారత సంతతి నేతలే అధిష్ఠించినట్లయింది.అతిపెద్ద నగరం న్యూయార్క్ మేయరుగా భారత సంతతి నేత, డెమోక్రటిక్ సోషలిస్టు జొహ్రాన్ మమ్దానీ నిరుడు ఎన్నికైన సంగతి గమనార్హం. నిత్యా రామన్ గతంలో కరెన్ బాస్ మద్దతుదారే. ఈ ఎన్నికల ముంగిట కూడా తొలుత బాస్‌కే ఆమె మద్దతు పలికారు. నామినేషన్ల దాఖలుకు తుది గడువు ముగిసే ముందు అనూహ్యంగా బరిలో దిగారు.

నీతో గడపాలి? దా వచ్చేయ్?

- కంప్లెంట్ చేస్తే? ట్రాన్స్‌ఫర్ చేస్తా అని బెదిరించిండు?
- వేధింపులపై సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ముందు మహిళా ప్రొఫెసర్ కంటతడి
- ఛీఛీ.. నీచుడా.. మీరు ప్రొఫెసర్లా.. బ్రోకర్లా..?
- కీచక ప్రొఫెసర్‌పై అగ్రికల్చర్ వర్సిటీ విద్యార్థి ఫైర్
- ఇలాంటివి ఉపేక్షించడం సరికాదు?
- ఇలాంటి నీచ మనస్తత్వం ఉన్నవారిని శాశ్వతంగా బహిష్కరిస్తే మరోసారి తప్ప చేయరు?





హైదరాబాద్, నవంబర్ 7, మనం ప్రతినిధి : మహిళా ప్రొఫెసర్‌ను వేధించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్యపై చర్యలు తీసుకోవాలని తోటి ప్రొఫెసర్లు, యూనివర్సిటీ సిబ్బంది, విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. జరిగిన ఘటనపై యూనివర్సిటీ విద్యార్థి రేవంత్ సర్కార్‌పై ఫైర్ అయ్యారు. ఈ సందర్భంగా మహిళా ప్రొఫెసర్‌కు అండగా నిలిచిన పలువురు యూనివర్సిటీ విద్యార్థి మాట్లాడుతూ.. ఈ ఘటన వెనుక ఒక సిండికేట్ బ్యాచ్ తయారైంది. యూనివర్సిటీలో ప్రొఫెసర్ల ముసుగులో ఉన్న బ్రోకర్లు తయారయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఈ బ్రోకర్ల ముసుగులో ఉన్న ప్రొఫెసర్లను గుర్తించి వారిపై ఎంక్వైరీ జరిపించి.. వాళ్లను యూనివర్సిటీ నుంచి శాశ్వతంగా బహిష్కరిస్తే తప్ప ఈ యూనివర్సిటీ బాగుపడదని డిమాండ్ చేస్తున్నామన్నారు.

మీరు ప్రొఫెసర్లా లేదంటే ప్రొఫెసర్ల ముసుగులో ఉన్న బ్రోకర్లా.. ఈ యూనివర్సిటీ పరిపాలనా భవనాన్ని ఏం చేయడానికి వచ్చారు.. ఓయో రూంలుగా మారుస్తారా..? అని సదరు విద్యార్థి ఫైర్ అయ్యాడు. ఈ రోజు మా తోటి స్కాలర్స్ వచ్చి సార్ మాకు ఈ సమస్య ఉందన్నారు. మాకు విద్యాబుద్దులు నేర్పించిన గురువుకే ఈ రకంగా మీరు శిక్షను విధిస్తే.. రేపు వచ్చే స్కాలర్లకు మీరు ఏ విధమైన దిశానిర్దేశం చేస్తరని నిలదీశారు. ఒకసారి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆలోచన చేసుకోవాలని సూచించారు. ఈ విశ్వవిద్యాలయం పట్ల మీకు కొంచెం కూడా కనికరం ఉండదా..? సిండికేట్ బ్యాచ్ ఏదైతే ఉన్నదో తక్షణమే మీరు నైతిక విలువలు లేకుండా ప్రొఫెసర్లుగా కాకుండా వేరే రకంగా ప్రవర్తిస్తే మాత్రం మీ జీవితానికి ఎలాంటి అర్థం లేకుండా పోతుందని హెచ్చరించాడు.

కంప్లెంట్ చేస్తే? ట్రాన్స్‌ఫర్ చేస్తా అని బెదిరించిండు?.. వేధింపులపై మహిళా ప్రొఫెసర్‌ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అల్దాస్ జానయ్య తనను వేధించాడని మీడియా సాక్షిగా మహిళాప్రొఫెసర్ తన ఆవేదన వెలిబుచ్చారు. ఈ మేరకు సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో వేదింపులకు గురైన సదరు మహిళా ప్రొఫెసర్ మాట్లాడుతూ.. జానయ్య బయోలాజికల్ నీడ్స్ అనే పదం వాడటం, నీవు 20 ఏండ్ల ముందు పుట్టి ఉంటే పెళ్లి చేసుకునేవాడిని అంతిష్టమని అనడం.. నీవు నాతో బయటకు రావాల్సింది.. మొదట నాకు అర్థం కాలేదు.. ఆయనను తానూ ఓ తండ్రిలా భావించాను కానీ, ఆయన ఏం మాట్లాడుతున్నారో అర్థం చేసుకోలేకపోయానన్నారు. రెండో రోజు మళ్లీ నాకు కాల్ వచ్చిందని, నాతో బయటకు రా.. నీతో కొంచెం టైం గడపాలంటూ నీచంగా మాట్లాడరన్నారు. హైదరాబాద్‌లో అయితే అందరూ తెలిసినవాళ్లుంటారు.. ఇక్కడైతే ఎవరూ ఉండరన్నారు.. వీసీ ఫోన్ చేసి ఇలా మాట్లాడటం తానూ జీర్ణించుకోలేకపోయానన్నారు. ఆయనను ఈ రకంగా భావించలేదన్నారు. చాలా వరకు ఆయన మాటలను కట్ చేయడానికి ప్రయత్నించా.. కొన్నిసార్లు మనల్ని మనం ఒప్పుకోవడానికి కూడా టైం పడుతుంది. 6వ తేదీన ఉదయం రా కలుద్దాం అన్నారు.. పదే పదే అనడంతో నా సహోద్యోగి, పీహెచ్డీ చేస్తున్న అమ్మాయిని అక్కడికి భయంతో పట్టుకొని వెళ్లాను. మా డీఆర్ సార్ బలరాంతోపాటు అందరూ ఉన్నారు.. ఇంక ఆయన ఏం మాటలు మాట్లాడడేమో ఏం అనడేమో అని నేనక్కడి నుంచి వచ్చేస్తుంటే కారు వెళ్లిపోయే ముందు ఆపి తొందరగా వచ్చేసెయ్.. నువ్వొక్కడే ఉండొద్దన్నాడు. ఆరోజు రాత్రి నాకు మళ్లీ కాల్‌చ్చింది..నేను ఫోన్ ఎత్తలేదు.. 15 నిమిషాల తర్వాత ఫోన్ చేశా.. ఏం చేస్తున్నావమ్మా అంటే నా భర్తతో మాట్లాడుతున్నా అని చెప్పా.. ఆయనేమో ఫోన్‌లో నేనున్నది హిస్సార్‌లో ఒకసారి నాతో ఢిల్లీకి రావాల్సిందంటే తాను రాలేనని చెప్పానన్నారు.

నీకు చిన్న చిన్నపిల్లలున్నారు.. నీ భర్త ఇక్కడుండడు అబుదాబిలో ఉంటడు.. నిన్ను నువ్వు ప్రూవ్ చేసుకోకపోతే ట్రాన్స్‌ఫర్ చేస్తా అని చెప్పేసరికి భయమేసిందని ఆ మహిళా ప్రొఫెసర్ కన్నీటి పర్యంతమయ్యింది. ఆయనకు చాలా పొలిటికల్ పవర్ ఉందని, ఆర్థికంగా బలవంతుడని, ఆయనకు చాలా మంది మద్దతిచ్చే వాళ్లు కూడా ఉన్నారంటూ తనను జరిగిన ఆన్యాయాన్ని, ఆవేదనను మీడియా ఎదుట రోదిస్తూ చెప్పింది.

పాత గుడ్డలతో బెడ్ షీట్లు

ఇవి మీ మనవడు కప్పుకుంటాడా..?

ప్రభుత్వం నిర్లజ్జగా, నిస్సిగ్గుగా దోపిడీ చేస్తొంది?

సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ ఫైర్



హైదరాబాద్, నవంబర్ 7, మనం ప్రతినిధి : పేదింటి బిడ్డలయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లలు చదువుకునే గురుకులాల్లో పంపిణీ చేసే బెడ్ షీట్లలో కూడా నిస్సిగ్గుగా రేవంత్ రెడ్డి సర్కార్ దోపిడీ చేస్తుందని ఫైర్ అయ్యారు. గురుకుల టెండర్లను టెస్కో ద్వారానే ఇవ్వాలని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్లజ్జగా, నిస్సిగ్గుగా ఒక దోపిడీ వ్యవస్థను ఎట్ల నడుపుతుందనడానికి సోదాహరణంగా మీకు పత్రికా సమక్షంలో ఇవన్నీ ముందు పెట్టమన్నారు. చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రం (కార్పెట్). మరమగ్గాల మీద పాత వస్త్రాలను రీసైకిల్ చేసి తద్వారా యార్‌ను తయారు చేసిన వస్త్రం. దాదాపు ఇది రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది పేదింటి బిడ్డలకు కార్పెట్లుగా ఇచ్చే పథకం ద్వారా అటు చేనేత కార్మికుల నుంచి ఇటు మహత్మాల్ గుజరాత్కు చెందిన కంపెనీ, రకరకాల కంపెనీల దగ్గర నుండి తీసుకున్నారు. వాళ్లేమో సిల్క్ మిక్స్డ్ రీసైకిల్డ్తో తయారు చేసిన కార్పెట్ ఒకటి.. మన తెలంగాణ చేనేత కార్మికులు కష్టించి సాంచల మీద గంటల తరబడి కాళ్లు, చేతులు ఆడిస్తూ వాళ్లకున్న సృజనాత్మకత, మేధా శక్తిని మొత్తం కలగలిపి తయారు చేసిన కార్పెట్ ఇంకోటి.. ఒకటి కప్పుకుంటే వెచ్చగుంటది.. ఇంకోటేమో బొచ్చు అంటుకుంటదని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ వివరించారు.

పేదింటి బిడ్డలయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లలు చదువుకునే గురుకులాల్లో పంపిణీ చేసే బెడ్ షీట్లలో కూడా నిస్సిగ్గుగా రేవంత్ రెడ్డి సర్కార్ దోపిడీ చేస్తుందని ఫైర్ అయ్యారు. బెడ్ షీట్ల టెండర్లను చేనేత కార్మికులకు ఇవ్వకుండా.. పాత గుడ్డలను రీ సైక్లింగ్ చేసే మఫత్ లాల్ కంపెనీకి గురుకుల టెండర్లను కట్టబెట్టి రూ. 100 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డదన్నారు. పాత గుడ్డలతో తయారు చేసిన బెడ్ షీట్స్ రేవంత్ రెడ్డి మనవడు కప్పుకుంటాడా..? అని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు.



ఎమర్జెన్సీ నిర్ణయం పొరపాటే

కాంగ్రెస్ అగ్రనేత సోనియా

ఢిల్లీ , నవంబర్ 7: దేశంలో అత్యయిక స్థితి విధించిన ఘటనకు సంబంధించి కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమర్జెన్సీ విధించాలనే నిర్ణయం ఓ పొరపాటు అని అన్నారు. తన అత్తగారు, నాటి ప్రధాని ఇందిరా గాంధీ కూడా ఇదే భావించి ఉండవచ్చని అనుకుంటున్నట్లు చెప్పారు. తన ఆత్మకథ పుస్తక రూపంలో త్వరలో విడుదల కానున్న నేపథ్యంలో ఓ బ్రిటిష్ దినపత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చిన ఆమె ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సంజయ్ గాంధీని అదుపులో ఉంచి ఉంటే, ఎమర్జెన్సీ విధించిన తర్వాత జరిగిన నష్టంలో చాలావరకు నివారించి ఉండవచ్చని అభిప్రాయప డ్డారు. ''ఎమర్జెన్సీ విధించడం పొరపాటే. ఇందిరాగాంధీ కూడా అదేవిధంగా భావించారు. ఎమర్జెన్సీ నిర్ణయంపై కుటుంబంలో భిన్నాభిప్రాయా లు వ్యక్తమయ్యాయి. దీనిని రాజీవ్ గాంధీ కూడా వ్యతిరేకించారు. వచ్చే ఎన్నికల వరకు వేచి ఉండాలని తన తల్లికి చెప్పినప్పటికీ.. ఆమె చిన్న కుమారుడు సంజయ్ మాత్రం పట్టుబట్టారు. ప్రతిపక్షం తన తల్లిని నాశనం చేస్తుందని, వారిని కట్టడి చేయాలని ఓ రోజు ఫ్యామిలీ డిన్నర్లో వాదించారు. రాజీవ్ తన తల్లిని నిలదీయడానికి ప్రయత్నించగా.. ఆమె వినడానికి నిరాకరించారు. ఈ విషయం కుటుంబంలో కూడా ఉద్రిక్తతలను పెంచింది. ఎమర్జెన్సీ విధించిన తర్వాతే అసలేం జరుగుతుందో తనకు అర్థమైందని.. ప్రజాస్వామ్య హక్కులు కట్టడి చేయడం, హెబియస్ కార్పస్ నిలిపివేయడం వంటివి జరిగాయన్నారు. కానీ, అది రాజ్యాంగబద్ధంగానే జరిగిందని సోనియా గాంధీ స్పష్టం చేశారు.

ఫిట్ కాప్‌తో సంపూర్ణ ఆరోగ్యం

తెలంగాణలో త్వరలో అందుబాటులోకి హెల్త్ యాప్

రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మంది పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

యాప్ ద్వారా ఆరోగ్య వివరాల నమోదు: డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్, నవంబర్ 7, మనం ప్రతినిధి : తెలంగాణ పోలీస్ శాఖ తమ సిబ్బంది ఆరోగ్యం, శ్రేయస్సును మెరుగుపరిచేందుకు ఒక కీలకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 90 వేల మందికి పైగా పోలీసు సిబ్బంది కోసం 'ఫిట్ కాప్' అనే సమగ్ర ఆరోగ్య నిర్వహణ యాప్‌ను తీసుకురానున్నట్లు డీజీపీ సీవీ ఆనంద్ తాజాగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, విధి నిర్వహణలో తీవ్రమైన ఒత్తిడి, సమయాభావం కారణంగా సిబ్బంది ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారని, ఈ యాప్ ఆ లోటును భర్తీ చేస్తుందని ఆయన తెలిపారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్, ఇతర సంస్థల సహకారంతో 'టీజీ ఫిట్ కాప్' పేరుతో ఈ పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నారు. రాబోయే 30 నుంచి 45 రోజుల్లో దీన్ని అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు డీజీపీ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది.

ఈ యాప్ ద్వారా సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్య వివరాలను నమోదు చేయవచ్చు. మధుమేహం, రక్తపోటు, బాడీ మాస్ ఇండెక్స్, జీవనశైలి అలవాట్లు, ధూమపానం, మద్యపానం వంటి కీలక సమాచారాన్ని సేకరిస్తారు. ఇకనుంచి సిబ్బంది తమ మొబైల్ ఫోన్ నంబర్‌తో ఈ సిస్టమ్‌లో లాగిన్ కావచ్చు. వారు అందించిన సమాచారం ఆధారంగా వారిని తక్కువ, మధ్యస్థ, అధిక రిస్క్ గ్రూపులుగా వర్గీకరిస్తారు. ఈ రిస్క్ అసెస్‌మెంట్ ద్వారా ఎవరికి తక్షణ వైద్య సహాయం అవసరమో గుర్తిస్తారు. హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సల్మాన్ మాట్లాడుతూ, రిస్క్ స్థాయిని బట్టి ప్రత్యేక కాల్ సెంటర్ ద్వారా సిబ్బందిని సంప్రదిస్తామని తెలిపారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు, ఆసుపత్రిలో చికిత్స, ఆరోగ్య సలహాలు, కౌన్సెలింగ్ అందిస్తామని వివరించారు.

ముఖ్యంగా కిడ్నీ సంబంధిత వ్యాధులు, మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి, అవి తీవ్రం కాకముందే వైద్య సహాయం అందించడం 'ఫిట్ కాప్' ప్రాథమిక లక్ష్యం.. ఈ కార్యక్రమం ద్వారా సిబ్బందిలో ఆరోగ్య స్పృహను పెంచి, నివారణ చర్యలను ప్రోత్సహించాలని పోలీస్ శాఖ భావిస్తోంది. తెలంగాణ పోలీస్ శాఖలోని అన్ని విభాగాలు, విభాగాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నారు. 'ఫిట్ కాప్' సిబ్బంది ఆరోగ్యాన్ని కాపాడటానికి ఒక ముఖ్యమైన వ్యవస్థాగత యంత్రాంగంగా ఎదుగుతుందని డీజీపీ ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు.

17 ఏళ్ల నిరీక్షణకు తెర..

కూకట్‌పల్లి ఫ్లాట్లపై సుప్రీం కీలక ఆదేశాలు

101 మందికి నవంబర్ 23లోగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీం ఆదేశం



హైదరాబాద్, నవంబర్ 7, మనం ప్రతినిధి : కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు ఫేజ్-15లో ఇళ్ల కోసం గత 17 ఏళ్లుగా నిరీక్షిస్తున్న కొనుగోలుదారులకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. వివాదంలో ఉన్న 101 ఫ్లాట్లను ఈ నెల 23వ తేదీలోగా కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని తెలంగాణ హౌసింగ్ బోర్డును సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ అరుణ్ పల్లిలతో కూడిన ధర్మాసనం శనివారంనాడు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఇందులో ప్రధానంగా వాయిదాల చెల్లింపుల్లో జాప్యం జరిగిన వారి నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయాలా? వద్దా? అనే అంశాన్ని హైకోర్టు తేల్చే వరకు వేచి చూడాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, వడ్డీ వివాదం తేలే వరకు కొనుగోలుదారులను ఇబ్బంది పెట్టకూడదని పేర్కొంటూ, తక్షణమే రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టులో కేసు పరిష్కారమయ్యే వరకు ఈ ఇళ్లను ఇతరులకు విక్రయించడం లేదా బదిలీ చేయడం వంటి చర్యలు చేపట్టరాదని అటు హౌసింగ్ బోర్డుకు, ఇటు కొనుగోలుదారులకు న్యాయస్థానం ఆంక్షలు విధించింది.

2009లో హౌసింగ్ బోర్డు 'సంపూర్ణం' పథకం కింద కేపీహెచ్‌బీలో ఇళ్లను కేటాయించింది. తొలుత ఫ్లాట్ ధరను రూ.30.80 లక్షలుగా నిర్ణయించి, ఆ తర్వాత దానిని రూ.47.85 లక్షలకు పెంచడంతో వివాదం మొదలైంది. నిర్మాణంలో జాప్యం, అదనపు ధరల వసూలుపై కొనుగోలుదారులు వినియోగదారుల ఫోరం నుంచి జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్సీ) వరకు న్యాయపోరాటం చేశారు. బోర్డు వైపు నుంచే జాప్యం జరిగిందని నిర్ధారించిన ఎన్‌సీడీఆర్సీ, కొనుగోలుదారుల నుంచి 14 శాతం వడ్డీ వసూలు చేయడం సమర్థనీయం కాదని గతంలో తీర్పునిచ్చింది.

ఈ తీర్పును సవాలు చేస్తూ హౌసింగ్ బోర్డు తొలుత హైకోర్టును, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించింది. సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా.. తమ వైపు నుంచి జరిగిన ఆలస్యానికి 6 శాతం వడ్డీ చెల్లిస్తామని, అయితే కొనుగోలుదారుల నుంచి మాత్రం 14 శాతం వడ్డీ వసూలుకు అనుమతించాలని బోర్డు కోరింది. బోర్డు వాదనను తోసిపుచ్చిన ధర్మాసనం, బాధితుల 17 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలుకుతూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది.

కొడంగల్ టెండర్లలో

పొంగులేటికి లబ్ధి

- రూ.1450 కోట్ల నుంచి రూ.6825 కోట్లకు ప్రాజెక్టు వ్యయం పెంచిండ్రు?
- ఇది క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ: కేటీఆర్ ఫైర్



హైదరాబాద్, నవంబర్ 7(మనం ప్రతినిధి): తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు 5 రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు. అయితే, ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో ఘాటుగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ.. ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి' అని అన్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

సీఎం తమ్ముడు కొండల్‌రెడ్డికి మెమొరీ లాస్

అందుకే ఇన్‌కం ట్యాక్స్ కట్టలేనోనికి ఇన్ని కోట్లు ఎక్కడివి?

సీఎం రేవంత్, అన్నదమ్ములపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

హైదరాబాద్, నవంబర్ 7, మనం ప్రతినిధి : సీఎం రేవంత్ రెడ్డి తమ్ముళ్లకు ఒక్కసారిగా ఇ(న్ని)ంత ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయో బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. ఈ మేరకు శనివారంనాడు తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తమ్ముళ్ల ఆస్తుల గురించి అసలు విషయం చెప్తా మీకు.. 2023లో బిజినెస్ స్టాండర్డ్ పేపర్లో వచ్చిన జాబితా ఇది.. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఒక నోటీస్ ఇచ్చిందన్నారు. ఇది పేపర్‌లో ఎగవేతదారుల నోటీస్ వస్తదని, మొదట సమాచారమిస్తరని, ఒకటికి రెండుసార్లు ఫోన్ చేస్తరని, బ్యాంకులో అప్పు తీసుకున్నవ్.. పైసలు కట్టు అని ఫోన్ చేస్తారని, ఆ తర్వాత మెయిల్స్ వస్తదని, ఆ తర్వాత వారి మనుషులను పంపుతరు.. ఇట్లా ఒకదాని వెనుక ఒకటి వరుసగా వస్తయని క్రిశాంక్ పేర్కొన్నారు. ఇలా ఆ లిస్ట్‌లో అనుముల కొండల్ రెడ్డి చేరారని, ఆయన ఇంటికి కూడా నోటీస్ అంటించారన్నారు. గచ్చిబౌలి, శేరిలింగంపల్లిలోని 300 గజాల జాగా తనఖా పెట్టి బ్యాంకు నుంచి రూ.2.89 కోట్లు అప్పు తీసుకున్నారని, ఎప్పుడిస్తవ్ వాపస్ అని హెచ్‌డీఎఫ్‌సీ ఇంత పెద్ద అడ్వర్టైజ్‌మెంట్ వేసిందని మన్నె క్రిశాంక్ మీడియాకు తెలిపారు. అయితే, 2023లో అప్పుడు మీరు తీసుకున్న రూ.2.89 కోట్లు అప్పు తీర్చడానికి డబ్బులు లేవు? కానీ.. ఇవాళ మీరు 50 వేల కోట్ల ఆస్తులు ఎట్లా నిర్మాణం చేస్తుండ్రని ఆయన ప్రశ్నించారు. ఎట్లా రక్షణ వైమానిక శాఖ చైర్మన్ అయిపొయిండొ జరా చెప్పాలన్నారు. ఇదిలాఉంటే, రూ.200 కోట్ల జాగాను ప్రభుత్వం ఆయనకు ఎందుకు ఇచ్చిందో చెప్పాలన్నారు. ఇంకా దారుణమేంటంటే.. ఇది 2025 కోర్టు డాక్యుమెంట్.. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఇన్ కమ్ ట్యాక్స్ వర్సెస్ అనుముల కొండల్ రెడ్డి బ్రదర్ ఆఫ్ చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి. ఈ ఆర్డర్ వచ్చిందన్నారు. ఇది 2025 నవంబర్ 26న రేవంత్ రెడ్డి తమ్ముడు కొండల్ రెడ్డి ఇన్కం ట్యాక్స్ ఎగ్గొట్టేసి.. ఇన్కం ట్యాక్స్ కట్టకుండా కొన్ని సంవత్సరాలు దాటవేస్తుంటే.. ఆస్తులు పెరుగుతుంటే ఇన్కం ట్యాక్స్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్ కేసు వేశారన్నారు. ఈ కేసు వేసినప్పుడు ఎందుకు కట్టలేదని అని నిలదీశారు. రేవంత్ రెడ్డి తమ్ముడు రక్షణ వైమానిక శాఖ చైర్మన్, టెసరాక్ట్ కంపెనీ చైర్మన్, కొండల్ రెడ్డికి మెమొరీ లాస్ ఉందని ఏద్దేవా చేశారు. ఇదే కోర్టులో చెప్పారన్నారు.. అందుకే కొన్ని సంవత్సరాలు ఇన్కం ట్యాక్స్ కట్టలేదు అని అన్నారు. అనుముల కొండల్ రెడ్డి మెడికవర్ ఆస్పత్రిలో కంటిన్యూగా ట్రీట్‌మెంట్‌లో ఉన్నారని, ఇలాంటి మెమరీ లాస్ ఉన్నవాడికి టెసెరాక్ట్ సంస్థ పేరిట రూ. 200 కోట్ల భూమి కట్టబెట్టారని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తనదైన శైలీలో సెటైర్లతో ముఖ్యమంత్రిని, ఆయన అన్నదమ్ములపై ప్రశ్నల వర్షం కురిపించారు.

అజ్ఞానపు చీకట్లు తొలగాలి?

జ్ఞాన కాంతులను ఆహ్వానించాలి

ప్రజల కష్టాలు తొలగి, సర్వ సంపదలు చేకూరాలి

తెలంగాణ ప్రజలకు కేసీఆర్ దీపావళి శుభాకాంక్షలు



హైదరాబాద్, నవంబర్ 7, మనం ప్రతినిధి : బీఆర్ఎస్ అధినేత, ఉద్యమ దళపతి, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అజ్ఞానపు చీకట్లను తొలగించుకుని జ్ఞాన కాంతులను ఆహ్వానించాలనే సందేశాన్ని దీపావళి పండుగ మనకందిస్తుందని అన్నారు. ప్రజల కష్టాలు తొలగి, సర్వ సంపదలు చేకూరేలా, రాష్ట్రం తిరిగి ప్రగతి పథంలో పయనించేలా లక్ష్మీదేవి అమ్మవారు ప్రజలపై కరుణాకటాక్షాలు అందించాలని ప్రార్థించారు. బాణాసంచా కాల్చే సందర్భంలో తగు జాగ్రత్తలు తీసుకుంటూ కుటుంబ సభ్యులందరూ పండుగ సంబురాలు నిర్వహించుకోవాలని కేసీఆర్ సూచించారు.

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF T.G.LTD.
Operation Circle, Saroornagar

Short Tender Notice No.05/2026-27

Sl.No. 1); 2); 21); 22) for Bifurcation of 11KV Feeders through e-procurement @ https://tender.telangana.gov.in with Bid downloading start date 04.11.2026 and 3); 19) for Bifurcation of 11KV Feeder at Construction Division and 4); 5); 6); 7) for erection of breakers at Lines Division and 8) for Providing of Mobile DTR at Champapet Division and 9); 10) ST Reserved; 11) for various works at Ibrahimpatnam Division and 20) for Providing of Mobile DTR at Saroornagar Division and 12) to 18) for supply of various material at Saroornagar circle office with bid sale start date 04.11.2026. Further details please visit www.tgsouthernpower.org. Contact Phone No. 8712472302.

Sd/- Superintending Engineer / Elect, Op/Saroornagar Circle, Hyd.

DIPR RO No.13075-PP/CL/ADVT/2026-27 Dt:03-11-2026

సమతా సౌభాగ్యం

దీపావళి.. దివ్వెల దరహాసాల దీప్తి
చీకటి గర్భంలో చైతన్యపు స్ఫూర్తి
మట్టి ప్రమిదల్లో మానవీయ పరిమళం
మనసు కావ్యాల్లో పదనిసలు సరళం..!
నరకాసురుడిపై సత్యభామ శరాగ్ని
నరరూప అసురులపై ప్రజాగ్రహ జ్వాలాగ్ని
బాధల బందీలలో స్వేచ్ఛా జ్వలనం
మహత్వపు జాడలే మళ్ళీ మననం..!

అధికార మదం.. అహంకారపు వాడలు
అవినీతి రాజ్యం.. అన్యాయపు జాడలు
కులమత విద్వేషాల కుతంత్రపు కత్తులు
మానవత్వ గొంతుపై పరతంత్రపు ఉచ్చులు..!

ఆకలి కేకల వెనుక ఆవేదనల అరణ్యం
అసమానతల నీడలో అణగారిన కారుణ్యం
అబలల కన్నీళ్ల వెనుక ఆగని దాష్టీకం
ఆకాంక్షల బతుకుల్లో నిండైన దార్శనికం..!
ఎక్కడ చూసినా నరకాసుర ఛాయలే...
ఎక్కడ వెతికినా విభజనల పాయలే
ప్రతి ఆడబిడ్డలో అగ్నిశిఖల ఆవేశం
ప్రతి గుండె దరువులో శిఖరాగ్ర ప్రవేశం..!

ప్రమిదల వెలుగుల్లో సమతా సౌభాగ్యం
దివ్వెల వరుసల్లో సమభావపు సౌజన్యం
పటాసుల మోతల్లో అసలుందా పరమార్థం
పీడనలు తొలగటమే ఈ వాక్యపు పూర్వార్థం..!
నరకాసురుల సంహారమే అంతిమ సంధ్య
సత్యభామల శౌర్యమే ఎత్తైన పర్వత వింధ్య
నరునిలోని రాక్షసునికి నిప్పుల నైవేద్యం
మనిషిలోని మానవతే దీపావళి వైవిధ్యం..!

- డా.కటుకోర్వుల రమేష్
9949083327

ఎడిట్ పేజీ కోసం మీ
సామాజిక విశ్లేషణలు,
సాహిత్య వ్యాసాలు
manamlekhalu@ gmail.com
మెయిల్ అడ్రస్‌కు పంపగలరు

ఈ పేపర్ కోసం
https://www.manamepaper.com/
వెబ్‌సైట్‌లో చూడండి- ఎడిటర్

చమురు దీపాలను వెలిగిద్దాం!



పండుగ అంటే ఆనందాల వెలుగులు విరజిమ్మాలి.. ఆహ్లాదకరమైన వాతావరణం వెల్లివిరియాలి. కానీ మన ఆనందం ప్రకృతికి ఆవేదనగా, మన సంబరాలు సమాజానికి కాలుష్య భారంగా మారితే ఆ పండుగ పరమార్థమే ప్రశ్నార్థకమవుతుంది. చీకటిని పారద్రోలి వెలుగులు నింపే దీపావళి పండుగను పొగ, శబ్ద కాలుష్యాలతో నింపడం ఎంతవరకు సమంజసం? సంప్రదాయాన్ని కాపాడుకుంటూనే ప్రకృతిని పరిరక్షించుకునే బాధ్యత మనపై లేదా? నేటి ఆధునిక సమాజం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయమిది. మన భారతీయ జీవన విధానంలో ఆచార సంప్రదాయాలు, పండుగల సంస్కృతి విడదీయలేని అనుబంధాన్ని కలిగి ఉన్నాయి. భిన్న మతాలు, కులాలు, సంస్కృతులకు నిలయమైన మన దేశంలో ప్రతి ఒక్కరూ తమ పండుగలను ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు.

హిందువులు ప్రధానంగా జరుపుకునే దీపావళి పండుగకు పురాణాల్లో అనేక ఇతిహాస నేపథ్యాలున్నాయి. నరకాసురుడి సంహారానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారనే కథనం ప్రసిద్ధి చెందింది. అశ్వయుజ అమావాస్య రోజున జరుపుకునే ఈ పండుగతోపాటు కార్తీక మాసమంతా దీపాలు వెలిగించడం మన సంప్రదాయం.

దీపజ్యోతి జ్ఞానానికి, సౌభాగ్యానికి, శుభానికి, మనోవికాసానికి ప్రతీక. అజ్ఞానమనే చీకటిని తొలగించి విజ్ఞానమనే వెలుగును ప్రసరింపజేయడమే దీపావళి అంతరార్థం. అలాంటి పవిత్రమైన పండుగను బాణాసంచా మోతలతో, విషపూరిత పొగలతో కాలుష్యమయం చేసుకోవడం ఎంతవరకు సముచితం?దీపావళి వచ్చిందంటే చాలు.. వీధులన్నీ టపాసుల మోతలతో దద్దరిల్లుతాయి. ఆకాశమంతా పొగతో నిండిపోతుంది. పిల్లలు బాణాసంచా కాల్చేందుకు ఉత్సాహం చూపిస్తే, పెద్దలు ప్రమాదాలు జరుగుతాయేమోనని ఆందోళన చెందుతుంటారు. బాణాసంచా నుంచి వెలువడే పొగ, సూక్ష్మ ధూళికణాలు, రసాయనాలు వాయు కాలుష్యాన్ని పెంచుతాయి. విపరీతమైన శబ్దాలు వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో బాధపడేవారికి ఇబ్బందులు కలిగిస్తాయి. పశుపక్షాదులు భయాందోళనలకు గురవుతాయి.

వర్షాకాలంలో పెరిగే క్రిమికీటకాలను బాణాసంచా కాల్చడం ద్వారా నిర్మూలించవచ్చనే నమ్మకాలు కూడా ప్రచారంలో ఉన్నాయి. కానీ వాటి పేరుతో విచ్చలవిడిగా టపాసులు కాల్చడం పర్యావరణ పరిరక్షణకు పరిష్కారం కాదు. జీవవైవిధ్యం ఇప్పటికే మానవ తప్పిదాల వల్ల ప్రమాదంలో పడుతున్న తరుణంలో మరింత కాలుష్యాన్ని పెంచడం మన భవిష్యత్తుకే ముప్పు.



విచిత్రమేమిటంటే రాజకీయ సభలు, ప్రారంభోత్సవాలు, విజయోత్సవాలు, శుభకార్యాలు, ఇతర వేడుకలు ఇలా సందర్భమేదైనా బాణాసంచా కాల్చడం ఒక ఆనవాయితీగా మారింది. ఆనందానికి, విషాదానికి తేడా లేకుండా టపాసుల వినియోగం పెరుగుతోంది. వ్యాపార సంస్థల లాభాపేక్ష, ప్రజల ఆడంబర పోటీలు ఈ సంస్కృతికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. సంప్రదాయం పేరుతో పర్యావరణానికి హాని చేయడం విజ్ఞత అనిపించుకోదు.

పర్యావరణ కాలుష్యంపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో బాణాసంచా వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలా? లేక ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలా? అనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో శాస్త్రవేత్తల పరిశోధనల ఫలితంగా గ్రీన్ క్రాకర్స్ అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర శాస్త్ర, పారిశ్రామిక పరిశోధనా మండలి పరిధిలోని నాగపూర్‌కు చెందిన నేషనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ వీటి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించింది.

సాధారణ బాణాసంచాతో పోలిస్తే గ్రీన్ క్రాకర్స్‌లో కొన్ని హానికర రసాయనాల వినియోగాన్ని తగ్గించేలా ప్రత్యేక ఫార్ములాలను రూపొందించారు. వీటి వినియోగంతో సంప్రదాయ టపాసులతో పోలిస్తే ఉద్గారాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. కొన్ని రకాల గ్రీన్ క్రాకర్స్ తక్కువ శబ్దాన్ని వెలువరించేలా రూపొందించారు. అయితే ఇవి పూర్తిగా కాలుష్యరహితమైనవి కావు. అందువల్ల వీటిని కూడా నిర్దేశిత పరిమితుల్లోనే వినియోగించాలి. గ్రీన్ క్రాకర్స్ పేరుతో మార్కెట్లో లభించే ప్రతి బాణాసంచా పర్యావరణహితమైనదని భావించకూడదు. సంబంధిత అధికారుల ధ్రువీకరణ, గుర్తింపు వివరాలు, క్యూఆర్ కోడ్ వంటి ప్రమాణాలను పరిశీలించి కొనుగోలు చేయాలి. నిబంధనలకు విరుద్ధంగా తయారైన నకిలీ ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. గ్రీన్ క్రాకర్స్ ఒక ప్రత్యామ్నాయ మార్గమే తప్ప కాలుష్య సమస్యకు సంపూర్ణ పరిష్కారం కాదనే విషయాన్ని గుర్తించాలి.

దీపావళి పండుగలో ప్రధాన ఆకర్షణ దీపాల వెలుగులే. అలాంటప్పుడు ఖరీదైన బాణాసంచా కోసం వేలాది రూపాయలు ఖర్చు చేయడం కంటే సంప్రదాయ చమురుదీపాలను వెలిగిస్తూ పండుగను జరుపుకోవడం మేలైన ఆచరణ. ఇంటి ముంగిట, దేవాలయాల్లో, వీధుల్లో దీపాల వరుసలు వెలిగిస్తే ఆధ్యాత్మిక ఆనందంతోపాటు మన సంస్కృతీ సంప్రదాయాల వైభవం ప్రతిబింబిస్తుంది.

ప్రజలు స్వచ్ఛందంగా బాణాసంచా వినియోగాన్ని క్రమంగా తగ్గించుకోవాలి. పిల్లలకు చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణ విలువలను నేర్పాలి. బాణాసంచా కొనుగోలుకు వెచ్చించే డబ్బులో కొంత భాగాన్ని నిరుపేదలకు సహాయం చేయడానికి వినియోగిస్తే పండుగ ఆనందం మరింత అర్థవంతమవుతుంది. పర్యావరణహిత పండుగలపై పాఠశాలలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక సంస్థలు విస్తృతంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలి. అదేవిధంగా బాణాసంచా తయారీదారులు భద్రతా ప్రమాణాలు, పర్యావరణ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. నకిలీ గ్రీన్ క్రాకర్స్ తయారీ, విక్రయాలను అరికట్టాలి. ప్రభుత్వాలు నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలి. బాణాసంచా కాల్చేటప్పుడు ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

పండుగల పరమార్థం మనుషుల మధ్య ప్రేమానురాగాలు, సౌభ్రాతృత్వం, సంతోషాలను పెంపొందించడం. మన క్షణికానందం కోసం ప్రకృతిని, పశుపక్షాదులను, ప్రజారోగ్యాన్ని బలి చేయడం సంస్కృతి కాదు. అజ్ఞాన చీకట్లను చీల్చి విజ్ఞాన జ్యోతులను వెలిగించే మనం పర్యావరణ పరిరక్షణలోనూ ఆదర్శంగా నిలవాలి. పుష్పగుచ్ఛాలు, బహుమతులు, ఆత్మీయ పలకరింపులతో ఆనందాలను పంచుకుందాం. తైలదీపాల వెలుగు లతో ఇంటింటా సౌభాగ్యాన్ని నింపుదాం. గ్రీన్ క్రాకర్స్ వినియోగాన్ని పరిమితం చేస్తూ కాలుష్యాన్ని తగ్గిద్దాం. దీపావళి వెలుగులు మన ఇళ్లలోనే కాదు.. మనిషి మనసు ల్లోనూ, ప్రకృతి ఒడిలోనూ విరజిమ్మాలి. అదే నిజమైన పండుగ సంస్కృతి.. అదే భావితరాలకు మనం అందించగలిగే వెలుగుల వారసత్వం!

- మేకిరి దామోదర్
9573666650

బహుజనులకి బహువిధ వెలుగుల దీపావళి



భారతీయ సమాజంలో దీపావళి పండుగకు శతాబ్దాల చరిత్ర ఉంది. అయితే ఈ పండుగ అసలు ఇతివృత్తం ఏమిటి? హిందూ సంప్రదాయంలో జరుపుకునే దీపావళికి, గౌతమ బుద్ధుడు, బౌద్ధ ధమ్మానికి సంబంధించిన దీపాల సంప్రదాయానికి మధ్య ఉన్న సంబంధం ఏమిటి? అనే ప్రశ్నలను చారిత్రక దృష్టితో పరిశీలించాల్సిన అవసరం ఉంది.



హిందూ పురాణ సంప్రదాయంలో దీపావళికి అనేక కథనాలు ఉన్నాయి. శ్రీరాముడు రావణుడిని సంహరించి 14 సంవత్సరాల అరణ్యవాసం అనంతరం అయోధ్యకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని ఒక కథనం ప్రచారంలో ఉంది. అలాగే శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించిన విజయానికి గుర్తుగా నరక చతుర్దశిని జరుపుకుంటారని మరో కథనం ఉంది. దీపావళి అమావాస్య రోజున లక్ష్మీదేవిని పూజించి సంపద, ఐశ్వర్యం కోరుకోవడం కూడా హిందూ సంప్రదాయంలో ప్రధానమైన ఆచారం. ఈ కథనాలన్నింటిలోనూ చెడుపై మంచి విజయం, చీకటిపై వెలుగు విజయం అనే భావనకు ప్రాధాన్యత ఉంటుంది.

సిద్ధార్థ గౌతముడు రాజభవనాన్ని విడిచిపెట్టి జ్ఞానాన్వేషణలో పయనించి, బోధ్గయలో జ్ఞానోదయం పొంది గౌతమ బుద్ధుడిగా మారాడు. అనంతరం తన జన్మస్థలమైన కపిలవస్తుకు తిరిగి వెళ్లి తన తండ్రి శుద్ధోధనుడు, కుటుంబ సభ్యులను కలుసుకొని ధమ్మబోధ చేశాడు. బుద్ధుడు కపిలవస్తుకు తిరిగి వచ్చినప్పుడు ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారనే కథనం కొన్ని వర్గాల్లో ప్రచారంలో ఉంది. అయితే ఈ సంఘటనను దీపావళి పండుగ ఆరంభంగా నిర్ధారించే ప్రాచీన చారిత్రక ఆధారాలు లేవు. కాబట్టి దానిని నిర్ధారిత చరిత్రగా పేర్కొనడం సరికాదు.

బౌద్ధ సంప్రదాయంలో దీపం అనేది అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పొందడానికి ప్రతీక. ప్రజ్ఞ, కరుణ, అహింస, సమానత్వం, ధమ్మ మార్గం బౌద్ధ తత్వానికి ప్రధానమైన విలువలు. బుద్ధ పూర్ణిమను బుద్ధుని జననం, జ్ఞానోదయం, మహాపరినిర్వాణంతో అనుసంధానించి జరుపుకుంటారు. అయితే బుద్ధ పూర్ణిమ, దీపావళి రెండూ ఒకే పండుగలు కావు.

భారతదేశ చరిత్రలో బౌద్ధమతం, బ్రాహ్మణీయ సంప్రదాయాల మధ్య తాత్విక పోటీలు, పరస్పర ప్రభావాలు, సాంస్కృతిక మార్పిడులు జరిగాయి. కొన్ని హిందూ పురాణాల్లో గౌతమ బుద్ధుడిని విష్ణువు అవతారంగా పేర్కొనడం దీనికి ఒక ఉదాహరణ. అయితే పురాణాల్లోని బుద్ధ అవతార చిత్రణకు, బౌద్ధమతంలో జ్ఞానోదయం పొందిన గౌతమ బుద్ధుని అసలు బోధనలకు మధ్య వ్యత్యాసం ఉంది. కొంతమంది సామాజిక చరిత్రకారులు దీనిని బౌద్ధ సంప్రదాయాలను బ్రాహ్మణీయ మతపరమైన చట్రంలోకి తీసుకువచ్చే ప్రక్రియగా విశ్లేషిస్తారు. అయితే దీపావళి పండుగ మొత్తం బౌద్ధమతం నుంచి స్వీకరించబడిందని నిరూపించే ఆధారాలు లేవు.

దీపావళికి జైనమతంలో కూడా ఒక ప్రత్యేకమైన చారిత్రక నేపథ్యం ఉంది. జైనమత 24వ తీర్థంకరుడైన వర్ధమాన మహావీరుడు కార్తీక అమావాస్య రోజున పావాపురిలో మహాపరినిర్వాణం పొందాడని జైన సంప్రదాయం చెబుతుంది. ఆయన నిర్వాణాన్ని స్మరించుకుంటూ ప్రజలు దీపాలు వెలిగించారనే సంప్రదాయం జైన మతంలో ఉంది. దీనికి జైన సాహిత్యంలో కూడా ఆధారాలు ఉన్నాయి.

చారిత్రకంగా పరిశీలిస్తే దీపావళికి ఒకే ఒక్క మూలం ఉందని చెప్పలేం. హిందూ సంప్రదాయంలో రాముడి అయోధ్య ప్రవేశం, నరకాసుర వధ వంటి పురాణ ఇతివృత్తాలు.. జైనమతంలో మహావీరుని నిర్వాణం.. వివిధ బౌద్ధ సమాజాల్లో దీపాల ద్వారా జ్ఞానాన్ని స్మరించుకునే సంప్రదాయాలు కనిపిస్తాయి. ఇవన్నీ వేర్వేరు మత, సాంస్కృతిక నేపథ్యాలకు చెందినవి. ఏ ఒక్క మత సంప్రదాయాన్నే నిజమైన దీపావళిగా ప్రకటించడం కంటే, దాని చారిత్రక పరిణామాన్ని ఆధారాలతో అర్థం చేసుకోవడం ముఖ్యం. అంతిమంగా గౌతమ బుద్ధుడు మానవ సమాజానికి ప్రజ్ఞ, కరుణ, సమానత్వం, అహింస అనే విలువలను బోధించాడు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ కూడా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆధారంగా సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షించారు.

కాబట్టి దీపావళి సందర్భంగా కేవలం ఇళ్లలో దీపాలు వెలిగించడమే కాకుండా సమాజంలో ఉన్న కులవివక్ష, అంటరానితనం, మూఢనమ్మకాలు, అజ్ఞానం అనే చీకట్లను తొలగించడానికి కృషి చేయాలి. అంతేగాని మానవ దైనందిన జీవితంలో హిందూ మతంలోని సాటి మనుషుల పట్ల దళితులు, శూద్రులు అనే కారణంతో అంటరానితనాన్ని, అనాగరిక విలువలు పాటిస్తే అత్యున్నతమైన రాజ్యాంగ విలువలు పరిడవిల్లవు. కాబట్టి ఆధునిక సమాజంలో ఏ మతంలోనైనా సామాజిక రుగ్మతలు ఉన్నప్పటికీ ఉన్నతమైన విద్యావంతులుగా సామాజిక రుగ్మతలు, మూఢ నమ్మకాలు వ్యతిరేకిస్తూ స్వేచ్ఛ సమానత్వ సోదర భావ ప్రజాస్వామ్యం గణతంత్ర విలువలు పాటిస్తూ సాటి మనుషుల పట్ల ప్రేమ ఆప్యాయత సామాజిక గౌరవం, సామాజిక న్యాయాన్ని పాటించాలి అదే అన్ని మతాలలోని పండగల యొక్క సారాంశం. ఒక్క రోజు మాత్రమే దీపావళి పండుగని జరుపుకొని ప్రతిరోజు సాటి మనుషుల పట్ల సామాజిక అసమానతలు చూపిస్తే నాగరిక మనుషులుగా చెప్పుకోలేము అనేటి సత్యాన్ని మరువకూడదు. నిజమైన వెలుగు అంటే జ్ఞానం. నిజమైన విజయం అంటే అసమానతలపై సమానత్వం సాధించిన విజయం. దీపాలు ఇళ్లలోనే కాదు, మనిషి ఆలోచనల్లో కూడా వెలగాలి. అదే మానవతా విలువలతో కూడిన సమాజానికి నిజమైన దీపావళి. స్వాతంత్ర్య, గణతంత్ర భారతం సాధించుకొని 75 సంవత్సరాలు పూర్తి అయినప్పటికి కూడా స్వాతంత్ర్య అనంతరం కేంద్ర ప్రభుత్వాన్ని, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలని 10% ఉన్న అగ్ర కులాలే పాలించడం మూలంగా రాజ్యాంగ ఫలాలు సంపూర్ణంగా అమలు కాక తరతరాలుగా అగ్ర కులాలు చేత సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా సాంస్కృతికంగా పీడనకు గురైన బహుజనులైన 90% ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ జీవితాల్లో దీపావళి వెలుగులు లేకుండా నేటికీ కూడా అంధకారంగానే ఉన్నది. కాబట్టి సమాజం చేత పీడనకు గురైన అంతిమంగా మెజార్టీ ప్రజలైన బీసీ ఎస్సీ ఎస్టీలు భారతదేశాన్ని పాలించినప్పుడే భారత రాజ్యాంగం సంపూర్ణంగా అమలు అవుతూ ప్రజల మధ్య స్వేచ్ఛ సమానత్వ సోదరభావ విలువలు పరిడవిల్లుతూ సామాజిక న్యాయం జరుగుతూ అసమానతలు లేకుండా మనుషులందరూ సమానంగా ఉంటూ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులతో కూడిన నిజమైన దీపావళిని చూడగలము, అదియే నిజమైన దీపావళి, అగ్రకులాల చేత పీడితులైన బహుజనులు ఐన బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలు పాలించడమే నిజమైన దీపావళి. శోకం లేని సమానత్వ సమాజ ఏర్పాటు కోసం నేడు దళిత బహుజన నాయకులు అగ్రకుల ప్రజాస్వామ్య వాదులు సామాజిక న్యాయంతో కూడిన భారతదేశం కోసం సంకల్ప బద్ధులై కలిసికట్టుగా సామాజిక రాజకీయ పోరాటం చేయాలి అనేటి విషయాన్ని బుద్ధిజీవులైన విద్యావంతులు మేధావులు సామాన్యులు సైతం గ్రహించాల్సిన చారిత్రక సత్యం.

- పుల్లెంల గణేష్
9553041549

ప్రతిరోజూ పండగే

అజ్ఞానతిమిరాన్ని పారద్రోలి
జ్ఞానసుషమను దీపింపచేసి
జగత్తునంతా విజ్ఞాన పథంలో
నడిపేదే దీపావళి పండగ. ఈ దివ్వెల పండగ...
సకల మానవకోటి హృదయాల్లో
ఆనంద దీపికలు తేజరిల్లేలా చేసైదై,
మనసు,మనసు పెనవేసుకొని
పురివిప్పితేనే 'మమతల మతాబులు'
వెలుగులు విరజిమ్ముతాయనే భావన కలిగించేదై,
జనుల మదిలోని అసూయను వదిలింపచేసి,
స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఆలోచింపచేస్తూ
వారి మస్తిష్కాల్లో 'కాకరపువ్వొత్తుల్లా'
విజ్ఞానకాంతిసుమాలు విచ్చుకునేట్లు చేసి,
అంతరిక్షంలోకి దూసుకుపోయే'రాకెట్లలా',
విజయవిహాయసంలోకి తోడ్కొనిపోయేదై,
జ్ఞాన,ధర్మ పథాల నడుపుతూ
మానవసంబంధాల జాగృతిని కలుగచేసేదై,
ఉండాలని కోరుకుంటూ... ఈ జగాన్ని
మమతల కోవెల,అనుబంధాల పందిరి
అనురాగాల పొదరిల్లు,
ఆనందాల హరివిల్లు,
ఆప్యాయతల సమాహారాన్ని
వాత్సల్యాల స్రవంతిగా మలచుకొని
ప్రేమానురాగాల పల్లకిని అధిరోహిద్దాం.
అప్పుడే..ప్రతిరోజూ పండుగే,
నిత్యమూ దీపావళే

- వేమూరి శ్రీనివాస్
9912128967

వృద్ధుల జీవితాల్లో కానరాని దీపావళి



ఇంటి ముందు దీపాల వరుసలు వాకిట్లో రంగవల్లులు ఆకాశంలో మెరిసే బాణసంచా వెలుగులు కొత్త బట్టలు, పిండివంటలు, బంధుమిత్రుల సందడి దీపావళి పండుగ అంటే సాధారణంగా కనిపించే దృశ్యాలివి. కానీ ఇదే పండుగ రోజున కొన్ని వృద్ధుల ఇళ్లలో మాత్రం నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. గడప ముందు దీపం వెలిగినా, గుండెల్లో చీకటి తొలగడం లేదు. పండుగ పూట పిల్లల రాక కోసం ఎదురుచూసే కన్నవారి కళ్లలో ఆనందం కంటే ఆవేదనే ఎక్కువగా కనిపిస్తోంది. కానీ కాలం మారుతుంది. పిల్లలు ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబాలతో బిజీ అవుతారు. తల్లిదండ్రులు మాత్రం వయసు మీద పడటంతో శారీరకంగా బలహీనపడతారు. ఒకప్పుడు కుటుంబానికి ఆధారమైన వారు ఇప్పుడు ఇతరుల సహాయం అవసరమైన స్థితికి చేరుకుంటారు. ఇక్కడే అసలు పరీక్ష మొదలవుతుంది.

తల్లిదండ్రులు తమ ఆస్తులను పిల్లలకు పంచిపెట్టాలనుకోవడం సహజం. కానీ ఆ పంపకం ప్రేమతో జరగాలి. జీవితాంతం తల్లిదండ్రులకు భద్రత కల్పించే విధంగా ఉండాలి. ఆస్తి బదిలీ అయిన తర్వాత వారి పట్ల బాధ్యత ముగిసిపోయినట్లు భావించడం మాత్రం అమానవీయమైన వైఖరి.దీపావళి రోజు ఇంటి గుమ్మంలో వెలిగించే ఒక్క దీపం కంటే, తల్లిదండ్రుల హృదయాల్లో వెలిగించే ఆప్యాయతా దీపమే వారికి ఎంతో గొప్పది.

వృద్ధుల సంక్షేమం కోసం భారతదేశంలో చట్టపరమైన రక్షణలు ఉన్నాయి. తల్లిదండ్రులు, వృద్ధ పౌరుల నిర్వహణ, సంక్షేమ చట్టం-2007 ప్రకారం, తమను తాము పోషించుకోలేని తల్లిదండ్రులకు పిల్లలు పోషణ కల్పించాల్సిన బాధ్యత ఉంటుంది.



చట్టాలు ఉన్నంత మాత్రాన సమస్యలు పరిష్కారమవు తున్నాయా? వృద్ధుల ఆర్థిక భద్రత, ఆరోగ్య సంరక్షణ, మానసిక ఆరోగ్యం, సామాజిక గౌరవం కోసం ప్రభుత్వాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.వృద్ధులను గౌరవించడం అంటే గతాన్ని గౌరవించడం మాత్రమే కాదు. బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు మనిషికి అవసరమయ్యేది ప్రేమ, భద్రత, ఆప్యాయత. ఆ అవసరాలు వయసుతో తగ్గవు. మరింత పెరుగుతాయి.

దీపావళి పండుగ వెలుగులు కేవలం ఇళ్ల గోడలపై ప్రతిబింబిస్తే సరిపోదు. మనసుల్లోనూ వెలగాలి. తల్లిదండ్రుల జీవితాల్లోనూ ఆ కాంతి ప్రసరించాలి. ఒక ఇంట్లో వంద దీపాలు వెలిగించినా, ఆ ఇంటి పెద్దల కళ్లలో కన్నీళ్లు ఉంటే ఆ పండుగకు పరిపూర్ణత లేదు. లక్షల రూపాయల ఆస్తులు సంపాదించినా, కన్నవారికి ఒక పూట ఆప్యాయతతో కూడిన భోజనం పెట్టలేకపోతే ఆ సంపదకు అర్థం లేదు. తల్లిదండ్రులు పిల్లలకు ఇచ్చేది కేవలం ఆస్తి కాదు. జీవితం. విలువలు. సంస్కారం. ప్రేమ. త్యాగం. వారు తమ పిల్లల కోసం జీవితాన్ని ధారపోస్తారు. కానీ చివరి దశలో తమ పిల్లల ప్రేమ కోసం అడుక్కోవాల్సిన పరిస్థితి రావడం సమాజం తలదించుకోవాల్సిన విషాదం.ఆస్తుల కోసం తల్లిదండ్రులను వేధించే సంతానం ఒక్కసారి గుర్తుంచుకోవాలి మీరు పంచుకుంటున్నది కేవలం భూమి, ఇల్లు, డబ్బు మాత్రమే కాదు. మీ తల్లిదండ్రుల జీవితకాల కష్టార్జితం. వారి చెమట చుక్కలు. వారి కన్నీళ్లు. వారి త్యాగాలు. చనిపోయిన తల్లిదండ్రుల పార్థివదేహం ముందు ఆస్తుల కోసం పంచాయతీలు పెట్టే బదులు, వారు జీవించి ఉన్నప్పుడే వారి మనసులను గెలుచుకోండి. వారి చివరి రోజులను ప్రశాంతంగా, గౌరవంగా గడిపేలా చూడండి. దీపావళి నాడు పటాసులు పేల్చడం, దీపాలు వెలిగించడం మాత్రమే పండుగ కాదు. మనలోని స్వార్థాన్ని దహనం చేయడం కూడా పండుగే. ఆస్తులపై మమకారాన్ని తగ్గించి, మనుషులపై ప్రేమను పెంచుకోవడం కూడా పండుగే.

వృద్ధుల జీవితాల్లో దీపావళి వెలుగులు కానరాకపోతే అది వారి జీవితాల్లోని చీకటి మాత్రమే కాదు, మన సమాజ మానవత్వం మసకబారుతున్నదనే సంకేతం. ఇప్పటికైనా మారాలి. కన్నవారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. వారు జీవించి ఉన్నప్పుడే వారి విలువను గుర్తించాలి. ఎందుకంటే

తల్లిదండ్రులు ఉన్న ఇల్లు ఒక చిరునామా మాత్రమే కాదు అది మన జీవితానికి మూలం. వారు వెలిగించిన దీపాల కాంతిలోనే మన జీవితాలు వెలుగులు నింపుకున్నాయి. ఆ దీపాలు ఆరిపోకముందే వారి జీవితాల్లో మనం వెలుగులం కావాలి.

- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
9010128884



దీపం

తొలి సంధ్య దీపం
చీకట్లకు శాపం!
ప్రాతః సంధ్యకు
స్వాగత వందనం !

దీపం ఉన్న చోటు
తిమిరాలకు చేటు
వెలుగుల వేటు
చిమ్మ చీకట్లకు కాటు!

ఇంటికి దీపం ఇల్లాలు
జగతికి దీపం జగన్నాథుడు
ఇంటికైనా జగతికంతటికైనా
వెలుగు లే చైతన్య దీపం !

- పట్లోళ్ళ బక్కారెడ్డి
9705315250

అల్లం బుచ్చమ్మకు పలువురు ప్రముఖుల ఘన నివాళి



మంథని, నవంబర్ 7(మనంన్యూస్): అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ కవులు,రచయితలు, జర్నలిస్టు సోదరుల తల్లి కామ్రేడ్ అల్లం బుచ్చమ్మకు పలువురు ప్రముఖులు శనివారం నివాళులర్పించారు. మంథని,రామగుండం మాజీ ఎమ్మెల్యేలు పుట్ట మధు,కోరుకంటి చందర్,ఏపీఎంసీ చైర్మన్ కొత్త శ్రీనివాస్,టీయూఎస్ ఆర్టీసీ రాష్ట్ర అధ్యక్షుడు నగునూరి శేఖర్,నేత రవి,న్యాయవాది ఇనుముల సతీష్, విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు బాలసాని రాజయ్యతో పాటు పలువురు బుచ్చమ్మ పార్థివ దేహం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు.అంత్యక్రియలకు హాజరైన అల్లం సోదరులు రాజయ్య, వీరయ్య,నారాయణలను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు.గత కొంత కాలంగా వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బుచ్చమ్మ శుక్రవారం కన్నుమూశారు.వారి స్వగ్రామమైన మంథని మండలంలోని గాజులపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న,ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్,డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ గంట చక్రపాణి,కల్లుగీత మాజీ చైర్మన్ పల్లె రవికుమార్,ఆంధ్రజ్యోతి మాజీ ఎడిటర్ కే.శ్రీనివాస్,టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్,కోశాధికారి యోగానంద్,టీయూడబ్ల్యూజే రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నగునూరి శేఖర్,సీనియర్ జర్నలిస్టులు అవ్వారి భాస్కర్,కందుకూరి రమేష్ బాబు, గొర్ల బచ్చన్న,బీఆర్ లెనిన్,చెల్మల సుధాకర్,తిరుపతి నాయక్,లాయక్ పాషా,అంకరి ప్రకాష్,ఎలగందుల రవీందర్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

పేదల కల నెరవేరింది

లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్





చిగురు మామిడి ముడి నవంబర్ 7 (మనం న్యూస్): దశాబ్ద కాలంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ప్రభుత్వం సాకారం చేస్తోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 12వ వార్డులో పొన్నం కోమల సమ్మయ్య ముదిరాజ్ దంపతులకు ప్రజా పాలన ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరై, నిర్మాణం పూర్తయిన సందర్భంగా నిర్వహించిన మన ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన కోమల సమ్మయ్య దంపతులకు నూతన వస్త్రాలు అందించి, స్వీట్లు తినిపించి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారి ఇందిరమ్మ ఇంట్లో కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి బాణసంచా కాల్చి దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దశాబ్ద కాలంగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కలను ప్రజా పాలన ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సాకారం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. ఈ దీపావళి పండుగను తమ సొంత ఇందిరమ్మ ఇళ్లలో జరుపుకుంటున్న లబ్ధిదారులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొదటి దశలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 2,500కు పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. పూర్తయిన ఇళ్లలో ఈరోజు దీపావళి సంబరాలు జరుపుకోవడం సంతోషంగా ఉంది. 500 గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. మధ్యలో నిలిచిపోయిన మరో 500 ఇళ్లకు, రెండో దశలో అదనంగా 1,000 ఇళ్లకు మంజూరులు లభించాయి. ఆర్థిక పరిమితులు ఉన్నప్పటికీ అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం. రెండో దశలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి వారం, పది రోజుల్లో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందించే ప్రక్రియను పూర్తి చేస్తాం. రూఫ్ లెవల్ లో ఉన్న లబ్ధిదారులు కూడా త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలి. హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాలు, మున్సిపాలిటీలో పూర్తయిన ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు జరుపుకోవాలని పిలుపునిస్తున్నాను. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ తమ సొంతింట్లో దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి. పదేళ్ల నిరీక్షణ తర్వాత సొంతింటి కల నెరవేరి, ఈరోజు నా అక్కాచెల్లెళ్లు ప్రజా పాలన ప్రభుత్వం అందించిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్ పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ బొల్లి శెట్టి శివయ్య, హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ వివి రమణ,ఇతర ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆచార్య భక్తికి చిరునామా



- భగవత్ సేవకు నిలువెత్తు రూపం!
- నేడు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారి దివ్య తిరునక్షత్ర మహోత్సవం



చిగురుమామిడి నవంబర్ 7 (మనం న్యూస్): భగవంతుడిని ఆరాధించడం ఒక ఎత్తయితే... భగవంతుని సేవలోనే జీవితాన్ని సార్థకం చేసుకోవడం మరో ఎత్తు! ఆధ్యాత్మిక చింతనే శ్వాసగా, భగవత్ సేవనే ధ్యేయంగా, వైష్ణవ సంప్రదాయ పరిరక్షణనే జీవిత లక్ష్యంగా మలుచుకున్న మహనీయులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామివారు.

నేడు స్వామివారి తిరునక్షత్రం. స్వాతి నక్షత్ర శుభవేళ దివ్యసాకేతం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. తెల్లవారుజాము నుంచే దివ్యసాకేతం, ముచ్చింతల్ ప్రాంతం మొత్తం 'జై శ్రీమన్నారాయణ' నామస్మరణతో మారుమ్రోగిపోతోంది. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా వేలాది మంది భక్తులు గురుదేవుల దర్శనం కోసం తరలివస్తున్నారు. వందలాది మంది భక్తులు ప్రత్యేక వాహనాల్లో దివ్యసాకేతానికి చేరుకుని స్వామివారి దర్శనం చేసుకుని తరిస్తున్నారు.

వేదమే ఊపిరి... సేవే జీవితం

వేదమంత్రాల నాదం ఎక్కడ వినిపించినా... భగవన్నామ స్మరణ ఎక్కడ ప్రతిధ్వనించినా... అక్కడ స్వామివారి ఆధ్యాత్మిక ప్రస్థానపు ముద్ర కనిపిస్తుంది. రామానుజాచార్యుల సమతా సందేశాన్ని సమాజానికి చాటుతూ, భక్తి మార్గంలో ప్రజలను నడిపిస్తూ, ఆధ్యాత్మిక విలువలను విశ్వవ్యాప్తం చేయాలనే సంకల్పంతో సాగుతున్న ఆచార్యులవారు ఎందరో భక్తులకు మార్గదర్శకులు. 1000 సంవత్సరాల క్రితం భగవద్ రామానుజాచార్యులు గోపురం ఎక్కి అందరికీ మంత్రోపదేశం చేసి సమతను చాటారు. అదే సమతా సందేశాన్ని నేటి తరానికి అందిస్తున్న ఆధునిక ఆచార్యులు చిన్నజీయర్ స్వామివారు. స్వామివారి దివ్య సంకల్పంతోనే హైదరాబాద్ శివార్లలోని ముచ్చింతల్ లో 216 అడుగుల సమతామూర్తి - స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ ఆవిష్కృతమై ప్రపంచ ఆధ్యాత్మిక పటంలో తెలుగు నేలకు ప్రత్యేక స్థానం తెచ్చిపెట్టింది. అది కేవలం విగ్రహం కాదు... సమతా ధర్మానికి నిలువెత్తు ప్రతీక. కులం, మతం, ప్రాంతం, ధనిక, పేద అనే తేడా లేకుండా అందరూ భగవంతుని బిడ్డలే అని చాటుతున్న మహా సందేశం.

మనిషికి సేవే మాధవ సేవ

భగవత్ సేవ అంటే కేవలం గుడిలో పూజ మాత్రమే కాదని, మనిషికి సేవ చేయడమే అని ఆచరణలో చూపిస్తున్నారు స్వామివారు.

జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా వేద పాఠశాలలు, విద్యా సంస్థలు, గోశాలలు, అన్నదానం, విద్యాదానం, ఆరోగ్య సేవలు, పర్యావరణ పరిరక్షణ, గ్రామాభివృద్ధి... ఇలా స్వామివారి సేవా కార్యక్రమాలు ఎన్నో. వరదలు వచ్చినా, కరువు వచ్చినా, కరోనా వంటి కష్టకాలంలోనూ ముందుండి సేవ చేసిన ఆచార్యులు స్వామివారు. భక్తుడి కష్టం తన కష్టంగా భావించే గురువు.

తిరునక్షత్రం అంటే కేవలం వేడుక కాదు

ఆచార్యుల తిరునక్షత్రం అంటే కేవలం ఒక జన్మదిన వేడుక కాదు... గురుతత్వాన్ని స్మరించుకునే పవిత్ర సందర్భం. భక్తి భావనను పెంపొందించుకునే ఆధ్యాత్మిక పర్వదినం.

ఈ సందర్భంగా దివ్యసాకేతంలో ఉదయం నుంచే సుప్రభాత సేవ, వేద పారాయణం, తిరుమంజన సేవ, సహస్రనామార్చన, ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, మహా అన్నసమారాధన ఘనంగా జరుగుతున్నాయి.

గురువు చూపిన బాటలో నడవడమే గురువుకు ఇచ్చే అసలైన కానుక. స్వామివారు చెప్పినట్లుగా... రోజూ కాసేపు భగవన్నామ స్మరణ, పెద్దల పట్ల గౌరవం, తోటి మనిషి పట్ల ప్రేమ... ఇవే నిజమైన ఆధ్యాత్మికత.

స్వామివారి చిరునవ్వు చూస్తే చాలు జన్మ ధన్యమైనట్లే అంటున్నారు భక్తులు. స్వామివారి దివ్య ఆశీస్సుల కోసం భక్తుల హృదయాలు పరవశిస్తున్నాయి.

ఈ.వీ.ఎం. గోదామును తనిఖీ చేసిన జిల్లా ఎన్నికల అధికారి



జగిత్యాల, నవంబర్ 07 (మనం ప్రతినిధి): ఎన్నికల సంఘం ఆదేశానుసారం సాధారణ తనిఖీలో భాగంగ ధరూర్ క్యాంప్లోని ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు) గోదామును జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా గోదాములో భద్రపరిచిన ఈవీఎం యంత్రాల భద్రత, గోదాము వద్ద చేపట్టిన రక్షణ ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, ఇతర సాంకేతిక అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. గోదాము పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ జరుగుతున్న తీరును సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోదాము వద్ద ఏర్పాటు చేసిన భద్రతా వ్యవస్థ నిరంతరం పనిచేసేలా చూడాలని, సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారం ఈవీఎంల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. ప్రసూనాంబ, జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, ఎలక్షన్ సూపరిండెంట్ జ్యోతి జగిత్యాల అర్బన్ తహసీల్దార్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాద మార్గ్ ఫోర్ వే లైన్ భూసేకరణపై రైతులకు అవగాహన



మంథని,అక్టోబర్07(మనం న్యూస్): మంథని మండలంలోని మల్లెపల్లి గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం సర్పంచ్ లక్కాకుల సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. అంగుళూరుకు సంబంధించి శ్రీపాద మార్గ్ ఫోర్ వే లైన్ భూసేకరణ గురించి రైతులకు అధికారులు వివరించారు. భూసేకరణ ప్రక్రియ, రైతులకు అందే నష్టపరిహారం, ప్రభుత్వ నిబంధనలపై సవివరంగా చెప్పారు.రైతుల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో సురేష్,ఎమ్మార్వో, ఆర్ఐ,జీపీవో సతీష్, భూ సర్వే అధికారి రాజశేఖర్,ఉప సర్పంచ్ రాజమల్లు, వార్డు సభ్యులు గువ్వల ప్రశాంత్, కొవ్వూరి శైలజ,పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.భూసేకరణలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తామని అధికారులు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

ప్రజా వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి
- మంత్రి పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



ఉమ్మడి మహబూబ్ నగర్, నవంబర్ 7 (మనం బ్యూరో): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం, ఒక శాఖ నుంచి మరో శాఖకు పంపిస్తూ దాటవేత ధోరణి అవలంబించడం సహించేది లేదని హెచ్చరించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోడేరు మండల కేంద్రంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తో కలిసి, మంత్రి జూపల్లి కృష్ణారావు మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా వినతుల పరిష్కారంలో వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించకుండా, సరైన విచారణ జరపకుండా పరిష్కరించినట్లు చూపించడం లేదా పరిష్కారంలో జాప్యం చేయడంపై మంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, కోడేరు తహసీల్దార్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఎందుకు వస్తోందని అధికారులను ప్రశ్నించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, అధికారులు కేవలం అర్జీలు స్వీకరించి రికార్డుల్లో నమోదు చేయడంతో తమ బాధ్యత ముగిసినట్లు భావించరాదని అన్నారు. ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, వాస్తవాలను నిర్ధారించి, అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కోడేరు మండలంలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 395 ప్రజా వినతులు అందినట్లు సమీక్షలో వెల్లడైంది. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ శాఖకు 62, వ్యవసాయ శాఖకు 4, ఆర్డబ్ల్యూఎస్ అండ్ ఎస్కు 22, విద్యాశాఖకు 4, డీఆర్డీఓకు 14, దేవాదాయ శాఖకు 11, మహిళా శిశు సంక్షేమ శాఖకు 5, గృహ నిర్మాణ శాఖకు 21, నీటిపారుదల శాఖకు 29, పంచాయతీరాజ్ శాఖకు 116, విద్యుత్ శాఖకు 14, ఆర్టీసీకి 8, ఇతర శాఖలకు 85 వినతులు అందాయి. వీటిలో 210 వినతులు ఇంకా విచారణ, పరిష్కార దశలో ఉన్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ శాఖలో 25, పంచాయతీరాజ్ శాఖలో 73, ఇతర శాఖల్లో 45 వినతులు పెండింగ్లో ఉన్నట్లు వెల్లడైంది. ప్రజల నుంచి వచ్చిన వినతులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా భూ సమస్యలు, తాగునీరు, రహదారులు, విద్యుత్, సాగునీరు, ఇళ్ల నిర్మాణం వంటి మౌలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి సూచించారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీగా పనిచేస్తోందని, అదే బాధ్యత అధికార యంత్రాంగంలోనూ కనిపించాలని మంత్రి అన్నారు. ప్రతి వినతికి సంబంధించి తీసుకున్న చర్యలు, పరిష్కారానికి పట్టే సమయం, పెండింగ్లో ఉండటానికి గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలన్నారు. అవసరమైతే సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఇబ్బందులు లేకుండా అధికారులు చొరవ తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారుల పనితీరును సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ అధికారులు జవాబుదారితనంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడంతో పాటు, వారి అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రజలు తమకు ఎదురయ్యే భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమస్యలను రాతపూర్వకంగా సంబంధిత అధికారులకు అందజేయాలని కలెక్టర్ కోరారు. ప్రజలు సమర్పించిన వినతులపై అధికారులు స్పందించకపోయినా, సమస్య పరిష్కారంలో జాప్యం జరిగినా, సంబంధిత అధికారులు పట్టించుకోకపోయినా తన దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని గుర్తించి, అవసరమైన విచారణ చేపట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు.

ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, వారి అవసరాలను గుర్తించి సమస్యలను పరిష్కరించడం అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానంగా ప్రభుత్వ ఉద్యోగులు విధులు నిర్వహించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పెంపొందించడం లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పండుగ అనే రూపొందించిన పోస్టర్ను రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్లు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కుటుంబాల్లో దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకునేలా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ప్రాధాన్యతను గుర్తించాలని వారు ఈ సందర్భంగా సూచించారు.

జువ్వాడి నర్సింగ్ రావుకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



హైదరాబాద్, నవంబర్ 7(మనం న్యూస్): తెలంగాణ రాష్ట్ర తొలి వెలమ కార్పొరేషన్ చైర్మన్గా జువ్వాడి నర్సింగ్ రావు ప్రమాణ స్వీకార మహోత్సవం హైదరాబాద్లోని హకీంపేట జూపల్లి బాలమ్మ వెలమ కన్వెన్షన్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్తో, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరయ్యారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్యలతో కలిసి అడువాల జ్యోతి లక్ష్మణ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతనంగా వెలమ కార్పొరేషన్ చైర్మన్గా బాధ్యతలు స్వీకరించిన జువ్వాడి నర్సింగ్ రావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నాయకత్వంలో వెలమ సామాజిక వర్గ అభివృద్ధికి మరింత ప్రాధాన్యత లభించాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, జగిత్యాల ఆర్టీఏ సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమటాల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ కౌన్సిలర్ వీరబత్తిని శ్రీనివాస్, రేపెల్లి హరికృష్ణ, మీరే కాసిం అలీ, మొయిజుద్దీన్ తదితర జగిత్యాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పాత నేరస్థులపై పోలీసుల ప్రత్యేక నిఘా

- రాత్రివేళ ఆకస్మిక తనిఖీలు..
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే హెచ్చరిక.



సిరిసిల్ల, నవంబర్ 7 (మనం ప్రతినిధి) సిరిసిల్ల జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా పాత నేరస్థులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రివేళ ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, నేరస్థుల ప్రస్తుత నివాసాలు, కార్యకలాపాలు, సంబంధాలపై ఆరా తీశారు. తిరిగి నేరాలకు పాల్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే మాట్లాడుతూ... పాత నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందని, తిరిగి నేరాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించేందుకు నిరంతర పెట్రోలింగ్, తనిఖీలు కొనసాగిస్తామని తెలిపారు.

ఓటరు జాబితాలో పేరు నమోదుకు మరో అవకాశం

- 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు గడువు
- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



సిరిసిల్ల, నవంబర్ 7 (మనం ప్రతినిధి): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్ -2026) ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులకు మరో అవకాశం కల్పించినట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఈ నెల 21వ తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించవచ్చని వెల్లడించారు. శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడుతూ అర్హులైన ఏ ఒక్కరూ ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా ప్రదర్శించాలని సూచించారు. ఇప్పటికే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి ఐడీఓసీ నుంచి అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, తహసీల్దార్లు మహేష్, జయంత్, ఎన్నికల విభాగం అధికారి రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

దీపావళి సంబరాలు ఆనందంగా జరుపుకోండి

- జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే సూచనలు



సిరిసిల్ల, నవంబర్ 7 (మనం ప్రతినిధి): దీపావళి పండుగను ప్రజలంతా కుటుంబ సభ్యులతో ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే సూచించారు. పండుగ వేళ రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు.టపాసులు కాల్చే ప్రాంతాల్లో వాహనదారులు నెమ్మదిగా, జాగ్రత్తగా ప్రయాణించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీట్బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, డ్రైవింగ్ సమయంలో సెల్ఫోన్ వినియోగించవద్దని హెచ్చరించారు. చిన్నారుల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సురక్షితమైన, పర్యావరణహిత టపాసులనే వినియోగించాలని తెలిపారు. మన పండుగ ఆనందం ఇతరులకు ప్రమాదంగా మారకూడదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా, సురక్షితంగా దీపావళి పండుగ జరుపుకోవాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే విజ్ఞప్తి చేశారు.

పేదల కళ్లలో ఆనందం చూడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యానికి తావులేదు
నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలి: మంత్రి జూపల్లి
రామాపురంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన

కొల్లాపూర్, నవంబర్ 7 (మనం న్యూస్): ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసి, వారి కళ్లలో ఆనందం చూడటమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికి తావులేకుండా, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

కొల్లాపూర్ నియోజకవర్గంలోని రామాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు మంత్రి జూపల్లి కృష్ణారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్నామని తెలిపారు.

పేదల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ ఇళ్లు

సొంత ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబానికి జీవితకాల స్వప్నమని, ఆ కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన ఉద్దేశమని మంత్రి పేర్కొన్నారు.


ఒక కుటుంబానికి ఇల్లు కల్పించడం అంటే కేవలం నివాస సౌకర్యం కల్పించడమే కాకుండా, భద్రత, భరోసా, ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని అందించ డమేనని అన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా సొంతింటికి దూరమైన నిరుపేదలకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు.

హనుమకొండ జిల్లా ఎస్టి లైయసన్ ఆఫీసర్‌గా స్వామి నాయక్



హనుమకొండ, నవంబర్ 7 న్యూస్: హనుమకొండ జిల్లా ఎస్టి లైయసన్ ఆఫీసర్ గా స్వామి నాయక్, సబ్ ఇంజనీర్‌ని టీజీనపీడీసీల్ కార్యాలయం నియమించిన సందర్భంగా వారికి ఆర్డర్ కాపీ అందజేస్తున్న కంపెనీ గౌరవ అధ్యక్షులు వాలు నాయక్ , కంపెనీ ప్రెసిడెంట్ హర్జీ నాయక్ గారు, కంపెనీ జనరల్ సెక్రెటరీ అజ్మీరా శ్రీరామ్ నాయక్,హన్మకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, తదితరులు అదేవిదంగా శుభాకాంక్షలు తెలిపారు.

పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొన్న వీఎన్. నాయక్



హైదరాబాద్, నవంబర్ 7(మనం న్యూస్): కరీంనగర్: ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహం, కరీంనగర్లో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన అరుణాదేవి, నరసింహస్వామి దంపతులకు అభినందన సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కరీంనగర్లోని ప్రతిమ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొని పదవీ విరమణ పొందిన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి ఎన్ నాయక్ అండే రవి - భీమదేవరపల్లి

లక్ష్మీనారాయణ గుప్త, రేవా - కరీంనగర్, శైలజ - కరీంనగర్, శారదప్రమీల - భద్రాచలం, తదితరులు పాల్గొని పదవీ విరమణ పొందిన దంపతులను ఘనంగా సత్కరించి, వారి భవిష్యత్తు జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

ముగిసిన మహబూబాబాద్ డివిజన్ స్థాయి గిరిజన క్రీడా పోటీలు



మహబూబాబాద్, నవంబర్7 (మనంన్యూస్): మహబూబాబాద్ డివిజన్ స్థాయిలో నిర్వహించిన గిరిజన క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో ముగిశాయి. ఈ పోటీల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడల్లో ఏహెచ్ఎస్ (అఏఖి) బి మహబూబాబాద్ జట్టు ప్రథమ స్థానాన్ని సాధించింది. ద్వితీయ స్థానాన్ని ఏహెచ్ఎస్ రెడ్యాల జట్టు కైవసం చేసుకుంది.

ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో మహబూబాబాద్ స్పోరట్స్ ఆఫీసర్ సీహెచ్. కొమ్ములు, మహబూబాబాద్ సెక్టరీ పోరిక అనిల్ కుమార్, వట్టం శంకర్, సర్పంచ్ లిప్సినారాయణ, సుమన్, రాజన్న, సుదర్శన్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సమస్యలను పరిష్కరించాలి



- కరువు మండలాలకు నిధులు కేటాయించాలి
- పేదలకు 14రకాల నిత్యావసర సరుకులు ఇవ్వాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డి నవంబర్ 7 మనం న్యూస్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైస్ మిల్ కేటాయించాలని,సమస్య పరిష్కరించాలి సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. నేడు సంగారెడ్డి సుందరయ్య భవన్ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పత్తి క్వింటాల్ కు 9500/ రూపాయలు ఇవ్వాలని, కొలు రైతులను తక్షణమే ఆదుకోవాలని గొల్లపల్లి జయరాజు ప్రభుత్వం ను డిమాండ్ చేశారు. ఎల్లినో కరువు ప్రభావంతోటి పత్తి, వరి, మొక్క జొన్న పంట తీవ్రంగా నష్టపోయిందని అన్నారు. ఎకరాకు మూడు క్వింటాళ్ళ పత్తి కూడా సరిగా రావడం లేదని అన్నారు. రైతులకు పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పత్తి క్వింటాల్ కు 9500 ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. కొలు రైతులు పంట రాక అప్పుల పాలవుతున్నారని అన్నారు తక్షణమే కొలు రైతులకు ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు సంగారెడ్డి జిల్లాలోని 28 మండలాలకు కరువు నిధులను వెంటనే కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పేదలకు 14రకాల నిత్యావసర సరుకులు రేషన్ షాప్ ల ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా మంచినీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు నర్సిములు, యాదగిరి రాజయ్య, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి

- పటాకుల విషయంలో పిల్లలతో జాగ్రత్తగా వహించాలి
- పటాకులు అంటే బొమ్మలు కావు నిప్పు రవ్వలు : డాక్టర్ రవళి

గజ్వేల్ నవంబర్ 7 మనం న్యూస్: దీపావళి పండుగను పిల్లలు పెద్దలు అందరూ కూడా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవళి ప్రజలకు సూచించారు. దీపావళి అంటే పిల్లలకు పండగే, కానీ పటాకుల దగ్గరే అన్ని ప్రమాదాలు జరుగుతాయి. కొన్ని చిన్న జాగ్రత్తలు తీసుకుంటే సంతోషంగా జరుపుకోవచ్చు అని సూచించారు.

పిల్లలను పటాకుల నుండి ఎలా రక్షించాలి

పిల్లలను ఎప్పుడూ ఒంటరిగా పటాకులు కాల్చనివ్వకండి. పెద్దవాళ్ళు పక్కనే ఉండాలి. కాటన్ బట్టలే వేయాలి. సిల్క్, నైలాన్, సింథటిక్ బట్టలు తొందరగా అంటుకుంటాయి. లూజ్ బట్టలు వద్దు. చెప్పులు తప్పకుండా వేయించండి. కాలిన పటాకు మీద కాలు పడితే కాలుతుంది. ఒక పటాకు వెలగలేదని వెంటనే దగ్గరికి వెళ్లి చూడకూడదు. కనీసం 2 నిమిషాలు ఆగి, నీళ్లు పోసి చూడాలి. రెండు పటాకులను కలిపి ఒకేసారి వెలిగించవద్దు. చేతిలో పట్టుకుని కాల్చవద్దు. - ఇంట్లో, గదిలో, గ్యారేజ్ లో ఎప్పుడూ పటాకులు కాల్చా వద్దు.



ఆరుబయట ఖాళీ స్థలంలోనే పటాకులు కాల్చాలి .

అలాగే కార్లు, బైకులు, గడ్డి, పెట్రోల్ బంక్ దగ్గర పటాకులు కాల్చవద్దు . పటాకులు కాల్చేటప్పుడు చిన్న పిల్లలు వద్ద పక్కన ఒక బకెట్ నీళ్లు, ఇసుక రెడీగా పెట్టుకోండి. అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే ఆర్పడానికి పనికొస్తుంది. సామాన్యంగా మనము ఏ పటాకులు చిన్నపిల్లల వద్దు కాల్చవద్దంటే

పెద్ద శబ్దం వచ్చే బాంబులు (హైడ్రోజన్ బాంబ్, 1000 వాలా) చిన్న పిల్లలకు ఇవ్వవద్దు. చెవులకు, గుండెకు హాని చేస్తాయన్న విషయాన్ని పెద్దలు మర్చిపోవద్దు. - ముఖ్యంగా చిచ్చుబుడ్లు, భూ చక్రం లాంటివి కింద పడి తిరిగేవి - కాళ్ల మీద పడే ప్రమాదం ఉంది కావున వాటిని కాల్చేటప్పుడు చిన్న పిల్లలను దగ్గర రాకుండా చూసుకోవాలి ఒకవేళ దగ్గరకు వస్తే కూడా , జాగ్రత్తగా చూడాలి. పటాకులు కాల్చేటప్పుడు ప్రమాదం జరిగితే ఏం చేయాలి అంటే వెంటనే తల్లిదండ్రులు గాబ్రాపడకుండా ఉండాలి అలాగే కాలిన చోట

- కాలితే వెంటనే టూత్ పేస్ట్, నూనె, మసి రాయవద్దు. ఇది తప్పు అవడమే కాకుండా గాయానికి మరింత ఇబ్బంది కలుగుతుంది అన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలని డాక్టర్ రవళి తెలిపారు .

- వెంటనే 10-15 నిమిషాలు చల్లటి నీటితో (నల్ల నీటితో) కడగండి.

- కాలిన చోట వదులుగా ఉన్న శుభ్రమైన గుడ్డ కట్టడం మర్చిపోవద్దు అలాగే పటాసులు కాల్చేటప్పుడు చిన్న పిల్లలకు గాని పెద్దలకు గాని

కంట్లో నిప్పు రవ్వ పడితే, కళ్ళు నలపవద్దు. చల్లటి నీటితో కడిగి డాక్టర్ దగ్గరకు తీసుకుని వెళితే కంటిని కాపాడుకున్న వాళ్ళమవుతాము .

పటాకుల గురించి చిన్న పిల్లలకు చెప్పాల్సిన బంగారు మాట ఏమిటంటే

'పటాకు అంటే ఆట బొమ్మ కాదు, అది నిప్పు. దూరం నుండి అగరబత్తితోనే వెలిగించాలి అని వారికి అర్థమయ్యే విధంగా సూచిస్తే వారు దానినే అనుసరిస్తారు ఈ విజయం తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ తీసుకొని చెప్పాల్సిన అవసరం ఉంది అని చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రవళి తల్లిదండ్రులకు సూచించడం జరిగింది.

ఐస్ మేక్ రిఫ్రిజరేషన్ రెండో త్రైమాసికంలో 41శాతం ఆదాయ వృద్ధి

హైదరాబాద్ , నవంబర్ 6(మనంన్యూస్): రిఫ్రిజరేషన్ మరియు కోల్డ్-చైన్ సొల్యూషన్స్ రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐస్ మేక్ రిఫ్రిజరేషన్ లిమిటెడ్, 2026-27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో బలమైన ఆదాయ వృద్ధిని నమోదు చేయడంతో పాటు, త్రైమాసిక ప్రాతిపదికన తిరిగి లాభాల్లోకి వచ్చింది. 2026 సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ కార్యకలాపాల ఆదాయం గత ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ. 147.49 కోట్లతో పోలిస్తే 40.6శాతం వృద్ధితో రూ. 207.38 కోట్లకు చేరింది. క్యూ2 ఎఫ్వై 27లో కంపెనీ రూ. 2.71 కోట్ల కన్సాలిడేటెడ్ పన్ను అనంతర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో ఈ లాభం రూ.2.02 కోట్లుగా ఉంది. ముఖ్యంగా, క్యూ1 ఎఫ్వై 27లో నష్టాన్ని నమోదు చేసిన అనంతరం కంపెనీ తిరిగి త్రైమాసిక లాభదాయకతను సాధించింది. ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో కన్సాలిడేటెడ్ ఆదాయం 49.1శాతం పెరిగి రూ. 386.26 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.258.99 కోట్లుగా ఉంది. హెచ్1 ఎఫ్వై 27లో పీఏటీ రూ. 1.05 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ. 0.55 కోట్లుగా ఉంది. కంపెనీ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్ పి. పటేల్ మాట్లాడుతూ, క్యూ2 ఎఫ్వై 27 పనితీరు మా వ్యాపారంలో కొనసాగుతున్న వృద్ధి వేగాన్ని ప్రతిబింబిస్తోంది. ఆదాయంలో సుమారు 41శాతం వార్షిక వృద్ధితో పాటు, త్రైమాసిక ప్రాతిపదికన తిరిగి లాభాల్లోకి రావడం సంతోషకరమైన పరిణామం. కార్యకలాపాల సామర్థ్యాన్ని పెంచడం, ఉత్పత్తి సామర్థ్యాన్ని మెరుగ్గా వినియోగించుకోవడం, వ్యయ నియంత్రణ మరియు క్రమబద్ధమైన మూలధన కేటాయింపు ద్వారా వృద్ధి నాణ్యతను మరింత బలోపేతం చేయడంపై మా దృష్టి ఉంది అని తెలిపారు. గెలీలీతో వ్యూహాత్మక భాగస్వామ్యం, కమర్షియల్ రిఫ్రిజరేషన్ రంగంలో పెట్టుబడులు కంపెనీ తదుపరి వృద్ధి దశకు కీలకమైన చర్యలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా దీర్ఘకాలిక వ్యాపార విలువను సృష్టించడం కంపెనీ లక్ష్యమని తెలిపారు. కంపెనీ సీఈవో ఎం. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, కమర్షియల్ రిఫ్రిజరేషన్ ఉత్పత్తులు మరియు పరిష్కారాలకు డిమాండ్ బలంగా కొనసాగుతోంది. ఈ త్రైమాసికంలో మా కొత్త వ్యాపార విభాగాలైన రిఫ్రిజరేషన్ ప్రొడక్ట్స్ మరియు కంటిన్యూయస్ ప్యానెల్స్ మంచి పనితీరును కనబరిచాయి. వ్యయ సామర్థ్యం, ఉత్పాదకత, మార్కెట్ విస్తరణ మరియు లాభదాయకత మెరుగుదలపై మేము దృష్టి సారిస్తున్నాం. అయితే, కమోడిటీ ధరల్లో మార్పులు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు మరియు సరఫరా గొలుసు సవాళ్లు కొనసాగుతున్నాయి అని చెప్పారు.





తున్కిఖిల్సాలో రైతు సదస్సు

వర్ధల్, నవంబర్ 7(మనం న్యూస్): తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం,వ్యవసాయ కళాశాల,రాజేంద్రనగర్, హైదరాబాద్ ఖఖగిఉ్క విద్యార్థుల ఆధ్వర్యంలో తున్కిఖిల్సా గ్రామ రైతు వేదికలో రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డా. సిహెచ్. పల్లవి, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. ప్రియదర్శిని మండల వ్యవసాయ అధికారిణి శేషశయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వ్యవసాయ ప్రదర్శన స్టాల్స్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా డా. సిహెచ్. పల్లవి మాట్లాడుతూ.. రైతులు పంట వైవిధ్యీకరణ చేపట్టాలని, ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అంతర పంటలు, తక్కువ పంట కాలం కలిగిన పంటలను (కూరగాయలు, పెసర, మినుము, ఉలువలు, బొబ్బెర), బెట్ట పరిస్థితులను తట్టుకునే పంటలను వేసుకోవాలని తెలిపారు. వివిధ పంటలలో మేలైన విత్తనాల ప్రాముఖ్యత, అందుబాటులో ఉన్న మేలైన విత్తనాల గురించి వివరించారు. అనంతరం డా. ప్రియదర్శిని మాట్లాడుతూ.. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం (ఖఖగిఉ్క) లో భాగంగా 40 మంది విద్యార్థులను తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేటకు కేటాయించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులను సిద్దిపేట జిల్లాలోని వివిధ మండలాల్లోని 8 గ్రామాలలో ఉంచడం జరిగిందని, రైతుల స్థితిగతులను తెలుసుకోవడానికి, సమాజం గురించి అవగాహన, వివిధ పంటలలో ప్రాక్టికల్ నాలెడ్జ్ కొరకు ఈ ఖఖగిఉ్క ప్రోగ్రాం ఎంతగానోఉపయోగపడుతుందని తెలిపారు.మండల వ్యవసాయ అధికారిణి శేషశయన ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా భూసార పరీక్షలు, నేల ఆరోగ్య పరిరక్షణ వివిధ పంటలలో పాటించాల్సిన సమగ్ర పోషక యాజమాన్యం (ఖూశ్ర), సమగ్ర సస్యరక్షణ (ఐఙ్ర), నీటి సంరక్షణ, పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఉద్యాన పంటల సాగు ప్రోత్సాహం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.గణేష్, శేరిపల్లి గ్రామ సర్పంచ్ పావని మోహన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారిణిలు భారతి, అనిత, ఆయిల్ పామ్ ఫీల్ ఆఫీసర్ తులసి వివిధగ్రామాలరైతులు,విద్యార్థులు పాల్గొన్నారు.



అర్హులైన ఓటర్లు తుది జాబితాలో చోటు దక్కించుకోవాలి

- గైర్హాజరు, శాశ్వత వలసదారుల జాబితాలో ఉన్నవారికి మరో అవకాశం
- డిక్లరేషన్తో దరఖాస్తు చేసుకోవాలని
- పటాన్చెరు ఓటరు నమోదు అధికారి వెంకటేశ్వర్ రావు
- రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఈఆర్ఓలతో సమీక్ష సమావేశం

పటాన్చెరు, నవంబర్ 7 (మనం న్యూస్) : పటాన్చెరు నియోజకవర్గంలో ఓటరు జాబితా ప్రత్యేక పరిశీలనలో భాగంగా గైర్హాజరు, శాశ్వత వలసదారుల జాబితాలో నమోదైన అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు పటాన్చెరు ఓటరు నమోదు అధికారి తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, సహాయ ఓటరు నమోదు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఏఎస్డీ జాబితాలో మొత్తం 1,36,902 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. వీరిలో 9,810 మంది మరణించినవారు, 29,676 మంది గైర్హాజరైనవారు, 82,918 మంది శాశ్వతంగా వలస వెళ్లినవారు, 4,918 మంది ఇతర కేటగిరీకి చెందినవారుగా గుర్తించినట్లు వివరించారు. అయితే గైర్హాజరు, శాశ్వత వలసదారుల జాబితాలో చేరిన వారిలో వాస్తవంగా అదే ప్రాంతంలో నివసిస్తూ, ఓటు హక్కుకు అర్హత కలిగిన వారు ఉంటే వారికి మరో అవకాశం కల్పించినట్లు అధికారులు తెలిపారు. అటువంటి అర్హులైన ఓటర్ల నిర్దీత డిక్లరేషన్ను పూర్తి చేసి దరఖాస్తు చేసుకుంటే, నిబంధనల మేరకు వారి పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చేందుకు కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయాలు అవకాశం కల్పించాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలని పటాన్చెరు ఓటరు నమోదు అధికారి పత్రికాముఖంగా కోరారు. సమీక్ష సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని సహాయ ఓటరు నమోదు అధికారులు అయిన తహసీల్దార్లు, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, నియోజకవర్గ ఎన్నికల డీటీలు సంతోష్ కుమార్, మహమ్మద్ షఫీ, పటాన్చెరు డీటీ లింగేశ్వర్ పాల్గొన్నారు. రాజకీయ పార్టీల తరఫున బీఆర్ఎస్ నుంచి సుధాకర్ రావు, కాంగ్రెస్ నుంచి శశిధర్ రెడ్డి, టీడీపీ మైనారిటీ అధ్యక్షుడు నజీర్, బీజేపీ నుంచి మల్లెపల్లి రాజేందర్ రెడ్డి, బీఎస్పీ నుంచి ప్రశాంత్ హాజరయ్యారు.



పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

- మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు
- పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు మంజూరు
- రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ఉమ్మడి మహబూబ్ నగర్ నవంబర్ 07 (మనం బ్యూరో): ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాల జీవితాల్లో మరింత భరోసా నింపుతోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని కోడేరు మండల కేంద్రంలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారు ఆది బక్కమ్మ ఇంట్లో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి జూపల్లి దీపావళి వేడుకల్లో పాల్గొన్నారు. వారికి నూతన వస్త్రాలు అందజేసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. సొంతింటిలో పండుగ జరుపుకుంటున్న లబ్ధిదారుల ఆనందంలో పాలుపంచుకున్నారు. అనంతరం గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ప్రొసీడింగ్ కాపీలను మంత్రి జూపల్లి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోందని తెలిపారు. తొలి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 2,25,000 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.40 వేల కోట్ల వ్యయంతో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు చెప్పారు.



లబ్ధిదారులకు మంజూరైన ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తూ పారదర్శకంగా పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబాలకు సొంతింటిని సమకూర్చడం ద్వారా వారి జీవితాల్లో స్థిరత్వం, భద్రత కల్పించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాగర్కర్నూల్ జిల్లా హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, వనపర్తి జిల్లా హౌసింగ్ పీడీ విఠోభ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిపూడిలో బీజేపీ అభ్యర్థి శివకోటి శ్రావణి ఘన విజయం

శంఖవరం, నవంబర్ 07 (మనం ప్రతినిధి): కాకినాడ జిల్లా శంఖవరం మండలం నెల్లిపూడి ఎంపీటీసీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి శివకోటి శ్రావణి ఘన విజయం సాధించారు. ఎస్సీ రిజర్వుడ్ స్థానంలో పోటీ చేసిన ఆమె, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎద్దు జ్యోతిపై 450 ఓట్ల భారీ మెజారిటీతో విజయకేతనం ఎగురవేశారు. ఈ విజయంతో నెల్లిపూడి గ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే కూటమి శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. ముఖ్యంగా ఒక దళిత మహిళ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధించడంతో గ్రామంలో ప్రత్యేక సందడి నెలకొంది. విజయం సాధించి గ్రామానికి చేరుకున్న శివకోటి శ్రావణికి గ్రామస్తులు, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టి, పూలతో అభినందనలు తెలుపుతూ ఆమెకు నీరాజనాలు పలికారు. బాణసంచా కాల్చుతూ, మిఠాయిలు పంచుకుంటూ తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ, ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని విజేతకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ అందరినీ కలుపుకొని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ 7న జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపులో పలు ఆసక్తికర ఫలితాలు వెలువడగా, నెల్లిపూడిలో శివకోటి శ్రావణి సాధించిన విజయం స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

రైతుల ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

రాష్ట్రంలో కరువు అల్లాడుతుంటే హెలికాప్టర్లలో మంత్రులు విహారయాత్రలు

మీడియా సమావేశంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంఎల్ఏ సండ్ర




ఖమ్మం, నవంబర్ 7(మనం బ్యూరో)ఃఖమ్మంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్లమెంట్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడారు. ప్రభుత్వానికి కనీస సోయి ఉంటే ఈ తుఫాను నష్టాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించాలన్నారు. తుఫాను వల్ల చెరువులు తెగి పంటలు మునిగిపోవడం రైతులను కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో దాదాపు 34,000 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినా ప్రభుత్వం నివేదిక పంపడంలో విఫలమైందన్నారు. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ రైతులకు ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. రైతుల సమస్యలను గాలికొదిలేసి మంత్రులు హెలికాప్టర్ పర్యటనలు చేయడం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమేనన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరానికి 50 వేల రూపాయల నష్ట పరిహారం ప్రకటించి ఆదుకోవాలన్నారు.

మాజీ ఎంఎల్ఏ సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముసురు తుఫాను వల్ల వరి, పత్తి, మిర్చి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. అధికారికంగా నేటికీ ఎలాంటి సర్వే లేదా పంట నష్ట అంచనా ఆదేశాలు రాలేదన్నారు. కేవలం ఖమ్మం జిల్లాలోనే 32,000 ఎకరాల పైన నష్టం జరిగి ఉంటుందని, కేవలం 23,140 ఎకరాలకు జరిగిందని వ్యవసాయ శాఖ అంచనా వేసిందన్నారు. క్యాబినెట్ మీటింగ్‌లో పంట నష్టంపై చర్చించి రైతులకు భరోసా కల్పించాల్సింది పోయి, గ్లోబల్ సమ్మిట్ పై చర్చించడం శోచనీయమన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, వేంసూర్, సత్తుపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. సత్తుపల్లిలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కూడా నీట మునిగి పేదలు సర్వస్వం కోల్పోయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదన్నారు. కరువు పరిస్థితులు ఉండి రైతులు అల్లాడుతుంటే మంత్రులు హెలికాప్టర్లలో విహారయాత్రలు చేయడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తుంటే ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని సీఎం ప్రకటించినప్పటికీ, మంత్రులు హెలికాప్టర్లను విహారయాత్రల మాదిరిగా వాడుకోవడంపై తీవ్ర విమర్శలు చేశారు. మెరుగైన రోడ్డు సౌకర్యాలు, హైవేలు అందుబాటులో ఉండి కేవలం 2 నుంచి 3 గంటల్లో ప్రయాణించగలిగినప్పటికీ, అత్యవసర పరిస్థితి లేకపోయినా హెలికాప్టర్లను దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి హోదా, బాధ్యతలు లేని వ్యక్తులు కూడా ప్రభుత్వ హెలికాప్టర్లు ఎక్కుతూ, 'సింహం దిగింది' అంటూ సోషల్ మీడియాలో రీల్స్ చేసుకుంటూ ప్రజల సొమ్ముతో విర్రవీగుతున్నారని ఎండగట్టారు. ప్రభుత్వ హెలికాప్టర్ల వినియోగానికి ఎలాంటి నిబంధనలు, విధివిధానాలు లేవా అని ప్రశ్నించారు. కరువుతో రైతులు అల్లాడిపోతుంటే కాంగ్రెస్ నాయకులు మాత్రం సోషల్ మీడియాలో ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యారని విమర్శించారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో కరువు పరిస్థితులు వచ్చాయని ప్రభుత్వమే ప్రకటించిందని, దసరా కంటే ముందు తీసిన పత్తి, మిర్చి పంటలు మంచి రేటుకు అమ్ముకున్నప్పటికీ, ఆ తర్వాత వచ్చిన మురసు తుఫాను వల్ల పత్తి పూర్తిగా దెబ్బతిందన్నారు. మార్కెట్లో పత్తిని కొనుగోలు చేయడానికి సిసిఐ కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి మోసపోతున్నారని అన్నారు. కరువు మండలాలుగా ప్రకటించిన ప్రభుత్వాలు, ఆ ప్రాంతాల్లోని రైతులకు, వ్యవసాయ కూలీలకు ఇవ్వాల్సిన ఉపశమన చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. కేవలం కరువు మండలాలు అని ప్రకటించి చేతులు దులుపుకోవడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తుఫాను, వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఎకరా పంటనూ వెంటనే సర్వే చేయించాలని, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరానికి రూ. 50 వేల తక్షణ పరిహారం చెల్లించాలని, సత్తుపల్లి, కొత్తగూడెం నియోజకవర్గాల్లో మునిగిపోయిన ఇళ్ల బాధితులను నివాసితులను ఆదుకోవాలని, తడిసిన, రంగుమారిన, మొలక వచ్చిన ప్రతి గింజను ప్రభుత్వం కొనాలని, పత్తి రైతులను ఆదుకునేందుకు వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, కనగాల వెంకటరావు, నాయకులు బొమ్మెర రామ్మూర్తి, డోకుపర్తి సుబ్బారావు, లింగనబోయిన సతీష్, బలుసు మురళీకృష్ణ, మహమ్మద్ రఫీ, చీకటి రాంబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదులో

కాంగ్రెస్ శ్రేణుల కృషి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్



ఖమ్మం, నవంబర్ 7(మనం బ్యూరో): పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియలో అంకితభావంతో పనిచేసిన జిల్లా కాంగ్రెస్ నాయకులకు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులకు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులకు, కార్యకర్తలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా విజయవంతం చేయడంలో ప్రతి ఒక్క కార్యకర్త ఎంతో శ్రమించారని కొనియాడారు. గ్రామగ్రామాన తిరిగి, పట్టభద్రులను గుర్తించి, వారికి అవగాహన కల్పించి, ఓటు నమోదు చేయించడంలో కాంగ్రెస్ శ్రేణులు చూపిన చొరవ అభినందనీయమని అన్నారు. పట్టభద్రుల గొంతుకను శాసనమండలిలో బలంగా వినిపించడానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, విద్యావంతులైన యువత, ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పార్టీ పక్షాన నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా పార్టీ బలోపేతం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భూ రీసర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- పారదర్శకతతో భూముల హద్దులను కచ్చితంగా గుర్తించాలి
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్
- రాఘవపురంలో భూ రీసర్వే పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలన



సుజాతనగర్, నవంబర్ 7 (మనం న్యూస్): భూ రీసర్వే పనులను వేగవంతంగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం సుజాతనగర్ మండలం రాఘవపురం గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న సర్వే ప్రక్రియపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు మాట్లాడుతూ రాఘవపురం గ్రామ పరిధిలో మొత్తం 1,800 ఎకరాల ఒక కుంట విస్తీర్ణంలో భూ రీసర్వే చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం, ప్రభుత్వ భూములు, రహదారుల హద్దుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు. మిగిలిన భూములకు సంబంధించి ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్కు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వే విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, రెవెన్యూ రికార్డుల ఆధారంగా ప్రతి భూమి హద్దులను కచ్చితంగా గుర్తించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, గ్రామకంఠం, రహదారుల సరిహద్దుల విషయంలో ఎలాంటి వివాదాలు, అపోహలు తలెత్తకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి మిగిలిన సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, సర్వేయర్ కిరణ్ కుమార్, రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు. భూ రీసర్వే పనులను వేగవంతంగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం సుజాతనగర్ మండలం రాఘవపురం గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న సర్వే ప్రక్రియపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు మాట్లాడుతూ రాఘవపురం గ్రామ పరిధిలో మొత్తం 1,800 ఎకరాల ఒక కుంట విస్తీర్ణంలో భూ రీసర్వే చేపట్టాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం, ప్రభుత్వ భూములు, రహదారుల హద్దుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు వివరించారు. మిగిలిన భూములకు సంబంధించి ప్రస్తుతం సర్వే పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్కు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భూముల సర్వే విషయంలో అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని, రెవెన్యూ రికార్డుల ఆధారంగా ప్రతి భూమి హద్దులను కచ్చితంగా గుర్తించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములు, గ్రామకంఠం, రహదారుల సరిహద్దుల విషయంలో ఎలాంటి వివాదాలు, అపోహలు తలెత్తకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి మిగిలిన సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణప్రసాద్, సర్వేయర్ కిరణ్ కుమార్, రెవెన్యూ, సర్వే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 7(మనం న్యూస్): సింగరేణి చిల్డ్రన్స్ పార్క్ ఆవరణలో సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక, ఫ్లాగ్ దినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిజిఎం(పర్సనల్) అండ్ డిస్ట్రిక్ట్ కమిషనర్ బి.శివ కేశవ రావు హాజరై భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పతాకావిష్కరణ చేయడం జరిగింది. అనంతరం స్కౌట్స్ అండ్ గైడ్స్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం నవంబర్ 7వ తేదీన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆవిర్భావ వేడుకలను నిర్వహించుకుంటున్నామని దీనిలో భాగంగా ఈ రోజు సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల కార్యక్రమాన్ని సింగరేణి సంస్థ వ్యాప్తంగా అన్ని ఏరియాలలో ఘనంగా నిర్వహించుకోవడం జరిగిందన్నారు. స్కౌట్స్ ఉద్యమ స్థాపకుడు బేడెన్ పవల్ స్ఫూర్తి ఆశయాలు సిద్ధాంతాలనుసరించి మన భారత దేశంలో కూడా స్కౌట్స్ అండ్ గైడ్స్ ను స్థాపించటం జరిగిందని పేర్కొన్నారు. ఈ భారత్ అండ్ స్కౌట్స్ నందు విద్యార్థులకు దేశ భక్తి నాయకత్వ లక్షణాలు సమాజంలో ఒక మంచి పౌరుడుగా ఎలా ఉండాలో సమాజానికి ఏ విధముగా తోడ్పడాలో విపత్తుల సమయంలో ధైర్యముగా ముందుకు వెళ్ళి సేవ చేసే విధముగా మొత్తంగా సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం అలవరచుకునేలా స్కౌట్స్ అండ్ గైడ్స్ఉద్యమం దోహద పడుతుందని అందుకే యువతను మరింతగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలని ఇందుకు ప్రతీ ఏడాది సింగరేణి యాజమాన్యం ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించి ప్రోత్సహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిజిఎం(పర్సనల్) అండ్ డిస్ట్రిక్ట్ కమిషనర్ బి.శివ కేశవరావు, సీనియర్ పిఓ అండ్ సింగరేణి కాలరీస్ డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.శ్రీనివాస్, వెల్ఫేర్ ఏఓ కే.వరప్రసాద రావు, స్కౌట్ మాస్టర్లు, యూనిట్ లీడర్స్ వి.వెంకట స్వామి, పి.సాయి నిరంజన్, ఎల్.గోపాలకృష్ణయ్య, యం.కొమరయ్య, బట్టు ప్రకాష్, ఎండి. అక్బర్, డాక్టర్ రాజ్యలక్ష్మి, స్వరూప, విశాలిని, వివిధ పాఠశాలల నుండి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చెరువుల శాశ్వత తాత్కాలిక

మరమ్మతులకు శ్రీకారం

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రారంభం

రైతులకు ఇబ్బందులు కలగకుండా తక్షణమే స్పందించిన ప్రభుత్వం



దమ్మపేట, నవంబర్ 7(మనం న్యూస్): మురసు తుఫాన్ ప్రభావంతో గత నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు అశ్వారావుపేట నియోజకవర్గంలోని పలు చెరువులకు గండ్లు పడి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. రైతులకు సాగునీటి ఇబ్బందులు కలగకుండా చెరువుల శాశ్వత తాత్కాలిక మరమ్మతుల కోసం ఎఫ్డీఆర్ నిధుల కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఈ క్రమంలో దమ్మపేట మండలంలో నాలుగు చెరువుల మరమ్మతు పనులకు అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, శనివారం కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. నాగుపల్లి గ్రామంలో ముసలి బంధం చెరువు శాశ్వత మరమ్మతులకు రూ.49.80 లక్షలు దమ్మపేట మండల కేంద్రంలోని పేరంటాల చెరువు మరమ్మతులకు రూ.47 లక్షలు రాంజీ కుంట మరమ్మతులకు రూ.8.50 లక్షలు ఆసన్నగూడెం గ్రామంలోని రంగన్న కుంట శాశ్వత మరమ్మతులకు రూ.39.50 లక్షలు ప్రభుత్వం కేటాయించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తుఫాన్ వల్ల దెబ్బతిన్న చెరువులకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం చూపుతున్న చొరవకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,కి ఉమ్మడి ఖమ్మం జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,కి తుమ్మల నాగేశ్వరరావు,కి అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కక్కిరాల రమేష్, దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, వైస్ సర్పంచ్ ఆంగోతు శీను,చిన్న శెట్టి యుగంధర్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వనమాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీచ్ఎం, ఎన్యూహెచ్ఎం పరిధిలో 95 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

- డి ఎం అండ్ హెచ్ ఓ
- ఈ నెల 9 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గడువు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 7 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిరుద్యోగులకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ శుభవార్త అందించింది. జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్టీచ్ఎం), జాతీయ పట్టణ ఆరోగ్య మిషన్ (ఎన్యూహెచ్ఎం) పరిధిలోని వివిధ ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగా ఉన్న మొత్తం 95 పోస్టులను కాంట్రాక్ట్, అవుట్సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి తెలిపారు.

ఈ నెల 9వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని, 13వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తు రుసుముగా వెయ్యి రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని, ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించని విధంగా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో కొత్తగూడెం డిఎం అండ్ హెచ్ ఓ పేరుతో తీసుకోవాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు జిల్లా అధికారిక వెబ్సైట్ కొత్తగూడెం . తెలంగాణ.జిఓవి.ఇన్ నుంచి దరఖాస్తు నమూనాను డౌన్లోడ్ చేసుకోవాలి.

పూర్తిగా నింపిన దరఖాస్తుతో పాటు విద్యార్హతలు, ఇతర అవసరమైన ధ్రువపత్రాల ధ్రువీకరించిన ప్రతులు, డిమాండ్ డ్రాఫ్ను జతచేసి ఈ నెల 13వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, ఐడీఓసీ సముదాయంలో నేరుగా లేదా రిజిస్టర్డ్ పోస్టు ద్వారా అందజేయాలని తెలిపారు. నియామకాలకు సంబంధించిన పోస్టుల వారీగా విద్యార్హతలు, అర్హత ప్రమాణాలు, ఎంపిక విధానం తదితర పూర్తి వివరాలు జిల్లా అధికారిక వెబ్సైట్లో అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు నోటిఫికేషన్లోని నిబంధనలను పూర్తిగా పరిశీలించి, నిర్ణీత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సూచించారు.

భార్యను హత్య చేసిన కేసులో ఎ ఆర్ కానిస్టేబుల్ అరెస్ట్

- జిల్లా ఎస్పీ రోహిత్ రాజు
- గోదావరి నదిలో మృతదేహాన్ని పడవేసిన భర్త మృతదేహం గుర్తింపు



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 7 (మనంప్రతినిధి): కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మహిళ అదృశ్యం కేసులో మృతురాలి భర్త ఎఆర్ కానిస్టేబుల్ ను అరెస్ట్ చేసినట్లు జిల్లాఎస్పీ రోహిత్ రాజు మీడియాకు తెలిపారు. శనివారం కొత్తగూడెం 3 వ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం, ఈ నెల 6 న గుండారపు స్వరూప తన సోదరి భవాని కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో క్రైమ్ నంబర్ 205/2026 కింద మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా , టేకులపల్లి మండలం, గోలియాతండాకు చెందిన ఏఆర్ కానిస్టేబుల్ (623) భవాని భర్త బోడ నరేందర్ (30) పోలీసుల విచారణలో తన భార్యను హత్య చేసినట్లు వెల్లడించాడు. విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం, ఈ నెల 3 వ తేదీ రాత్రి సుమారు 8 గంటల సమయంలో తన అద్దె ఇంటిలో భార్య భవానిని చేతులతో నులిమి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు నిందితుడు తెలిపాడు. అనంతరం మృతదేహాన్ని తెల్లని సంచిలో ఉంచి తన స్వగ్రామమైన గోలియాతండాకు తీసుకెళ్లి, తన తండ్రి హరిలాల్ సహాయంతో వ్యవసాయ పొలంలో దాచిపెట్టినట్లు వెల్లడించాడు.

ఆ తర్వాత మరుసటి రోజు 04 తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో తన తండ్రి సహాయంతో మృతదేహాన్ని మోటార్ సైక్లి భద్రాచలం గోదావరి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి నదిలో పడవేసినట్లు విచారణలో తెలిపాడు. నేరానికి సంబంధించిన సాక్ష్యాలను మాయం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడినట్లు వెల్లడైంది. నిందితుడు తెలిపిన వివరాల ఆధారంగా పోలీసులు పంచుల సమక్షంలో గోదావరి నదిలో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి భవాని మృతదేహాన్ని గుర్తించారు. ఈ కేసులో నిందితుడు బోడా నరేందర్ను కోర్టులో హాజరుపరిచి రిమాండ్కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలికితీసేందుకు తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. నేరంలో ప్రమేయం ఉన్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో కీలకంగా వ్యవహరించిన కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ, చుంచుపల్లి సీఐ ఆర్. వెంకటేశ్వర్లు, త్రీ టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి, వన్ టౌన్ సీఐ జితేందర్, అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ విజయ్ సింహారెడ్డి, త్రీ టౌన్ ఎస్ఐ రమేష్తో, పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

అర్హులైన ఓటర్ల ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించేందుకు మరో అవకాశం

- జిల్లా కలెక్టర్ అంకిత్
- గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ద్వంద్వ నమోదుల కేటగిరీ ఓటర్లకు తిరిగి అవకాశం
- 1,32,785 మంది ఓటర్ల గుర్తింపు

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 7 (మనంప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు తిరిగి అందని గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన, ద్వంద్వ నమోదుల కేటగిరీకి చెందిన ఓటర్లకు మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లాలో ఈ కేటగిరీ కింద మొత్తం 1,32,785 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ వెల్లడించారు. వీరిలో మరణించిన వారు 31,187 మంది, నివాసం మారిన వారు 78,253 మంది, ద్వంద్వ నమోదులు కలిగిన వారు 14,305 మంది, అందుబాటులో లేని వారు 8,733 మంది, ఇతర కేటగిరీకి చెందిన వారు 307 మంది ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లను సంప్రదించి, వారికి ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ఫారాలను పూర్తి చేసి సమర్పించేందుకు అవసరమైన సహకారం అందిస్తారని, ఫారాలను నేరుగా లేదా ఎన్నికల సంఘం ప్రత్యేక ఆన్లైన్ వేదిక ద్వారా కూడా సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికీ అదే నివాసంలో కొనసాగుతున్న ఓటర్ల అవసరమైన అనుబంధ పత్రం-బి జతచేసి, నివాసం మారిన ఓటర్లు తమ కొత్త చిరునామా వివరాలతో అనుబంధ పత్రం-సి జతచేసి ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించవచ్చని వివరించారు. ఇప్పటికే ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో ద్వంద్వ నమోదులు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపడుతోందని, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితాలో చోటు కోల్పోకుండా అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ప్రతినిధులు కూడా ఎన్నికల సిబ్బందికి సహకరించాలని కోరారు. సంబంధిత ఓటర్లు తమ ప్రాంత బూత్ స్థాయి అధికారులను సంప్రదించి, అవసరమైన ఎన్యుమరేషన్ ఫారాలు, పత్రాలను సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అంకిత్ విజ్ఞప్తి చేశారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



హైదరాబాద్, నవంబర్ 7(మనంన్యూస్): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం తప్పదని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్ ఆధ్వర్యంలో శనివారం బషీర్ బాగ్ చౌరస్తా నుంచి చేపట్టిన చలో సెక్రటేరియట్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. సెక్రటేరియట్కు వెళ్తున్న ర్యాలీని పోలీసులు బషీర్బాగ్ చౌరస్తా వద్ద అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ, అధికారులు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని తప్పుదోవ పట్టిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు.ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో బలహీనవర్గాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని పెండింగ్లో ఉన్న రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు మోదీ రాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

తుఫానుల ప్రభావం.. 45 ప్రాంతాల్లో భారీ స్థాయిలో పారిశుధ్య పనులు



- 693 మంది సిబ్బందితో 78 కిలోమీటర్ల డ్రైనేజీల శుభ్రత.. 88.9 కిలోమీటర్ల రహదారుల శుభ్రత
- 49 నీటి నిల్వ ప్రాంతాల్లో 24 చోట్ల నీటి తొలగింపు.. జేసీబీలతో ముమ్మరంగా పూడికతీత

తాడేపల్లి, నవంబర్ 7, మనం న్యూస్: అర్నబ్, మురసు తుఫానులు, భారీ వర్షాల ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రజారోగ్య పరిరక్షణే ప్రధాన లక్ష్యంగా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో శనివారం భారీ స్థాయిలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహిం చారు. నగరపాలక సంస్థ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి పట్టణాలతో పాటు పరిసర ప్రాంతాల్లో మొత్తం 45 ప్రాంతాలను గుర్తించి 693 మంది సిబ్బందితో పారిశుధ్య పనులు చేపట్టారు. వీరిలో 481 మంది పారిశుధ్య కార్మికులు, 212 మంది అదనపు సిబ్బంది పాల్గొని డ్రైనేజీల శుభ్రత, పూడికతీత, రహదారుల ఊడ్పు, చెత్త వ్యర్థాల తొలగింపు, నీటి నిల్వ ప్రాంతాల పరిశుభ్రత పనులు నిర్వహించారు..ఈ సందర్భంగా నగరవ్యాప్తంగా 78 కిలోమీటర్ల మేర మురుగునీటి కాలువలను శుభ్రం చేసి, వాటిలో పేరుకుపోయిన పూడిక, మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించారు. అవసరమైన ప్రాంతాల్లో జేసీబీ యంత్రాలను వినియోగించి కాలువల్లో పూడికతీత చేపట్టారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధులతో కలిపి మొత్తం 88.9 కిలోమీటర్ల మేర రహదారులను ఊడ్చి పరిశుభ్రం చేశారు. అదేవిధంగా గుర్తించిన 38 చెత్త, వ్యర్థాల నిల్వ ప్రాంతాలను శుభ్రపరిచారు. నగర పరిధిలో గుర్తించిన 49 నీటి నిల్వ ప్రాంతాల్లో 24 చోట్ల నిల్వ ఉన్న నీటిని తొలగించగా, మిగిలిన ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. వర్షాల కారణంగా దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో యాంటీ లార్వా చర్యలు చేపట్టారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆంధ్రరత్న కట్ట వద్ద హోండా షోరూమ్ రోడ్డు, రామచంద్ర ఫర్నిచర్ రోడ్డు, ఏబీసీ రోడ్డు, ఆత్మకూరు-1 పరిధిలో శివాలయం వీధి, కొత్త ఇల్లు ప్రాంతం, పంచాయతీ ప్రధాన రోడ్డు, బ్యాంక్ కాలనీలో పార్క్ రోడ్డు, ప్రధాన రహదారి డ్రెయిన్, బాపనయ్య నగర్, బ్రహ్మానందపురంలోని బొగ్గిళ్లు ప్రాంతం, ఇందిరా నగర్ 5, 6వ వార్డులు, కొప్పురావు కాలనీలో దేవుడి మాన్యం వీధి, కొత్తూరులో అంజిరెడ్డి కాలనీ, కుంచనపల్లిలో పంచాయతీ కార్యాలయం రోడ్డు, ఎస్సీ కాలనీ, నవోదయ కాలనీలో క్రిస్టియన్ పేట, ఎన్సీసీ రోడ్డులో 11వ లైన్ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. అదేవిధంగా నిడమర్రు-1 పరిధిలో కృష్ణుడు దేవాలయం ప్రాంతం, యాదవపాలెం, నిడమర్రు-2 పరిధిలో టిడ్కో గృహాల ప్రాంతం, పద్మశాలి బజార్లో సీపీఎం పార్టీ కార్యాలయం ప్రాంతం, పెనుమాక-1లో పంచాయతీ కార్యాలయం వెనుక ప్రాంతం, పెనుమాక-2లో కొత్తూరు సెంటర్, రాజరాజేశ్వరి నగర్లో ఆశ్రమం రోడ్డు, ఆర్.ఆర్. నగర్, సలాం సెంటర్లో రైల్వే మెయిన్ డ్రెయిన్ గేట్ సెంటర్, షరాఫ్ బజార్ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. టిప్పర్ల బజార్-01 పరిధిలో భద్రావతి నగర్, తిప్పర్ల బజార్-02 పరిధిలో తిప్పర్ల బజార్, ఒకే బిల్డింగ్ ప్రాంతం, ఉండవల్లి సెంటర్ ప్రధాన రహదారి, ఉండవల్లి-1 పరిధిలో టెలిఫోన్ కాలనీ, ఉండవల్లి-2 పరిధిలో వంశీ స్కూల్ వెనుక ప్రాంతం, వడ్డేశ్వరంలోని ఎం.హెచ్.ఆర్. కాలనీ, ఎర్రబాలెం-1లో రామాలయం సెంటర్, సీతానగరంలోని దేవమాని బజార్, సంబాయి బజార్, శారదా బిల్డింగ్, ఘాట్ల ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. కాజా-1 పరిధిలో యాదవ బజార్, మార్కండేయ కాలనీలో కాళీమాత ఆలయం వద్ద, కూరగాయల మార్కెట్ రోడ్డు, టిడ్కో గృహాలకు ఎదురుగా ఉన్న ఆర్టీసీ డిపో రోడ్డు, మార్కండేయ కాలనీ, గోశాల ప్రాంతాలు, కాజా-2 పరిధిలో పుల్లయ్య నగర్, సుందరయ్య నగర్, వెంకటరెడ్డిపాలెం ప్రాంతాల్లో డ్రైనేజీల శుభ్రత, పూడికతీత, చెత్త తొలగింపు పనులు నిర్వహించారు..చిర్రావూరులో దేవాలయం రోడ్డు, లైబ్రరీ సెంటర్, చినకాకాని-1 పరిధిలో కృష్ణ దేవాలయం వెనుక ప్రాంతం, యాదవపాలెం, కొల్లఫారం, మర్రి వెంకయ్య బజార్తో పాటు తుఫాను ప్రభావిత ప్రాంతాలన్నింటిలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మహానాడు-02 పరిధిలో ట్యాంక్ రోడ్డు, సెటిల్మెంట్ కాలనీ, సూర్యనారాయణ నగర్ పరిధిలో రత్నాల చెరువు, ఎస్టీ కాలనీ, చినకాకాని-2 పరిధిలో చెరువు బజార్, ఎస్సీ కాలనీ, డీడీ నగర్ ప్రాంతాలను శుభ్రపరిచారు. శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కాలనీలో బొబ్బిలి బజార్, శ్రామికనగర్, శివదుర్గాపురంలోని బాబు జగ్జీవన్ రామ్ కాలనీ, నులకపేటలో మసీదు వీధి, నూతక్కి-1 పరిధిలో ఎస్టీ కాలనీ, స్థనాల దొంక ప్రాంతం, నూతక్కి-2 పరిధిలో బీసీ కాలనీలో పారిశుధ్య పనులు నిర్వహించారు.ఇప్పటంలోని సచివాలయం రోడ్డు, నౌలూరు-2 పరిధిలో మక్కెవారిపేట, దోలాస్ నగర్లో ప్రభు నగర్, డ్రైవర్స్ కాలనీ పరిసర ప్రాంతాలు, మహానాడు-01 పరిధిలో మహానాడు ప్రాంతంలో కూడా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నిర్వహించి రహదారులు, డ్రైనేజీలను శుభ్రపరిచారు. ఈ విధంగా మొత్తం 45 ప్రాంతాల్లో తుఫానుల ప్రభావం, భారీ వర్షాల కారణంగా తలెత్తే పారిశుధ్య సమస్యలను నివారించేందుకు విస్తృతంగా పనులు చేపట్టారు.ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని నగరపాలక సంస్థ కమిషనర్, అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, మున్సిపల్ ఆరోగ్య అధికారి, ఇంజనీరింగ్ అధికారులు, అన్ని వార్డుల వార్డు పారిశుధ్య, పర్యావరణ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. పారిశుధ్య సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ వివిధ ప్రాంతాల్లో పనుల పురోగతిని పరిశీలించారు. అవసరమైన చోట్ల జేసీబీ యంత్రాలను వినియోగించి పూడికతీత, చెత్త వ్యర్థాల తొలగింపు పనులను వేగవంతం చేశారు.తుఫానులు, భారీ వర్షాల సమయంలో ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా నగరపాలక సంస్థ నిరంతర పారిశుధ్య చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి నీటి తొలగింపు, డ్రైనేజీల శుభ్రత, దోమల నివారణకు ప్రాధాన్యత ఇస్తోంది. ప్రజలు కూడా నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. చెత్తాచెదారాన్ని మురుగునీటి కాలువల్లో వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయాలని, ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణ, నిరంతర పారిశుధ్య నిర్వహణ, పరిశుభ్రమైన నగర నిర్మాణమే లక్ష్యంగా మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు.

గుట్ట కార్తీకోత్సవాలకు మంత్రులకు ఆహ్వానం





హైదరాబాద్, నవంబర్ 7(మనంన్యూస్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 20, 21, 22 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్తీకోత్సవాలకు రాష్ట్ర మంత్రులకు ఆహ్వానం అందింది. శనివారం హైదరాబాద్లో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్లను ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఆలయ ఈవో భవానీ శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా హైదరాబాద్లోని ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి నివాసంలో కార్తీకోత్సవాల ప్రత్యేక పోస్టర్ను మంత్రి ఆవిష్కరించారు. అనంతరం మినిస్టర్స్ క్వార్టర్స్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జి మంత్రి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ను కలిసి ఉత్సవాల పోస్టర్ను ఆవిష్కరింపజేశారు. ఈ వేడుకలకు సంబంధించి మంత్రులు మాట్లాడుతూ.. కార్తీక మాసంలో నిర్వహించే ఈ ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. యాదగిరిక్షేత్రం తెలంగాణలోనే కాకుండా విశ్వవ్యాప్త క్షేత్రంగా విరాజిల్లుతోందని ఐలయ్య అన్నారు. కార్తీకమాసాన్ని నిర్వహించే ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దర్శనాలు, పూజా కార్యక్రమాలతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అనురాగ్ జయంతి, యాదగిరిగుట్ట దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె. భవానీ శంకర్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

సర్‌లో ఓటు పోయిన వారికి మరో ఛాన్స్



హైదరాబాద్, నవంబర్ 7(మనంన్యూస్): తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ముసాయిదా జాబితా విడుదల కాగా, గైర్హాజరు, చిరునామాలో లేకపోవడం, చనిపోయిన, డూప్లికేట్ (ఏఎస్డీడీ) కారణాల పేరిట ఎన్నికల సంఘం దాదాపు 73 లక్షలకు పైగా ఓట్లను తొలగించిన సంగతి తెలిసిందే. అయితే ఇందులో ఓటు హక్కు పొందేందుకు అర్హత ఉన్నవారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. తద్వారా అర్హులైన ఓటర్లు అవసరమైన పత్రాలు సమర్పించి, తుది జాబితాలో తమ పేరు ఉండేలా చూసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్టుగా ఎన్నికల సంఘం తెలిపింది. ఇందుకోసం ఓటర్లు వెంటనే సంబంధిత బీఎల్ఓలను సంప్రదించాలని లేదా 1950 నంబరుకు కాల్ చేయాలని సూచించింది.

తెలంగాణ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ప్రక్రియ చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ పక్రియ ఆగస్టులో ముగిసింది. ఆ తర్వాత ఎన్నికల సంఘం ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేసింది. దాని ప్రకారం తెలంగాణలో దాదాపు 73,39,235 ఓట్లను తొలగించింది. దీంతో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పలువురు ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఇందుకు క్షేత్రస్థాయిలో అనేక పరిస్థితులు కారణమయ్యాయి.

నిర్ణీత గడువులోగా బీఎల్వోలకు ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించకపోవడం, ఒకవేళ సమర్పించిన అందులో తప్పులు ఉండటం, బీఎల్ఓల నిర్లక్ష్యం, కొన్నిచోట్ల బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ పత్రాలు ఇవ్వకపోవడం, ఎన్యూమరేషన్ ఫామ్లో వివరాలు సరిగా నమోదు చేయకపోవడం, వాటిని సరైన టైమ్లో అప్లోడ్ చేయకపోవడం వంటి కారణాలతో అర్హతలు ఉన్న పలువురు ఓటర్ల పేర్లకు ముసాయిదా జాబితాలో చోటు లభించలేదు.

దీంతో దాదాపు 73 లక్షలకు పైగా ఓటర్లను గైర్హాజరు, చిరునామాలో లేకపోవడం, చనిపోయిన, డూప్లికేట్ (ఏఎస్డీడీ) జాబితాలో చేరిపోయారు. అయితే అలాంటివారిలో ఓటు హక్కు పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నవారికి ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. వారు బీఎల్ఓలను సంప్రదించి, అవసరమైన పత్రాలతో తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం తెలిపింది. అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది. ఈ ప్రక్రియ నవంబర్ 21 వరకు కొనసాగుతుందని తెలిపింది. అనంతరం రాష్ట్రంలో తుది ఓటరు జాబితా వెలువరించనున్నట్లు పేర్కొంది. నివాసం మార్చుకోని ఓటర్లు సరిగ్గా నింపిన ఎన్యూమరేషన్ పత్రాలను సమర్పించడంతో పాటు, వాటిని ఇంతకుముందు ఎందుకు సమర్పించలేకపోయారో తెలియజేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలోపల నివాసం మార్చుకున్నవారు ప్రస్తుతం చిరునామా మార్పు కోసం ఫారం-8 దాఖలు చేయనవసరం లేదు. అయితే వారు తమ కొత్త చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గాన్ని పేర్కొంటూ, చిరునామా రుజువుతో కూడిన ఒక ప్రకటనతో పాటు ఎన్యూమరేషన్ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించాలి. ఇక, చిరునామా పత్రాలు లేని నిరాశ్రయులైన ఓటర్ల విషయంలో బీఎల్వో క్షేత్రస్థాయి ధ్రువీకరణ నివేదికను నివాస రుజువుగా అంగీకరించనున్నారు. ఇక, ఆమోదించబడిన దరఖాస్తులను తుది ఓటర్ల జాబితాలో చేర్చడం కోసం విడిగా ఉంచుతారు. ఓటర్లు తమ పాత ఓటర్ నంబర్లను కలిగి ఉంటారు.

200 మంది పేదలకు దుప్పట్లు, స్వీట్స్ పంపిణీ



విజయవాడ సెంట్రల్, నవంబర్ 7 (మనం న్యూస్): శనివారం ఉదయం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 71వ డివిజన్ సత్యనారాయణపురంలో చారిత్రక బాబురావు మేడ యజమానులు రాజరమణి ఆధ్వర్యంలో దీపావళి పండుగను పురస్కరించుకుని పేదలకు చేయూతనిచ్చే కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్ధార్థ ముఖ్య అతిథిగా పాల్గొని సుమారు 200 మంది నిరుపేదలకు దుప్పట్లు మరియు స్వీట్స్ పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బొండా సిద్ధార్థ మాట్లాడుతూ దీపావళి అంటే కేవలం దీపాలు వెలిగించే పండుగ మాత్రమే కాదని, ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపే పండుగ అని అన్నారు. పండుగ వేళ పేదలు, నిరుపేద కుటుంబాలతో ఆనందాన్ని పంచుకోవడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

సేవా కార్యక్రమాల ద్వారా పేదల జీవితాల్లో కొంతైనా ఆనందాన్ని నింపగలిగితే అదే నిజమైన పండుగ అని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సోదరభావం, సేవా స్ఫూర్తిని మరింత పెంపొందిస్తాయని అన్నారు. ఈ మంచి కార్యక్రమానికి ముందుకు వచ్చిన రాజరమణి ని అభినందించారు.

ఈ కార్యక్రమంలో :-71వ డివిజన్ కార్పొరేటర్ గార్లపాటి ఊర్మిళ, డివిజన్ పార్టీ ఇంచార్జి గార్లపాటి విజయకుమార్, గుడిపాటి దత్తు, జె. రామలక్ష్మి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ బియ్యం భారీగా మాయం



హైదరాబాద్, నవంబర్ 7(మనంన్యూస్): ప్రభుత్వానికి అప్పగించాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బియ్యం నిల్వల్లో భారీ వ్యత్యాసం వెలుగులోకి వచ్చింది. పెన్పహాడ్ మండల పరిధిలోని అనంతారం ఎక్స్‌రోడ్డు సమీపంలో ఉన్న మహదేవ్ హైటెక్ రైస్ ఇండస్ట్రీస్లో సివిల్ సప్లై అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సిన సీఎంఆర్ బియ్యం భారీగా అందుబాటులో లేనట్లు గుర్తించినట్లు సమాచారం. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మిల్లుకు సంబంధించిన సీఎంఆర్ లెక్కలను,నిల్వలను పరిశీలించగా మొత్తం 3,919.686 మెట్రిక్ టన్నుల బియ్యం అందుబాటులో లేదని గుర్తించారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.12 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేసినట్లు తెలిసింది. ప్రభుత్వానికి అప్పగించాల్సిన బియ్యం నిల్వలు మిల్లులో లేకపోవడం పై అధికారులు తీవ్రంగా పరిగణించారు.

బియ్యం లెక్కల పై ప్రశ్నలు..

రైతుల నుంచి ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. మిల్లర్లు నిబంధనల ప్రకారం ధాన్యాన్ని మరపట్టి, నిర్ణీత పరిమాణంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. అయితే పెన్పహాడ్లోని మహదేవ్ హైటెక్ రైస్ ఇండస్ట్రీస్లో భారీ మొత్తంలో సీఎంఆర్ బియ్యం అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం నిల్వల వ్యత్యాసానికి గల కారణాలు ఏమిటి ? ఈ వ్యవహారంలో ఇంకా ఎవరైనా బాధ్యులుగా ఉన్నారా ? ప్రభుత్వానికి జరిగినట్లు అంచనా వేస్తున్న నష్టాన్ని ఎలా రికవరీ చేస్తారు ? అనే అంశాల పై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. కేసు నమోదుతో సరిపెట్టకుండా ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం నిల్వల పై పూర్తి స్థాయి విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది

అమెరికాలో తెలంగాణ యువతి మిస్సింగ్





హైదరాబాద్, నవంబర్ 7(మనంన్యూస్): అమెరికాలో భారత విద్యార్థిని అదృశ్యమైంది. మసాచుసెట్స్ రాష్ట్రంలోని బోస్టన్లో ఉంటున్న శ్రీజ కోయ నవంబర్ 2 రాత్రి నుంచి కనిపించడం లేదు. దీంతో తెలంగాణలోని ఆమె తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తమ కుమార్తె జాడను గుర్తించడం సాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... నల్గొండ జిల్లా కనగల్ మండలం శాబ్దుల్లాపురం గ్రామానికి చెందిన కోయ యాదగిరిరెడ్డి, రూప దంపతుల ఏకైక కుమార్తె కోయ శ్రీజ. శ్రీజ ఎంఎస్ చదివేందుకు ఏడాదిన్నర క్రితం అమెరికాకు వెళ్లింది. బోస్టన్లోని యూనివర్సిటీ ఆఫ్ మసాచుసెట్స్ బోస్టన్లో ఆమె ఎంఎస్ చేస్తుంది. అక్కడే పలువురు తెలుగు విద్యార్థినులతో కలిసి ఉంటోంది. అక్కడికి సమీపంలో పార్ట్ టైమ్ జాబ్ కూడా చేస్తోంది. మరో ఆరు నెలల్లో శ్రీజ ఎంఎస్ కోర్సు పూర్తికావాల్సి ఉంది.

అయితే శ్రీజ నవంబర్ 2న కాలేజీకి వెళ్లింది. అలాగే, పార్టైమ్ ఉద్యోగం ముగించుకుని తన రూమ్కు చేరుకుంది. అదే రోజు శ్రీజ రూమ్మేట్ పుట్టినరోజు వేడుకలు ఉంది. దీంతో ఇతర స్నేహితులు అందుకోసం ఏర్పాట్లు చేశారు. అయితే శ్రీజ నవంబర్ 2న సాయంత్రం వేళ తాను ఉంటున్న ప్రదేశం నుంచి బయటకు వెళ్లింది. వాకింగ్ కోసం వెళ్తున్నట్టుగా స్నేహితులకు చెప్పింది. కొద్దిసేపట్లోనే తిరిగి వస్తానని తెలిపింది.

అయితే ఆ తర్వాత శ్రీజ తిరిగి రూమ్కు చేరుకోలేదు. మరోవైపు ఆమె ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ వస్తోంది. దీంతో శ్రీజ స్నేహితులు ఆందోళన చెందారు. ఇందుకు సంబంధించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అంతేకాకుండా, తెలంగాణలోని ఆమె తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు.

శ్రీజ మిస్సింగ్ ఘటనపై బోస్టన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శ్రీజ ఆచూకీ కోసం ముమ్మర గాలింపు చేపట్టారు. శ్రీజకు సంబంధించిన ఏమైనా సమాచారం ఉంటే తెలియజేయాలని స్థానికులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు. శ్రీజ చివరిసారిగా కనిపించిన ప్రాంతం సెల్ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు పలు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. కార్సన్ బీచ్, హార్బర్ పాయింట్ పరిసర ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.అయితే ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తమ కుమార్తె ఇలా కనిపించకపోవడం శ్రీజ తల్లిదండ్రులు యాదగిరి రెడ్డి, రూప దంపతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో తమకు సాయం అందించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని అభ్యర్థించారు. దీంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అంతేకాకుండా సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని ఇండియన్ ఎంబసీ, భారత విదేశాంగ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

''తెలంగాణలోని నల్గొండకు చెందిన శ్రీజ రెడ్డి ప్రస్తుతం ఫ్ఛటఖఅౌ్టౌలో చదువుకుంటుంది. శ్రీజ రెడ్డి అదృశ్యమైనట్లు వస్తున్న వార్తల పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నాను. భారత ఎంబసీ, విదేశాంగ శాఖ, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, జై శంకర్, తదితరులు తక్షణమే సమన్వయం చేసుకుని, ఆమెను సురక్షితంగా కనుగొనేందుకు అన్ని విధాలా కృషి చేయాలని కోరుతున్నాను'' అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎక్స్లో పేర్కొన్నారు.

దివీస్‌కు లాభాలు.. స్థానికులకు కన్నీళ్లు !



హైదరాబాద్, నవంబర్ 7(మనంన్యూస్): పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉపాధి దక్కుతుందని, ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశించారు. కానీ చౌటుప్పల్ ప్రాంతంలోని దివీస్ పరిశ్రమ విషయంలో స్థానిక నిరుద్యోగుల ఆశలు అడియాశలవుతున్నాయి. పరిశ్రమ ఏర్పాటు వల్ల తమ బతుకులు మారుతాయని భావించిన నిరుద్యోగ యువతకు నిరాశే మిగులుతోందనే ఆవేదన వ్యక్తమవుతోంది. పరిశ్రమకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా, స్థానికులకు మాత్రం ఉపాధి అవకాశాలు కల్పించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చౌటుప్పల్, మునుగోడు నియోజకవర్గ పరిధిలోని అనేక గ్రామాలకు చెందిన యువత డిగ్రీలు, పీజీలు, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్యను అభ్యసించారు. పరిశ్రమల్లో ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో విద్యార్హతలు పెంచుకున్నారు. అయినప్పటికీ దివీస్ పరిశ్రమలో వారికి తగిన అవకాశాలు దక్కడం లేదు. ముఖ్యంగా క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్, టెక్నికల్ వంటి కీలక విభాగాల్లో స్థానికేతరులైన ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పరిశ్రమకు కూతవేటు దూరంలో నివసిస్తున్నా ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని యువత వాపోతోంది.

స్థానిక యువతకు అన్యాయం..

దివీస్ పరిశ్రమలో కీలక ఉద్యోగాలన్నీ ఆంధ్రా వారికే.. తెలంగాణ యువతకు స్వీపర్, కాంట్రాక్ట్ కొలువులేనా? అంటూ చౌటుప్పల్ మండలంలోని నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కీలకమైన, ఉన్నతస్థాయి ఉద్యోగాలన్నీ ఆంధ్రా ప్రాంతం వారికే కేటాయిస్తూ, తెలంగాణ ప్రాంతానికి చెందిన అర్హత, నైపుణ్యం ఉన్న స్థానిక యువతకు తగిన అవకాశాలు కల్పించడం లేదని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల భూములు, వనరులు వినియోగించుకుంటున్న పరిశ్రమ యాజమాన్యం ఉద్యోగాల విషయంలో మాత్రం ఇక్కడి యువతకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా దివీస్ యాజమాన్యం ఉద్యోగాల నియామకాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్థానిక యువత నుంచి డిమాండ్ పెరుగుతోంది.

ఉద్యమాలకు ఆదిలోనే అడ్డుకట్ట ?

స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించాలని, పరిశ్రమ కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని కొందరు స్థానిక నాయకులు ఉద్యమాలకు సిద్ధమైనప్పటికీ అవి ముందుకు సాగడం లేదు. పోలీసుల అండతో ఆందోళనలను ప్రారంభంలోనే అడ్డుకుంటున్నారు. మరోవైపు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులను పరిశ్రమ యాజమాన్యం తమకు అనుకూలంగా మలుచుకుంటోందని కొందరు ఆరోపిస్తున్నారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తుండడంతో స్థానికుల సమస్యలకు పరిష్కారం లభించే అవకాశం లేకుండా పోతోందని స్థానికులు వాపోతున్నారు.

సేవా కార్యక్రమాల వెనుక అసలు కథేంటి ?

పరిశ్రమ పరిసర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ, ఉచిత వైద్య శిబిరాల నిర్వహణ వంటి కార్యక్రమాలను దివీస్ యాజమాన్యం చేపడుతోంది. అయితే ఈ కార్యక్రమాల వెనుక సామాజిక బాధ్యత ఎంత? పరిశ్రమపై వస్తున్న విమర్శలను పక్కదారి పట్టించే ప్రయత్నం ఎంత? అనే ప్రశ్నలు స్థానికంగా చర్చకు వస్తున్నాయి. సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమే అయినప్పటికీ, పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంపై ప్రజల్లో ఉన్న సందేహాలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉంది. పర్యావరణ నిబంధనలు పాటిస్తున్న తీరుపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది. స్థానిక నిరుద్యోగ యువతకు ఎందుకు ఉపాధి కల్పించడం లేదో ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం ఏర్పడింది.

మనం

హైదరాబాద్ - ఆదివారం 8 నవంబర్ 2026

నేడు దీపావళి...

నేడు దీపావళి పండగ. వెలుగుల పండగగా భావించే దీపావళి నేడు తెలుగు రాష్ట్రాల్లో జరుపుకుంటున్నారు. అమావాస్య రోజున వచ్చే దీపావళి రోజున ఉదయాన్నే స్నానమాచరించి ఆలయాల్లో పూజలు నిర్వహించుకుంటారు. ప్రతి ఇంట్లో లక్ష్మీదేవిని పూజిస్తారు. అమ్మవారికి ఇష్టమైన నైవేద్యాలను తయారు చేసి ప్రసాదంగా పంచుతారు. ఈ పండగకు టపాసులు సాయంత్రం వేళ ఎంత ముఖ్యమో నోరు తీపి చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ఈరోజు ప్రతి ఇళ్లలో మిఠాయిలు తయారు చేసుకుంటారు. ప్రస్తుత సమాజంలో ఎక్కువ మంది స్వీట్ షాపుల నుంచి కొనుగోలు చేసి పని భారం తగ్గించుకుంటున్నారు.







జీవితంలో వెలుగులు నింపే పండుగ దీపావళి. దీపావళి రోజున లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో పూజించడం వల్ల అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. దీపావళి రోజు శాస్త్రాల ప్రకారం ఏమేం చేయాలో ఇక్కడ తెలియజేశాం. ఈ పనులు చేయడం వల్ల లక్ష్మీకటాక్షం కలుగుతుంది. ఇంట్లో శాంతి నెలకొంటుంది. దీపావళి రోజున ఇంటిని శుభ్రంగా ఉంచుకోవడం, లక్ష్మీ పూజలు చేయడం, లక్ష్మీదేవి దివ్య మంత్రాలను జపించడం వల్ల మంచి జరుగుతుంది.

అష్టైశ్వర్యాలను ప్రసాదించాలని...

లక్ష్మీ దేవిని పూజించి తమకు తమ కుటుంబ సభ్యులకు అష్టైశ్వర్యాలను ప్రసాదించాలని కోరుకుంటారు. ఉదయాన్నే లేచి తలారా స్నానమాచరించి శుద్ధిగా వంటలు చేసి లక్ష్మీదేవికి సమర్పించుకుంటారు. రాక్షసుడు నరకాసురుడిని సత్యభామ వధించిన రోజు కావడంతో అందరూ ఆనందంగా ఈ పండగ చేసుకోవడం సంప్రదాయంగా వస్తుంది. ఇంటిల్లిపాది ఒకచోట చేరి వేడుకగా ఈ పండగ చేసుకోవడం సంప్రదాయంగా వస్తుంది. దీపావళి అంటేనే చిన్నారుల నుంచి పెద్దల వరకూ తెలియని హుషారు. అందుకే దీపావళికి ఉన్న ప్రత్యేకత మరే పండగకు ఉండదు. పండగకు కొత్త అల్లుళ్లు రావడంతో ఇల్లు మరింత పండగ శోభను సంతరించుకుంటుంది.

దీపాలు.. టపాసులు...

సాయంత్రం ఆరు గంటలు అయ్యేసరికి వెలుగులు నిండిపోతాయి. ఇంటి నిండా దీపాలతో అలంకరిస్తారు. టపాసులు పేల్చి తమ ఆనందాన్ని







వెలుగు దివ్వెల దీపావళి

వ్యక్తం చేస్తారు. బాణా సంచా కాలుస్తూ రాత్రి పది గంటల వరకూ కుటుంబ సభ్యులందరూ ఆనందంతో గడుపుతారు. దీపావళి అంటే సత్యభామ నరకాసురుడిని వధించిన రోజు కావడంతో రాక్షస సంహారం జరిగిందని భావించి పూర్వ కాలం నుంచి దీపావళిని ఘనంగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తుంది. ఈరోజు కూడా దేశమంతా వెలుగులతో నిండిపోతుంది. అయితే కాలుష్యం పెరిగిపోతుందని ఒకవైపు ఆందోళన వ్యక్తమవుతున్నప్పటికీ సంస్కృతి సంప్రదాయాలను విస్మరించడం సరికాదని భావించి ఈ పండగను దేశమంతా జరుపుకుంటారు.

తిమిరాన్ని సంహరించి వెలుగులు ప్రసాదిస్తుంది దీపావళి. ఉదయాన్నే ఇంటిల్లిపాది దీపావళి నాడు శరీరానికి తైలం రాసుకుని అభ్యంగన స్నానం చేయడం ఆనవాయితీ. దీపాలు అంటే జ్ఞానదీపంగా భావించేవారు. నాడు పూజలు, దీపాలు పెట్టడం దీపావళికి ప్రత్యేకమైన పండగగా భావించాలి. దీపావళి అమావాస్యను తెలుగులో దివ్యల అమావాస్య అంటారు. దీపాలు పెట్టడాన్ని దివ్యలెత్తు అంటారు. దీపావళి కాంతుల్లో వెలుగులను ప్రతిబింబిస్తాయి. దీపావళి ఐదు రోజుల పండగ. గతంలో దీపాలు ఎక్కువగా పెట్టేవారు. శుచి, శుభ్రత పాటించాలి. దీపాలు పెట్టడంతో చలి వాతావరణం కాస్త ఉష్ణం పెరుగుతుంది. లక్ష్మీ పూజతో దారిద్యం తొలగుతుంది. కారణం ఏదైనా చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దీపావళి.

నరక చతుర్దశి రోజే సత్యభామ నరకాసురుడిని వధించడం వల్ల దీపావళి జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. నరకాసురుడనే రాక్షసుడి పీడ వదిలినందుకు ప్రజలు ఆనందంగా సత్యభామా కృష్ణులకు స్వాగతం పలికి దీపాలు వెలగించారని పురాణాలు చెబుతున్నాయి. నరకుడిని వధించిన సందర్భంగా జరుపుకునే పండగే దీపావళిగా ప్రసిద్ధి చెందింది. నరకాసుర సంహారం జరిగిన ఆశ్వయుజ బహుళ చతుర్దశి రోజు శ్రీకృష్ణుడి విజయానికి సంకేతంగా ప్రజలు దీపాలు వెలిగించి ఈ పండగ చేసుకున్నారని పురాణాలు చెబుతున్నాయి. అలాగే రాముడు అరణ్యవాసం నుంచి వచ్చిన రోజున దీపావళి అని ఉత్తరాది వారు జరుపు కుంటారు. సత్యభామ నరకున్ని వధించడంతో ప్రజలు బాణాసంచా పేల్చి సంబరాల్లో మునిగిపోతారు. అమావాస్య రోజున వచ్చే ఏకైక అతిపెద్ద పండగ దీపావళి. ఇకపోతే దీపావళి లక్ష్మీపూజలకు కూడా ప్రత్యేకం. అమ్మవారిని కొలవడం, ధనపూజలు చేయడం ఈ పండగ ప్రత్యేకం. దీపావళి సాయంత్రం ధనలక్ష్మి పూజతో వేడుకలు ప్రారంభం అయ్యేవి. దీపాలు పెట్టడం తోటే పండగ మొదల య్యేది. ఆ రోజునే దీపాలు పెట్టడానికే అమిత ప్రాధాన్యం నిచ్చేవారు. అమావాస్యరోజు చీకటి సమూలంగా దూరమవుతుంది. దీపం అంటేనే జ్ఞాన దీపంగా భావించేవారు. ఇంటి చుట్టు, పైన దీపాలను మట్టి ప్రమిదలలో నూనె పోసి ధారంతో నేసిన వత్తులను వెలిగించేవారు. ఇదే సందర్భంగా బాణాసంచా కాల్చడం ఆనావాయితీగా వస్తోంది. మొత్తంగా దీపావళి అన్నది వెలుగులు నింపేద పండగ. ఇకపోతే తెలంగాణలో కొత్తగా పెళ్లయిన ఆడ పడుచులను తీసుకుని వచ్చి కొత్త గా వచ్చిన అల్లుళ్లను పండగలకు తోడ్కొని రావడం కూడా వస్తోంది. దీపావళి ప్రధానంగా తెలుగువారింట వెలుగు నింపే పండగ. ప్రదోష సమయంలో సాయంత్రం 5.35 గంటల నుంచి 6.30 గంటల వరకు లక్ష్మీ పూజ చేయడం సంప్రదాయంగా ఉండేది. అమావాస్య నాడే ఈ దివ్వెల పండగ జరుపుకోవడం వెనక ఎన్నో విషయాలు దాగి ఉన్నాయి. చీకట్లో దీపాలు బాగా వెలుగుతాయని.. ఆ చైతన్య దీపాలు, జ్ఞాన జ్యోతులు మన జీవితాల్లోని నిరాశలను తొలగిస్తాయనే ధైర్యాన్నిచ్చే ఉత్సవం ఇది. నరకాసుర సంహారం జరిగింది కాబట్టి ప్రజలు ఆనందంగా దీపాలు వెలిగించి ఉత్సవం చేసుకున్నారని భాగవతంలో ఉంది. పూర్వం దీపావళి రోజున దీపాలు పెట్టడం ప్రారంభించి కార్తీకం అంతా కొనసాగించే వారు. ఉత్తరాది వారు ధంతేరస్ అంటే బంగారం అమ్మకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ రోజు బంగారం కొంటే మంచిదన్న నమ్మకం ఉంది. అలాగే దీపాశళికి నోములు,వ్రతాలు ఆచరించడం కూడా ఉంది. సకల సంపదలకు నిలయం శ్రీ మహాలక్ష్మీ అమ్మవారు. ఆమె కరుణ తమపై ప్రసరించాలని కోట్లాది భక్తులు నిత్యపూజలు చేస్తుంటారు. వైకుంఠంలో శ్రీహరి హృదయం ఆక్రమించుకున్న అమ్మవారు భక్తుల కోసం శ్రీమహాలక్ష్మీ పూజలందుకునే రోజున దీపావళిగా పూజిస్తారు. అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రధానంగా ధనానికి రూపంగా పూజించడం ఆనవాయితీగా వస్తోంది. దీపావళి రోజు, మరునాడు వ్రతాలు ఆచరించడం కూడా ప్రత్యేకంగా చేస్తుంటారు. మహాలక్ష్మి అమ్మవారికి అనేక ఆలయాలు కూడా ఉన్నాయి. శ్రీమహావిష్ణువు వైకుంఠంలో వుండగా భృగుమహర్షి వచ్చాడు. యోగనిద్రలో ఉన్న విష్ణువు రుషి రాకను విష్ణువు గమనించలేదు. దీంతో ఆగ్రహం చెందిన భృగువు స్వామివారి ఎదపై కాలుతో తన్నారు. దీంతో ఆగ్రహించిన లక్ష్మీదేవి భూలోకానికి వెళ్లి తపస్సులో మునిగిపోయింది. భృగువు పాదంలో కన్నును లొక్యంగా తీసివేసిన మహావిష్ణువు రుషి గర్వాన్ని అణచివేశాడని పురాణైతిహ్యం. అనంతరం అమ్మవారి కోసం అన్వేషిస్తూ తిరుమలలో శ్రీ వేంకటేశ్వరుడిగా అవతరించినట్టు పురాణాలు పేర్కొంటున్నాయి. అలా వచ్చిన శ్రీమహాలక్ష్మి కొల్హాపురంలో వెలసినట్లుగా చెబుతారు. మరికొందరు పద్మావతిగా అవతరించిందని అంటారు. అమ్మవారి ప్రాశస్త్యం అందరికి తెలియడంతో ఆయా క్షేత్రాలు ప్రసిద్ధి చెందాయి. లోకమాత జగదాంబ కరుణాకటాక్షాల కోసం అష్టయిశ్వర్యాలు సిద్ధించాలని అనాదిగా పూజలు చేస్తూనే ఉన్నారు. ఆ క్రమంలోనే దీపావళికి ధనపూజలు చేయడం అన్నది వాడుకలోకి వచ్చింది. వేల సంవత్సరాల నుంచి మహర్షులు, రుషులు పూజలు చేసినట్టు చారిత్రక ఆధారాలు పేర్కొంటున్నాయి. ఇక అర్ధరాత్రి వేళ దీప కాంతుల నడుమ శ్రీ మహాలక్ష్మిని శ్వేత పుష్పాలతో అష్టోత్తరశత నామాలతో ఆరాధిస్తే సిరుల తల్లి అనుగ్రహం అపారంగా ఉంటుంది. దశాబ్దాలుగా దీపావళి ఎంతో విశిష్టంగా, సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకుంటున్నారు. దీనికి భాషా,ప్రాంత భేదాలు లేవు. ప్రధానంగా హిందూ సంప్రదాయం అనేది నాటి దీపావళి పర్వదినాన కనిపించేది. ఇకపోతే దీపావళి మరునాడు కేదార గౌరీ వ్రతం ఆచరించడం సంప్రదాయం. సాయంత్రం వేళ ఇంటి ముందు దీపకాంతులు దారిద్య నాశనానికి ప్రతీక. అందుకే దీపాలు అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది.

దత్తో దీపశ్చతుర్దశ్యాం నరక ప్రీతయే మయా
చతుర్వర్తి సమాయుక్తః సర్వపాపాపనుత్తయే

వెలుగు దివ్వెలు దీపాలు వెలిగించి లక్ష్మీదేవి అనుగ్రహంతో సిరి సంపదలు లభిస్తాయని దీపావళి ప్రారంభించుకుంటారు. దాపరయుగంలో రాక్షస రాజు నరకాసురుడు వర గర్వంతో ముల్లోకాలను దేవతలను, ప్రజలను ముప్పు తిప్పలు పెడతాడు. అతడి ఆగడాలను శ్రీకృష్ణుడు రంగంలోకి దిగి నరకాసురున్ని వధిస్తాడు. దీంతో ప్రజలు సంతోషంగా దీపాలు వెలిగిస్తారు. ఇది దీపావళిగా మారిందని మరోకథనం. పాండవులు కౌరవులతో జూదం ఆడి ఓడి పోవడంతో 12 సంవత్సరాల అరణ్య వాసం, ఏడాది అజ్ఞాత వాసానికి వెళ్లాల్సి వస్తుంది. సుదీర్ఘ కాలం తరువాత పాండవులు తిరిగి రాజ్యానికి చేరుకోవడంతో ప్రజలు సంతోషంగా దీపాలు వెలిగించి స్వాగతం పలుకుతారు. ఇదే దీపావళి అయ్యిందని కొందరి నమ్మకం. ఇలా రకరకాల కథనాలు ఉన్నాయి.

ఆనంద దీపావళి

చీకటిని తరిమి వెలుగులను దశదిశలా ప్రసరించే దీపావళి
మన మనసులోని బాధలను మరిపించే దరహాస జ్యోతుల దీపావళి
అజ్ఞానాంధకారాన్ని తరిమి అంతరంగాన జ్ఞానజ్యోతిని ప్రకాశింపచేసే దీపావళి
చిన్నా, పెద్దా తేడా లేకుండా సంతోసాగరంలో తన్మయత్వంతో ఓలలాడే దీపావళి

కళకళలాడే దీప కాంతులతో మన ఇంట లక్ష్మీదేవి స్థిర నివాసమాయే
సుఖసంతోషాలతో, భోగభాగ్యాలతో మన ఇల్లు శోభిల్లే దీపావళి
దీప ప్రజ్వలనతో శోభయమానంగా మన మానసమందిరాన ప్రకాశించే శుభ దీపావళి
కులమత తారతమ్యం లేకుండా సంతోషంగా ప్రతి ఇంటా దీపాలను వెలిగించే ఆవళి దీపావళి

అందరం సమిష్టిగా, సంతోషంగా ఆనందసాగరంలో ఓలలాడే దీపావళి
నిత్త నూతనోత్సాహాన్నిచ్చి మదిలో జ్యోతి వెలుగులను ప్రసరించే దీపావళి
కనులారా, తనివితీరా తిలకించి మనసారా ఆనందించే దీపావళి

ఈ ఒక్కరోజే కాదు మన ఇంట దీపావళి
నిత్యం రావాలి మన ఇంట దీపావళి
అదే అసలైన దీపావళి - ఆనంద కాంతుల దీపావళి

దీపావళి కథలెన్నో...

పండుగలంటేనే ఆనందోత్సాహాలు నింపుతాయి. అన్నింటిలోకెల్లా దీపావళి మరింత ఉత్సాహాన్ని ఇస్తుంది. ఆ దీపావళి వెనక ఎన్నెన్నో కథలు ఉన్నాయి. తండ్రి ఆజ్ఞా ప్రకారం శ్రీరాముడు 14 సంవత్సరాలు అరణ్య వాసానికి వెళ్తాడు. అక్కడ లంకాధిపతి రావణుడు రాము డు లేని సమయం చూసి సీతమ్మవారిని ఎత్తుకుపోయి లంకలో బంధిస్తాడు. ఇది తెలుసుకున్న రాముడు వానర సైన్యంతో వెళ్లి రావణాసురుడిని ఓడించి సీతమ్మను తీసుకొస్తాడు. అరణ్య వాసం పూర్తి కావడంతో అయోధ్య నగరానికి తిరిగి వచ్చిన సందర్భంలో నగర ప్రజలు సంతోషంగా ఇళ్లలో దీపాలు వెలిగించి టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేస్తారు. ఇదిలా ఉంటే చిరకాలం జీవించాలనే ఆశతో అమృతం కోసం దేవతలు రాక్షసులు కలిసి పాల సముద్రాన్ని చిలుకుతుంటారు. అమృతంకంటే ముందుగా సముద్రం నుంచి లక్ష్మీదేవి ఉద్భవిస్తుంది. అమ్మవారు జన్మించిన ఈ రోజు ఇంటి నిండా దీపాలు వెలిగించి లక్ష్మీదేవి అనుగ్రహంతో సిరి సంపదలు లభిస్తాయని దీపావళి ప్రారంభించుకుంటారు. దాపరయుగంలో రాక్షస రాజు నరకాసురుడు వర గర్వంతో ముల్లోకాలను దేవతలను, ప్రజలను ముప్పు తిప్పలు పెడతాడు. అతడి ఆగడాలను శ్రీకృష్ణుడు రంగంలోకి దిగి నరకాసురున్ని వధిస్తాడు. దీంతో ప్రజలు సంతోషంగా దీపాలు వెలిగిస్తారు. ఇది దీపావళిగా మారిందని మరోకథనం. పాండవులు కౌరవులతో జూదం ఆడి ఓడి పోవడంతో 12 సంవత్సరాల అరణ్య వాసం, ఏడాది అజ్ఞాత వాసానికి వెళ్లాల్సి వస్తుంది. సుదీర్ఘ కాలం తరువాత పాండవులు తిరిగి రాజ్యానికి చేరుకోవడంతో ప్రజలు సంతోషంగా దీపాలు వెలిగించి స్వాగతం పలుకుతారు. ఇదే దీపావళి అయ్యిందని కొందరి నమ్మకం. ఇలా రకరకాల కథనాలు ఉన్నాయి.

7 నియమాలు తప్పనిసరి..

పరిశుభత

పరిశుభ్రంగా ఉన్న చోట మాత్రమే లక్ష్మీదేవి ఉంటుంది. మురికిగా ఉన్న ఇంట్లోకి లక్ష్మీదేవి ప్రవేశించదు. కాబట్టి ఇంటిని చక్కగా క్లీన్ చేసుకోండి. దీపావళి అమావాస్య రోజు లక్ష్మీదేవి భూలోకంలో సంచరిస్తూ, పరిశుభ్రంగా ఉన్న ఇంట్లోకి వెళ్లి స్థిర నివాసం ఏర్పరుచుకుంటుందని పండితులు చెబుతున్నారు. కాబట్టి ఇంటిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి. పూజా మందిరం, వ్యాపార స్థలాలను శుభ్రపరుచు కోండి. దీంతో ఇంటి నుంచి నెగిటివ్ ఎనర్జీ తొలగుతుంది.

ప్రధాన ద్వారం

ఇంటి ప్రధాన ద్వారా నుంచే మహాలక్ష్మీదేవి ఇంట్లోకి ప్రవేశిస్తుందని నమ్మకం. ఇంటి ప్రధాన ద్వారం దగ్గర మామిడి ఆకుల తోరణాలు కట్టండి. మెయిన్ డోర్ దగ్గర ముగ్గులు వేయండి. లక్ష్మీదేవి పాదాల ముగ్గ వేయడం మంచిది. ఇది లక్ష్మీదేవికి స్వాగతం పలకడానికి ప్రధాన ఘట్టం.

ప్రదోష కాలంలో లక్ష్మీ-గణపతి పూజ

దీపావళి సాయంత్రం ప్రదోష కాల ముహూర్తంలో గణపతి, మహాలక్ష్మి, సరస్వతి దేవుళ్లకు ఒకేసారి పూజలు చేయండి. నియమనిష్టలతో లక్ష్మీదేవి పూజ చేయండి. శ్రీ మహాలక్ష్మీ స్తోత్రం, లక్ష్మీ అష్టోత్తరం వంటివి చదవండి. పూజలో లక్ష్మీదేవికి పాయసం, తామరపూలు, పంచామృతాన్ని నైవేద్యంగా సమర్పించాలి. లక్ష్మీ పూజ చేయడం వల్ల ధనప్రాప్తి కలుగుతుంది.

దీపారాధన

దీపావళి రోజు రాత్రి మట్టి ప్రమిదలతో నువ్వుల నూనెతో దీపాలు వెలిగించండి. పూజ గది, ఇంటి గుమ్మం, బావి వద్ద దీపాలు వెలిగించండి. దీపాల కాంతి అజ్ఞానాన్ని, దారిద్ర్యాన్ని తొలగిస్తుంది. ఐశ్వర్యాన్ని అందిస్తుంది.

కుబేర స్థాన ఆరాధన

సంపదలకు అధిపతి అయిన కుబేరుడిని లక్ష్మీదేవితో పాటుగా పూజించడం వల్ల ఆస్తిపాస్తులు స్థిరంగా ఉంటాయి. పూజలో బంగారు, వెండి నాణేలను పీఠంపై ఉంచండి. ఈ సమయంలో ఓం కుబేరాయ నమః అనే మంత్రాన్ని జపించండి.

ధన మంత్ర జపం

లక్ష్మీదేవి పూజ సమయంలో భక్తితో సంకల్పం చెప్పుకొని లక్ష్మీదేవి మంత్రాలు జపించండి. ఓం శ్రీం హ్రీం క్లీం శ్రీం సిద్ధ లక్ష్మ నమః ఈ మంత్రాన్ని 108 సార్లు జపించడంతో ఆర్థిక ఇబ్బందులు నుంచి బయట పడొచ్చు.

నూతన ఖాతా పుస్తకాలు

వ్యాపారులు తమ దగ్గర ఉన్న పాత లెక్కల పుస్తకాలను ముగించి, నూతన ఖాతా పుస్తకాలను ప్రారంభించాలి. ఆ పుస్తకాలకు పూజ చేయాలి. ఇదే రోజు అన్న దానం, వస్త్రదానం చేయడం మంచిది.

- సెంట్రల్ డెస్క్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు మరో అవకాశం

నవంబర్ 21 వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి

అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా విస్తృత ప్రచారం నిర్వహించాలి

సర్ -2026 ప్రక్రియపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి



సూర్యాపేట, నవంబర్ 7 (మనం ప్రతినిధి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎన్నికల సంఘం లక్ష్యమని, ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ సర్-2026 ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాలో పేర్లు నమోదు కాని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించినట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు.శనివారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సర్-2026 ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయడం, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన, ద్వంద ఆబ్సెంట్ , షిఫ్టెడ్, డెత్, డబుల్ ఓటర్ల వివరాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమీక్ష నిర్వహించారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... భారత ఎన్నికల సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మరో ఏడు రాష్ట్రాల్లో సర్-2026 ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించిందని పేర్కొన్నారు.ఈ అవకాశం పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణకు మరొక అవకాశం

సర్-2026 ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని వారు మరోసారి తమ ఫారాలను సమర్పించేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, డబుల్ తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఆబ్సెంట్ , షిఫ్టెడ్, డెత్, డబుల్ జాబితాలో తమ పేర్లు ఉండి ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని అర్హులైన వారు నవంబర్ 21వ తేదీ వరకు ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించవచ్చని అన్నారు. అర్హులైన వ్యక్తులు తమ వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించి ఓటరు జాబితాలో పేరు చేర్చుకోవాలని సూచించారు. ఇప్పటికే ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ ఎన్యుమరేషన్ ఫారం సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి

ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశ్యం అర్హులైన ఏ ఒక్క ఓటరును కూడా ఓటు హక్కుకు దూరం చేయకుండా చూడటమేనని సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులైన వ్యక్తులు తమ వివరాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించి ఓటరు జాబితాలో పేరు చేర్చుకునేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటి విచారణ చేపట్టి, అర్హులైన ఓటర్లను గుర్తించి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయాలని సూచించారు. ఫారాలు అందని ఓటర్లను గుర్తించి, వారికి తిరిగి ఫారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ ఐడీలు అనుసంధానమై ఉన్న ఓటర్లకు వాట్సాప్, ఈ-మెయిల్ ద్వారా కూడా ఫారాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాలను ప్రదర్శించాలి

గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన,ఆబ్సెంట్ , షిఫ్టెడ్, డెత్, డబుల్ ఓటర్ల వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాల రూపంలో ప్రదర్శించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశించారు. ఆయా ఓటర్ల పేర్లు జాబితాలో చేర్చకపోవడానికి గల కారణాలను కూడా స్పష్టంగా పేర్కొనాలని తెలిపారు.ఈ వివరాలను ప్రతి పోలింగ్ కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉంచడంతో పాటు, ఎన్నికల సంఘం అధికారిక వెబ్సైట్లో కూడా పోలింగ్ కేంద్రాల వారీగా అందుబాటులో ఉంచాలని సూచించారు. జాబితాల్లోని వివరాలను పారదర్శకంగా ప్రజలకు తెలియజేయాలని, అర్హులైన ఓటర్లు తమ పేర్లను తిరిగి నమోదు చేసుకునేందుకు అవసరమైన సమాచారం అందించాలని అన్నారు.ఓటర్లు తమ పాత ఎపిక్ నంబర్ ఆధారంగా ఎన్నికల సంఘం వెబ్‌సైట్, ఈసీఐనెట్ యాప్ ద్వారా కూడా ఎన్యుమరేషన్ ఫారాలను డౌన్లోడ్ చేసుకుని సమర్పించవచ్చని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారు. ఒకే చిరునామాలో నివసిస్తున్న ఓటర్ల గతంలో ఎన్యుమరేషన్ ఫారం ఎందుకు సమర్పించలేకపోయారో వివరిస్తూ డిక్లరేషన్ ఇవ్వాలని సూచించారు. చిరునామా మారిన సంబంధిత చిరునామా ఆధారాలను సమర్పించాలని తెలిపారు.

అదే రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్లు కొత్త చిరునామాకు సంబంధించిన ఆధారాలను సంబంధిత ఎన్నికల అధికారులకు సమర్పించాలని పేర్కొన్నారు.

సమర్పించిన ఫారాలను సంబంధిత ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులైన ఓటర్ల పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ ప్రక్రియపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు తుది ఓటరు జాబితాలో ఉండేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, ఎలక్షన్ సిబ్బంది రాజేందర్ రెడ్డి, భరత్, రాణదీర్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పల్లా కిష్టారెడ్డికి ఘన నివాళులు

- **42వ వర్ధంతి సందర్భంగా స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన సీపీఐ నాయకులు**

దేవరకొండ, నవంబర్ 7(మనం న్యూస్): దేవరకొండ మండలం పడమటిపల్లిలో కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమ నిర్మాత, అమరజీవి కామ్రేడ్ పల్లా కిష్టారెడ్డి 42వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్మారక స్థూపం, చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. కామ్రేడ్ పల్లా కిష్టారెడ్డి పడమటిపల్లిలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. 1959 నుంచి 1982 వరకు వరుసగా ఏకగ్రీవ సర్పంచ్గా ఎన్నికై గ్రామ ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారని గుర్తుచేశారు. గ్రామ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి, కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసిన ఆయన ఆశయాలను, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్ రెడ్డి, శాఖ కార్యదర్శి పల్లా రంగారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు కిన్నెర యాదయ్య, గంగిడి రాంరెడ్డి, నాయకులు శ్రీపతి భూపాల్ రెడ్డి, జక్క మాధవరెడ్డి, పాత్లావత్ ధర్మ, శాఖ సహాయ కార్యదర్శులు కాటం గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శాఖ సభ్యులు కిన్నెర భారిములు, కడారి నర్సింహా, ఉడుత జంగయ్య, పల్లె కృష్ణయ్య, ఇప్పలపల్లి రాజు, పల్లె ప్రభాకర్, దాసరి రాములు, ముడి రాజు, కిన్నెర సంజీవ, పల్లా వెంకట్ రెడ్డి, కావలి బాల్రం, బచ్చగల కృష్ణయ్య, నూనె రమేష్, నూనె లక్ష్మయ్య, దాసరి మహేష్, పల్లె మున్ని, కాటం భాగ్యమ్మ, పి. సోమ్ల, పల్లె లింగయ్య, తూర్పటి తిరుపతయ్య, ఎండి కడారి ఆంజనేయులు, దాసరి తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



తిరుమలగిరి, నవంబర్ 7(మనం న్యూస్) తిరుమలగిరి మండలంలోని చింతలపుంట తండాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పంటలను శనివారం పరిశీలించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ పరిమళ, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సంధ్యారాణి గ్రామంలోని హై డెన్సిటీ (దగ్గర దగ్గర గా) కంది, మిర్చి పంటలతో పాటు వంగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మత్రప్రస్తుతం కంది పంట పూత దశలో ఉందని, ఈ దశలో పంటకు అవసరమైన పోషకాలను అందించాలని శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. అలాగే పంటల్లో ఆశించే చీడపీడలను ముందుగానే గుర్తించి, వాటి నివారణకు తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. పంటల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, వ్యవసాయ విస్తరణ అధికారి భవ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

సహోద్యోగి కష్టాల్లోనూ అండగా నిలిచిన ఉద్యోగులు

- **అనారోగ్యానికి గురైన హోంగార్డు బాలకృష్ణ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం**

సూర్యాపేట, నవంబర్ 07 (మనం ప్రతినిధి): సహోద్యోగుల కష్టసుఖాల్లో ఒక కుటుంబంలా అండగా నిలవాలన్న జిల్లా ఎస్పీ పిలుపుతో సూర్యాపేట జిల్లా పోలీసు సిబ్బంది మానవత్వాన్ని చాటుకున్నారు. చివ్వెంల పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్లోని ప్రముఖ గ్లెనీగిల్స్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో జిల్లా పోలీసు సిబ్బంది, ఒక కుటుంబంలా ఏకమై తమ వంతు సహకారం అందించారు. అందరూ కలిసి సేకరించిన రూ.లక్ష నగదును శనివారం చివ్వెంల ఎస్సై మహేశ్ బాలకృష్ణ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సహోద్యోగి కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం పోలీసు కుటుంబంలోని ఐక్యత, మానవత్వానికి నిదర్శనమని ఎస్సై నరసింహ పోలీసు అధికారులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులు సెల్ఫోన్లకు దూరంగా ఉండి క్రీడల వైపు రావాలి

- **విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం**
- **కలెక్టర్ బి. చంద్రశేఖర్**
- **కలెక్టర్ జట్టుపై పోలీసు జట్టు విజయం**

నల్గొండ, నవంబర్ 7 (మనం ప్రతినిధి): నేటి సమాజంలో పిల్లలు సెల్ఫోన్లు, సామాజిక మాధ్యమాలకు ఎక్కువ సమయం కేటాయిస్తూ విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆలోచనలు పెంపొందించడంతో పాటు, వారిని క్రీడల వైపు ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం నల్గొండలోని మేకల అభినవ్ స్టేడియంలో కలెక్టర్ జట్టు, పోలీసు జట్టు మధ్య నిర్వహించిన స్నేహపూర్వక క్రికెట్ పోటీని కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి శరత్ చంద్ర పవార్ తో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వ విధుల్లో నిత్యం బిజీగా ఉండే అధికారులు తమలోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు మంచి అవకాశమని, రోజువారీ విధులతో పాటు, అప్పుడప్పుడు క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం పెరుగుతాయని, ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా 10 నుంచి 18 సంవత్సరాల వయస్సు విద్యార్థులు, పిల్లలకు క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ స్నేహపూర్వక పోటీ నిర్వహించినట్లు చెప్పారు. నేటి పిల్లలు సెల్ఫోన్లకు అలవాటుపడి తల్లిదండ్రులకు తెలియకుండానే విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, తోటి వారితో మాట్లాడటం, కలిసిమెలిసి ఉండటం తగ్గిపోతోందని, పిల్లల ఆలోచనా విధానం ఆరోగ్యకరంగా ఉండాలంటే వారిని క్రీడల వైపు మళ్లించాల్సిన అవసరం ఉందని అన్నారు. 12 ఓవర్లకు జరిగిన ఈ పోటీకి కలెక్టర్ నాణెం వేయగా పోలీసు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. కలెక్టర్, పోలీసు అధికారి ఇరు జట్లకు ప్రాతినిధ్యం వహించడమే కాకుండా, స్వయంగా బ్యాటింగ్, బౌలింగ్ చేసి పోటీని ప్రారంభించి క్రీడాకారులలో స్ఫూర్తిని నింపారు. అనంతరం జరిగిన పోటీలో పోలీసు జట్టు 118 పరుగులు సాధించి విజయం సాధించగా, కలెక్టర్ జట్టు 107 పరుగులతో రెండో స్థానంలో నిలిచింది. ఉత్తమ బౌలర్ గా ఇరుగు రవి, ఉత్తమ బ్యాట్స్ మెన్ గా శ్రీరామ్, ఉత్తమ క్రీడాకారుడిగా హరిబాబు ట్రోఫీలు అందుకున్నారు. విజయం సాధించిన పోలీసు జట్టుకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, పోలీసు అధికారి, స్థానిక కార్పొరేటర్ సుభాష్ లు భారతీయ స్టేట్ బ్యాంకు సామాజిక బాధ్యత నిధులు 1,80,000 రూపాయలతో ఏర్పాటు చేసిన ఆర్ ఓ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు అధికారి రమేష్, స్థానిక కార్పొరేటర్ సుభాష్, భారతీయ స్టేట్ బ్యాంకు ప్రాంతీయ నిర్వాహకుడు పద్మ బాబుగౌడ్, ముఖ్య నిర్వాహకుడు శ్రీరాములు, కలెక్టరేట్ శాఖ నిర్వాహకుడు ఆర్ సౌమిత, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాహుల్, వ్యాఖ్యాత గిరిబాబు, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు

- **కౌంటింగ్ కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ**
- **కౌంటింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించిన జిల్లా ఎన్నికల అధికారి**
- **సమన్వయంతో విధులు నిర్వ హించిన కౌంటింగ్ సూపర్వైజర్లు, సిబ్బంది**
- **ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ఏర్పాట్లు**
- **ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఓట్ల లెక్కింపు**

మైలవరం నవంబర్ 07 మనం న్యూస్ : స్థానిక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో జరుగుతోందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. జిల్లాలోని పలు కౌంటింగ్ కేంద్రాలను ఆయన



విస్తృతంగా పర్యటించి పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు, కౌంటింగ్ సూపర్వైజర్లు, ఇతర సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ గ్రామీణ మండలంతో పాటు మైలవరం లకిరెడ్డి లక్ష్మిరెడ్డి ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన మైలవరం, రెడ్డిగూడెం మండలాల కౌంటింగ్ కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం కుంటముక్కులలోని లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జి. కొండూరు మండల కౌంటింగ్ కేంద్రాన్ని, కొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఇబ్రహింపట్నం మండల కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు విధానం, సిబ్బంది విధుల నిర్వహణ, ఎన్నికల సంఘం మార్గదర్శకాల అమలు, అభ్యర్థులు, వారి ఏజెంట్లకు కల్పించిన సౌకర్యా లను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి దశలోనూ ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఓట్ల లెక్కింపు నిర్వహించాలని అధికారులకు సూచించారు. కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి రౌండ్ ఓట్ల లెక్కింపును జాగ్రత్తగా నిర్వహించాలని, లెక్కింపు వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని ఆదేశించారు. ఏవైనా సందేహాలు లేదా సమస్యలు తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయడంతో పాటు భద్రతా చర్యలు చేపట్టామని, దీంతో విజయవంతంగా ఓట్ల లెక్కింపు జరుగుతోందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

ఆదిలాబాద్‌లో ఐటీ టవర్



హైదరాబాద్, నవంబర్ 7(మనంన్యూస్): ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన ఐటీ టవర్ ప్రారంభానికి సిద్ధమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నవంబర్ 9న ఆదిలాబాద్లో ఐటీ టవర్స్‌ను ప్రారంభించనున్నారు. ఆదిలాబాద్ పట్టణ శివార్లలో మావల మండలం బట్టిసావర్గాంవ్ వద్ద జాతీయ రహదారి-44 సమీపంలో రూ. 50 కోట్లు పైగా వ్యయంతో ఈ ఐటీ టవర్స్‌ను నిర్మించారు. తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ నోడల్ ఏజెన్సీగా ప్రాజెక్ట్ పనులు జరిగాయి. 65వేల చదరపు అడుగుల వైశాల్యంలో జీప్లస్ 4 అంతస్తుల్లో దీనిని నిర్మించారు. ఈ ఐటీ టవర్లో 2,000 మంది పనిచేసేలా రూపొందించారు. ఈ అత్యాధునిక ఐటీ టవర్లో ఆధునిక వంటగది, భోజనశాల ఉన్నాయి. దీంతో ఉద్యోగులు 24 గంటలూ పనిచేసేందుకు వీలు ఉంటుంది. ఐటీ టవర్లో విశాలమైన సమావేశ గదులు, పార్కింగ్ సౌకర్యం కూడా ఉన్నాయి. ఈ భవనంలో ఒక్కో షిఫ్టు 660 మంది ఉద్యోగులు... ఒక్కో కంపెనీలో 200 మంది సిబ్బందితో కనీసం 10 ఐటీ కంపెనీలు పనిచేసేందుకు అవకాశం ఉంది. ఆదిలాబాద్ పట్టణంలోని ఒక ప్రైవేట్ భవనం నుండి పనిచేస్తున్న ఐటీ కంపెనీ ఒకటి ఆదిలాబాద్ ఐటీ టవర్కు మారవచ్చని కూడా వార్తలు వస్తున్నాయి. అంతేకాకుండా, ఆదిలాబాద్ ఐటీ టవర్లో అందుబాటులో ఉన్న ప్లగ్-ఇన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ స్టార్టప్ కంపెనీలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం.ఇక, ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... ఈ ఐటీ టవర్ ప్రారంభం ఆదిలాబాద్ ప్రాంత అభివృద్ధికి ఊతమిస్తుందని చెప్పారు. అలాగే స్థానిక విద్యావంతులైన యువతకు తగిన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, ఆదిలాబాద్ ఐటీ భవనం ప్రారంభం కానుండటం, ఆ ప్రాంతంలోని ఉద్యోగార్థులలో ఆశలు రేకెత్తించింది. ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పూణే, నాగ్పూర్లకు వలస వెళ్లాల్సి ఇంజనీరింగ్ పట్టభద్రులు ఆదిలాబాద్లో ఈ టవర్ ఏర్పాటును స్వాగతించారు. తమ ఇంటికి దగ్గరలోనే ఉపాధి పొంది, సొంత ఊరి నుంచే పని చేయవచ్చని వారు ఆశిస్తున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ ప్రధాన ఐటీ హబ్ కాగా... ఐటీ సేవలు ద్వితీయ శ్రేణి నగరాలు, పట్టణాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే గతంలోనే హైదరాబాద్ వెలుపల ఐటీ హబ్లు, ఐటీ టవర్లను అందుబాటులోకి తెచ్చే ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే రాష్ట్రంలోని వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్నగర్, సిద్దిపేటలో ఐటీ టవర్లు ఏర్పాటు చేశారు. తాజాగా ఆదిలాబాద్లో ఐటీ టవర్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది.

మధ్యంతర ఎఫెక్ట్.. కీలక అధికారులకు షాకిస్తున్న ట్రంప్..!

వాషింగ్టన్, నవంబర్ 7: మధ్యంతర ఎన్నికల ఫలితాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. దీంతో తన అధికార బృందంలో ఆయన మార్పులు చేస్తున్నారు. తాజాగా వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా ఉన్న సుసీ వైల్స్‌పై వేటువేశారు. ఈ కీలక పదవిలో తన సన్నిహితుడు స్టీఫెన్ మిల్లర్‌ను నియమించారు. ఈ నిర్ణయాన్ని అధ్యక్షుడు ట్రూత్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు.

రాజకీయ వ్యూహకర్త అయిన సుసీవైల్స్ 2024లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఘన విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత అగ్రరాజ్యంలో అత్యంత కీలక పదవులుగా భావించే వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ పదవికి ఎంపికయ్యారు. యూఎస్ చరిత్రలో ఆ పదవి చేపట్టిన తొలి మహిళగా వైల్స్ రికార్డు సృష్టించారు. అయితే మధ్యంతర ఫలితాలు మాత్రం ఆమె పదవికి ఎసరుపెట్టాయి. అయితే తన రాజకీయ బృందంలో వైల్స్ కొనసాగుతారని ట్రంప్ చెప్పారు.



ఇంతకాలం వైల్స్‌కు డిప్యూటీగా ఉన్న స్టీఫెన్ మిల్లర్ ను ఆ స్థానంలో నియమించినట్లు చెప్పారు. ట్రంప్‌నకు సుదీర్ఘకాలంగా సలహాదారుగా వ్యవహరిస్తోన్న మిల్లర్.. యూఎస్ సర్కార్ వలస విధానాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. సరిహద్దు భద్రత, దేశ బహిష్కరణల వంటి అంశాల్లో కఠినవిధానాల వెనక ఆయన పేరు కూడా ప్రముఖంగా వినిపించింది.

కొనసాగుతోన్న రాజీనామాల పర్వం.. మరోవైపు, అమెరికా న్యాయశాఖలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. ఆ శాఖలో పౌర హక్కుల విభాగం చీఫ్‌గా పనిచేసిన హర్మీత్ ధిల్లన్.. ఎన్నికల ఫలితాల తర్వాత తన పదవికి రాజీనామా చేశారు. అదే బాటలో మరో ఇద్దరు అధికారులు బయటకు వెళ్లిపోయారు. వారిలో ఒకరు న్యాయశాఖలో జాతీయ భద్రతా విభాగానికి అధిపతిగా పనిచేసిన జాన్ ఐసెన్‌బర్గ్ కాగా.. మరొకరు సదరన్ డిస్ట్రిక్ట్ ఆఫ్ ఫ్లోరిడా యూఎస్ అటార్నీగా విధులు నిర్వర్తించిన జాసన్ రెడింగ్. మధ్యంతర ఎన్నికల ఫలితాల్లో అధికారి పార్టీకి ఓటమి ఎదురైనప్పుడు ఇలా కీలక పదవులు ఖాళీ అవడం సాధారణమే. ప్రభుత్వ విధానాలు, గత నిర్ణయాలపై యూఎస్ కాంగ్రెస్ కమిటీలు పెద్ద ఎత్తున విచారణలు జరిపే అవకాశం ఉండటంతో ఈ నిష్క్రమణలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.



ముసాయిదా ఓటరు జాబితాలో పేరు చేరని అర్హులకు మరో అవకాశం

- నిర్దేశిత ప్రకటనతో ఎన్యూమరేషన్ ఫారం సమర్పించాలి
- ఇప్పటికే ఫారం-6 సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయనవసరం లేదు
- నవంబర్ 21 నాటికి ప్రక్రియ పూర్తి చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు, నవంబర్ 7,మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు, ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు చేరని అర్హులైన ఓటర్లకు తమ పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చుకునేందుకు మరో అవకాశం కల్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. శనివారం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ఖిఐఖ-2026 ప్రక్రియ, ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ, ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేయడం, గైర్హాజరు, చిరునామా మార్పు, మరణించిన ఓటర్ల వివరాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా మరో ఏడు రాష్ట్రాల్లో ఖిఐఖ-2026 ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించని అర్హులైన ఓటర్లకు మరో అవకాశం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. గైర్హాజరు, చిరునామా మార్పు, మరణం, తదితర కారణాలతో ముసాయిదా ఓటరు జాబితాలో పేర్లు లేని అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 109-ములుగు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎస్ఐఆర్-2026 ప్రక్రియలో మొత్తం 27,842 మంది ఓటర్లను ఏఎస్డీ కేటగిరీ కింద గుర్తించినట్లు తెలిపారు. వీరిలో మరణించిన వారిగా 8,354 మంది, శాశ్వతంగా నివాసం మారిన వారిగా 14,207 మంది, డూప్లికేట్గా 4,015 మంది, ఆచూకీ లభించని వారిగా 1,219 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. గతంలో ఎన్యూమరేషన్ ఫారాలు జారీ అయినప్పటికీ, అవి తిరిగి అందక గైర్హాజరు, నివాసం మార్పు, మరణం, డూప్లికేట్ (ఏఎస్డీ)గా గుర్తించడం వల్ల ముసాయిదా జాబితాలో పేర్లు చేరని అర్హులైన ఓటర్లకు ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. సంబంధిత ఓటర్లు తమ ప్రస్తుత సాధారణ నివాస ప్రాంతానికి చెందిన ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్వో), సహాయ ఎన్నికల నమోదు అధికారి (ఏఈఆర్వో)లను సంప్రదించాలని సూచించారు. నివాసం మారకుండా అదే ప్రాంతంలో ఉంటున్న సంబంధిత ఓటర్లు పూర్తిచేసిన ఎన్యూమరేషన్ ఫారంతో పాటు, గతంలో ఫారం సమర్పించలేకపోవడానికి గల కారణాలను అనుబంధం-బీలో పేర్కొని సమర్పించాలని తెలిపారు. ఈ పత్రాలను సంబంధిత ఈఆర్వో, ఏఈఆర్వో లేదా బీఎల్వోకు స్వయంగా లేదా కుటుంబ సభ్యుల ద్వారా అందించవచ్చని పేర్కొన్నారు. ఈసీఐనెట్ ద్వారా ఈ-సంతకంతో ఆన్లైన్లో సమర్పించే సదుపాయాన్ని కూడా కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే మరో ప్రాంతానికి నివాసం మారి, ఈ ప్రత్యేక అవకాశం పరిధిలోకి వచ్చే ఓటర్లు ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎన్యూమరేషన్ ఫారంతో పాటు అనుబంధం-సీలో పాత, కొత్త చిరునామాలు, కొత్త నియోజకవర్గ వివరాలను నమోదు చేసి, నివాస ధృవీకరణ పత్రంతో ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతానికి సంబంధించిన ఈఆర్వో లేదా ఏఈఆర్వోకు సమర్పించాలని సూచించారు. అవసరమైన సహాయం కోసం కొత్త నివాస ప్రాంతంలోని బీఎల్వోను సంప్రదించవచ్చని తెలిపారు. చిరునామా ధృవీకరణ పత్రాలు లేని నిరాశ్రయులకు బీఎల్వో క్షేత్రస్థాయి పరిశీలన నివేదికను నివాస రుజువుగా పరిగణిస్తారని పేర్కొన్నారు. సంబంధిత ఓటర్లు తమ పాత ఓటరు గుర్తింపు కార్డు సంఖ్యను ఉపయోగించి భారత ఎన్నికల సంఘం వెబ్సైట్ లేదా ఈసీఐనెట్ యాప్ ద్వారా ఎన్యూమరేషన్ ఫారాన్ని పొందవచ్చని తెలిపారు. ఇప్పటికే ఎస్ఐఆర్ ప్రక్రియలో కొత్త ఓటరు నమోదుకు ఫారం-6 సమర్పించిన వారు తిరిగి ఎన్యూమరేషన్ ఫారం, అనుబంధ ప్రకటన సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సంబంధిత ఓటర్ల జాబితాలను పేరు చేరకపోవడానికి గల కారణాలతో సహా పోలింగ్ కేంద్రాలు, పంచాయతీ కార్యాలయాలు, సంబంధిత ఇతర కార్యాలయాల్లో మళ్లీ ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. ఈ జాబితాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్సైట్లోనూ అందుబాటులో ఉంచాలని ఆదేశాల్లో పేర్కొన్నట్లు తెలిపారు. బీఎల్వోలు రాజకీయ పార్టీల బూత్ఖాయి ఏజెంట్ల సహకారంతో ఇంటింటికీ వెళ్లి సంబంధిత ఓటర్లను సంప్రదించి, ఫారాలు అందజేయడంతో పాటు వాటిని సమర్పించే విధానంపై అవగాహన కల్పించాలని సూచించారు. అందుబాటులో ఉన్న సంప్రదింపు వివరాల ఆధారంగా వాట్సాప్, ఈమెయిల్, ఎస్ఎంఎస్ తదితర మార్గాల ద్వారా కూడా ఫారాలను అందించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అందిన దరఖాస్తులపై అర్హత, సాధారణ నివాసం తదితర వివరాలను నిబంధనల మేరకు పరిశీలించి, ఆమోదించిన పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఆమోదం పొందిన ఓటర్లకు గతంలో కేటాయించిన ఓటరు గుర్తింపు కార్డు సంఖ్యనే తిరిగి కేటాయిస్తారని పేర్కొన్నారు. ఈ ప్రక్రియను నవంబర్ 21 నాటికి అన్ని విధాలా పూర్తి చేసి, వివరాలతో కూడిన నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పేర్లను తుది ఓటరు జాబితాలో చేర్చుకునేందుకు అవసరమైన పత్రాలను సకాలంలో సమర్పించాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అటవీ, పర్యావరణ అంశాలపై జయేశ్ రంజన్‌తో మంత్రి సీతక్క చర్చలు

స్పెషల్ చీఫ్ సెక్రటరీకి ఘన సత్కారం.. సమ్మక్క సారలమ్మ జ్ఞాపిక అందజేత



ములుగు, నవంబర్ 7,మనం ప్రతినిధి: ములుగు జిల్లా అభివృద్ధిలో అటవీ, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. అటవీ, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఐఏఎస్ శనివారం తొలిసారిగా ములుగు జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కలెక్టరేట్లో మంత్రి సీతక్క ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సమ్మక్క సారలమ్మ దేవతల జ్ఞాపికను అందజేశారు. అనంతరం జిల్లాలో అటవీ శాఖ, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై ఆయనతో చర్చించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎస్పీ కేఎస్ కేఖన్ సుధీర్ రామ్నాథ్, డీఎఫ్ఓ వికాస్ మీనా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారుల జీవితాల్లో దీపావళి వెలుగులు

- జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 30 మంది చిన్నారులకు దీపావళి కిట్ల పంపిణీ



మంగపేట, నవంబర్ 7, మనం ప్రతినిధి: పండుగ ఆనందాన్ని అందరితో పంచుకోవాలనే ఉద్దేశంతో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద చిన్నారులకు దీపావళి కిట్లను పంపిణీ చేశారు. పండుగ జరుపుకునే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు చెందిన 30 మంది చిన్నారులను గుర్తించి స్వీట్లు, పండ్లు, టపాసులతో కూడిన కిట్లను అందజేశారు. 'ఒక చిన్నారి - ఒక చిరునవ్వు - ఒక వెలుగు' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంగపేట ఎస్సై మధుకర్ మాట్లాడుతూ.. నిరుపేద చిన్నారులకు దీపావళి ఆనందాన్ని పంచేందుకు ట్రస్ట్ చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగించాలని, తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని, టపాసులు కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పండుగ సంతోషాన్ని ఆర్థిక స్థోమత లేని చిన్నారులతో పంచుకోవడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు గంగుల చంటి, వీరన్, కార్యదర్శి భాస్కర్, ప్రచార కార్యదర్శి మహమ్మద్ ఖాజా, ఎడ్లపల్లి సాయి, నిమ్మల నరేష్, మావిలా నాగరాజు, సోషల్ మీడియా ఇన్చార్జి శ్రావణ్, భూక్యా రవి, గోలి విద్యాసాగర్, సాధనపల్లి శంభుశివరావు, కర్రె లక్ష్మణ్, తోగారు సురేష్, బూర సాయి, బూర గణేష్, ఉడుగుల మాణిదీప్ తదితరులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించాలి



- ములుగు జిల్లా అధికారులకు ఆదేశాలు.. పోస్టర్ ఆవిష్కరణ

ములుగు, నవంబర్ 7,మనం ప్రతినిధి: జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో నిర్మాణాలు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లలో ఈ నెల 8న 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎం.సంపత్రావు ఆవిష్కరించారు. ప్రాజెక్టు డైరెక్టర్ జి.కృష్ణప్రసాద్, ఇతర జిల్లా స్థాయి అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామాల్లో పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి వేడుకలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఎంపీడీవోలు, ఎంపీవోలు, అసిస్టెంట్ ఇంజినీర్లు, హౌసింగ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, వార్డు సభ్యులు, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపారు.

ప్రతి గ్రామానికీ తాగునీరు అందించేందుకు పటిష్ఠ చర్యలు

- రామప్ప జలాశయంలో ఏడాదికి సరిపడా నీటి నిల్వలు
- రూ.18 కోట్లతో 97 గ్రామాల్లో తాగునీటి సరఫరా బలోపేతానికి ప్రతిపాదనలు
- జిల్లా స్థాయి కమిటీతో తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ
- నవంబర్ 15 నుంచి డిసెంబర్ 30 వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యక్రమం
- తాగునీటిని పొదుపుగా వినియోగించి వృథాను అరికట్టాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు




ములుగు, నవంబర్ 7, మనం ప్రతినిధి: ములుగు జిల్లాలో ప్రతి గ్రామానికి తాగునీటిని అందించేందుకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాతోపాటు స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎల్నినో పరిస్థితుల వల్ల వర్షపాతం, భూగర్భ జలాలు, ఉపరితల నీటి వనరులపై పడే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ చైర్మన్గా జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీ ద్వారా గ్రామీణ ఆవాసాలు, పట్టణ స్థానిక సంస్థల పరిధిలో తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రతి 15 రోజులకు ఒకసారి లేదా అవసరమైనప్పుడు సమావేశమై నీటి నిల్వలు, భూగర్భ జలాల లభ్యత, సరఫరా పరిస్థితిని సమీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. నీటి కొరత తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి, ప్రత్యామ్నాయ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. జిల్లాకు ప్రధానంగా రామప్ప జలాశయం, గోదావరి నది నుంచి తాగునీరు అందుతోందని తెలిపారు. రామప్ప జలాశయం ద్వారా ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్, గోవిందరావుపేట మండలాల్లోని 152 గ్రామాలకు, ములుగు మున్సిపాలిటీకి మిషన్ భగీరథ నీటి సరఫరా జరుగుతోందని వివరించారు. ప్రస్తుతం రామప్ప జలాశయంలో ఒక సంవత్సరానికి సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. గోదావరి నదిపై ఉన్న రెండు ఇంటేక్ వెల్స్, మూడు నీటి శుద్ధి కేంద్రాల ద్వారా తాడ్వాయి, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాలకు తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. మిషన్ భగీరథ నీటి సరఫరాకు ప్రత్యామ్నాయంగా స్థానిక నీటి వనరులను వినియోగిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని 171 గ్రామ పంచాయతీల పరిధిలో 477 ఆవాసాలకు సంబంధించి 1,639 చేతిపంపులు, 810 సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ మోటార్లు, 335 బావులు ఉన్నాయని వివరించారు. 53 గుత్తికోయ గ్రామాల్లో 48 గ్రామాలకు చేతిపంపుల ద్వారా నీటిని అందిస్తున్నామని, మిగిలిన ఐదు గ్రామాల్లో అవసరాన్ని బట్టి ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సరఫరాను మరింత బలోపేతం చేసేందుకు రూ.18 కోట్లతో 97 గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ల విస్తరణ, కొత్త బోర్లు, పంపుసెట్ల ఏర్పాటు తదితర పనులకు ప్రతిపాదనలు రూపొందించామని తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల సహకారంతో పంచాయతీ నిధుల ద్వారా ఇప్పటికే 261 చేతిపంపులు, 62 పంపుసెట్లకు మరమ్మతులు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించామని వివరించారు.

భూగర్భ జలమట్టం తగ్గడం, మరమ్మతులు తదితర కారణాలతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. అవసరమైన చోట సమీప వ్యవసాయ బావులు, బోర్లను అద్దెకు తీసుకోవడం, బోర్లను ఫ్లషింగ్ చేయించడం, బావుల్లో పూడిక తొలగించడం, ట్యాంకర్ల ద్వారా నీటిని అందించడం వంటి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో మరమ్మతులు, నీటి వనరుల పునరుద్ధరణ పనులు చేపట్టి సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు.

నవంబర్ 15 నుంచి డిసెంబర్ 30 వరకు తాగునీటి సరఫరాపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ రెండో వారంలోగా ఎంపీడీఓల ఆధ్వర్యంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత ఏఈఈలు, ఏఈలు, ఎంపీఓలతో మండల స్థాయి సమావేశాలు నిర్వహించి గ్రామాలవారీగా నీటి సరఫరా పరిస్థితిపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్ ఏఈఈలు, ఏఈలు, ఎంపీఓలు, సంబంధిత సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో మండల బృందాలను ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యక్రమానికి రోజువారీ కార్యాచరణ రూపొందించాలని సూచించారు. జిల్లా పంచాయతీ అధికారి, మిషన్ భగీరథ అధికారుల పర్యవేక్షణలో సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో గుర్తించిన సమస్యలను రోజువారీగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే ప్రజలు సంబంధిత పంచాయతీ కార్యదర్శి లేదా మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సునీత 91001 20952, జేఈ శిరీష 8712035486 నెంబర్ లకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. తాగునీటిని అవసరమైనంత మేరకే వినియోగించాలని, కుళాయిలను అనవసరంగా తెరిచి ఉంచవద్దని కోరారు. నీటి లీకేజీలు కనిపిస్తే వెంటనే సంబంధిత సిబ్బందికి సమాచారం అందించాలని, నీటి వృథాను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల వద్ద దీపావళి వేడుకలు నిర్వహించాలి




- కాంగ్రెస్ శ్రేణులకు మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు పిలుపు

మంగపేట, నవంబర్ 7, మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి' కార్యక్రమాన్ని ఆదివారం (నవంబర్ 8) మంగపేట మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు తమ తమ గ్రామాల్లోని ఇందిరమ్మ ఇళ్ల వద్ద నిర్వహించే దీపావళి వేడుకలకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపాలు వెలిగించి వేడుకల్లో భాగస్వాములు కావాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- మంగపేట మండలం బుచ్చంపేటలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



మంగపేట, నవంబర్ 7,మనం ప్రతినిధి: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మండల పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మంగపేట మండలంలోని బుచ్చంపేట గ్రామంలో మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అయ్యోరి యానయ్య, జిల్లా నాయకులు మాసిరెడ్డి వెంకటరెడ్డి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ నాయకుడు జంగం భానుచందర్, గడ్డం శ్రీహరి, పల్లె శోభన్, పన్నాల కొండలెడ్డి, గడ్డం పరమేశ్, రాచకొండ సోమయ్య, రేషన్ డీలర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఎన్ఎస్యూఐ నాయకుడికి పరామర్శ



ములుగు, నవంబర్ 7,మనం ప్రతినిధి: అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ములుగు మండల ఎన్ఎస్యూఐ మాజీ అధ్యక్షుడు గొర్రె రాహుల్ను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ శనివారం పరామర్శించారు. మంత్రి సీతక్క ఆదేశాలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనల మేరకు కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆసుపత్రికి వెళ్లి రాహుల్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. రాహుల్ త్వరగా కోలుకుని తిరిగి ప్రజా జీవితంలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షిస్తూ ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ జక్కుల రేవంత్ యాదవ్, జిల్లా నాయకుడు లక్కీ, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గూడెపు రాకేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి బొమ్మగాని ప్రభు తదితరులు పాల్గొన్నారు.



న్యూజిలాండ్ పై సిక్సర్ల రికార్డు బ్రేక్ చేసిన రోహిత్ శర్మ

న్యూజిలాండ్ తో రెండో వన్డే మ్యాచ్ లో రోహిత్ శర్మ (23; 28 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్ లు) క్రీజులో ఉన్నంతసేపు ఆకట్టుకున్నాడు. రెండు అద్భుతమైన సిక్స్ లు కొట్టాడు. ఈ క్రమంలో హిట్ మ్యాన్ ఓ రికార్డును ఖాతాలో వేసుకున్నాడు. వన్డేల్లో న్యూజిలాండ్ పై అత్యధిక సిక్సర్లు బాదిన బ్యాటర్ గా నిలిచాడు. ఇప్పటివరకు పాక్ మాజీ ఆల్ రౌండర్ షాహిద్ అఫ్రిది (50) పేరిట ఈ రికార్డు ఉండేది. కివీస్ పై రెండో వన్డేలో రెండు సిక్స్ లు కొట్టడం ద్వారా రోహిత్ (51) ఆ రికార్డును బ్రేక్ చేశాడు. ఈ జాబితాలో వెస్టిండీస్ స్టార్ క్రిస్ గేల్ (45) మూడో స్థానంలో ఉన్నాడు. ఇక, ఓవరాల్గా అంతర్జాతీయ క్రికెట్ లో న్యూజిలాండ్ పై అత్యధిక సిక్సర్లు బాదిన వారిలో క్రిస్ గేల్ (87) అగ్రస్థానంలో ఉన్నాడు. 85 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్న రోహిత్.. ఈ వన్డే సిరీస్ లో గేల్ రికార్డును బ్రేక్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

తొలి ప్లేయర్ గా నిలవనున్న కోహ్లీ!

న్యూజిలాండ్తో రెండో వన్డేలో విరాట్ కోహ్లీ ఏడు పరుగులే చేసి వెనుదిరిగాడు. అయినా విరాట్ ఓ ఘనత సాధించాడు. వన్డేల్లో న్యూజిలాండ్ పై అత్యధిక రన్స్ (1,978) చేసిన ప్లేయర్గా నిలిచాడు. ఈ మ్యాచ్కు ముందు ఆసీస్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ (1,971)తో కలిసి కోహ్లీ సమంగా ఉన్నాడు. ఇక, ఈ సిరీస్లో మరో మూడు వన్డేలు ఆడనున్న విరాట్.. వన్డేల్లో న్యూజిలాండ్ పై 2,000 లేదా అంతకన్నా ఎక్కువ పరుగులు చేసిన తొలి క్రికెటర్ గా నిలిచే ఛాన్స్ ఉంది.

న్యూజిలాండ్‌ను చిత్తు చేసిన టీమిండియా



న్యూజిలాండ్ తో వన్డే సిరీస్ లో టీమిండియా విజయపరంపర కొనసాగుతోంది. వెల్లింగ్టన్ వేదికగా ఉత్కంఠగా సాగిన లో స్కోరింగ్ మ్యాచ్ లో.. చెమటోడ్చి మరీ భారత్ ఎట్టకేలకు గెలుపొందింది. తద్వారా ఐదు మ్యాచ్ ల సిరీస్ లో 2-0తో ఆధిక్యంలో నిలిచింది. హెన్రీ స్టేడియంలో శనివారం వర్షం అంతరాయం వల్ల టాస్ ఆలస్యమైంది. దీంతో మ్యాచ్ ను 47 ఓవర్లకు కుదించగా.. టాస్ గెలిచిన టీమిండియా తొలుత బౌలింగ్ ఎంచుకుంది.

134 పరుగులకే

ఈ క్రమంలో బ్యాటింగ్ కు దిగిన కివీస్.. 41 ఓవర్లలో కేవలం 134 పరుగులకే కుప్పకూలింది. భారత బౌలర్ల దెబ్బకు టాపార్డర్ కుదేలు కాగా.. నాలుగో స్థానంలో వచ్చిన డారిల్ మిచెల్ అర్ధ శతకం (104 బంతుల్లో 55)తో జట్టును ఆదుకున్నాడు. అతడికి తోడుగా కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 31 పరుగులతో రాణించాడు.

ఫలితంగా న్యూజిలాండ్ గౌరవప్రదమైన స్కోరు చేయగలిగింది. టీమిండియా బౌలర్లలో గుర్నూర్ బ్రార్ నాలుగు వికెట్లతో చెలరేగగా.. ఆకిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, అక్షర్ పటేల్ తలా రెండు వికెట్లు కూల్చారు. అనంతరం స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ ఆరంభంలో తడబడింది.

గిల్, కోహ్లి విఫలమైనా

ఓపెనర్, కెప్టెన్ శుబ్ మన్ గిల్ వన్డే కెరీర్ లో తొలిసారి గోల్డెన్ డకౌట్గా వెనుదిరిగాడు. జేకబ్ డఫీ బౌలింగ్ లో ఎదుర్కొన్న తొలి బంతికే నికోల్స్ కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఇక వన్డౌన్ బ్యాటర్ విరాట్ కోహ్లి ఏడు పరుగులకే నిష్క్రమించాడు.

రాణించిన శ్రేయస్

ఇలాంటి తరుణంలో మరో ఓపెనర్ రోహిత్ శర్మ, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్ కాస్త ఓపికగా ఆడారు. అయితే, రోహిత్ 28 బంతుల్లో 23 పరుగులు చేసి కైలీ జెమీషన్ బౌలింగ్లో అవుటయ్యాడు. శ్రేయస్ 46 బంతులు ఎదుర్కొని నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 30 పరుగులు చేశాడు.

రోహిత్- శ్రేయస్ కలిసి మూడో వికెట్ కు 30 బంతుల్లో 22 పరుగులు జోడించగా.. రాహుల్-శ్రేయస్ ఈ మ్యాచ్ లో అత్యధికంగా 39 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. మిగిలిన వారిలో స్పిన్ బౌలింగ్ ఆల్ రౌండర్లు అక్షర్ పటేల్ (7), నమన్ ధీర్ (12) నిరాశపరచగా.. అన్షుల్ ఒక్క పరుగు చేసి అవుటయ్యాడు.

113 పరుగుల వద్ద ఉన్న వేళ

ఇలాంటి తరుణంలో టీమిండియా 26 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 113 పరుగుల వద్ద ఉన్న వేళ వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. భారత్ విజయానికి 22 పరుగులు అవసరమైన వేళ వాన మొదలైంది. అప్పటికి కేఎల్ రాహుల్ 26, ఆకిబ్ నబీ ఒక పరుగుతో ఉన్నారు.

డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం

అయితే, అప్పటికే డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం టీమిండియా నిర్ణీత లక్ష్యం (109) కంటే నాలుగు పరుగులు ముందంజలో నిలిచింది. ఈ క్రమంలో కాస్త వర్షం తెరిపినివ్వగా భారత్ లక్ష్యాన్ని 37 ఓవర్లలో 133 పరుగులుగా నిర్దేశించారు. ఆ తర్వాత మళ్లీ జల్లులు కురిశాయి. దీంతో మ్యాచ్ కొనసాగే పరిస్థితి లేకపోవడంతో డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం టీమిండియా నాలుగు పరుగుల తేడాతో గెలుపొందినట్లు ప్రకటన వెలువడింది.

ధోనీని 'మాహీ అంకుల్' అని పిలుస్తా: నటి అనుష్క సేన్



'కెప్టెన్' కూల్ ఎంఎస్ ధోనీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. ఆయనను ఒక్కసారైనా నేరుగా చూడాలని ఎంతోమంది ఆశపడుతారు. అలాంటి ధోనీతో తనకు చిన్ననాటి నుంచి ప్రత్యేక అనుబంధం ఉందని నటి, సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్ అనుష్క సేన్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆయనను తాను ప్రేమగా 'మాహీ అంకుల్' అని పిలుస్తానని.. ధోనీ తనను చిక్కీ అని అంటారని తెలిపారు.

గతంలో ధోనీతో కలిసి పలు వాణిజ్య ప్రకటనల్లో నటించడం వల్ల తమ మధ్య మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. పదేళ్ల క్రితం మొదటిసారి ధోనీని కలిసినప్పటి విషయాలను ఆమె ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తామిద్దరం రాంచీ నుంచే వచ్చామన్నారు. ధోనీతో కలిసి తాను ఏడేళ్లపాటు 21 ప్రకటనల్లో నటించానని తెలిపారు. ఇప్పటికీ ఎక్కడైనా కలిస్తే.. ఆయన ఎంతో ప్రేమగా దగ్గరకు తీసుకుంటారన్నారు. 'యహా మై ఘర్ ఘర్ ఖేలీ' సీరియల్తో అనుష్క సేన్ ఏడేళ్లకే తన నటనా ప్రయాణాన్ని ప్రారంభించారు. అనేక వాణిజ్య ప్రకటనల్లో నటించారు. 'బాల్ వీర్'లో మెహర్ పాత్ర ఆమెకు మంచి గుర్తింపు తెచ్చింది. దేవోంకే దేవ్ మహాదేవ్, ఝాన్సీ కీ రాణి వంటి వాటిల్లో నటించారు.



















































Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.